

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పద్ధతి మార్చుకోకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తా

- విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే వారికి జాబ్ ఎందుకు?
- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆగ్రహం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : 'శాఖ తరపు చేయాల్సిన కనీస విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే వారికి ఉద్యోగం ఎందుకు? పద్ధతి మార్చుకొని పనిచేయకపోతే ఉద్యోగం నుంచి తొలగించడానికి కూడా వెనుకాడేది లేదు'అని కలెక్టర్ తమీమ్ అన్సారియా... కొందరు అధికారులను హెచ్చరించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం స్త్రీ సంక్షేమశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆ శాఖ అధికారుల తీరుపై కలెక్టర్ మండిపడ్డారు. శాఖ ద్వారా అందిస్తున్న సేవలు, సిబ్బంది, ఖాళీలు, ఎంత మంది చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేయించుకున్నారని ప్రశ్నించారు. వాటిని నిర్వహిస్తున్న భవనాలు (స్వంత, అద్దె) తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో 12 రకాల రిజిస్టర్లు ఉంటాయని, పిల్లల హాజరు, ఎత్తు, బరువు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీ, వ్యాక్సినేషన్, సెక్టార్ సమావేశాల నిర్వహణ తదితర అంశాలన్నింటినీ ఆ రికార్డుల్లో నమోదు చేస్తామని ఐసీడీఎస్ పీడీ సువర్ణ ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి

మిగతా 6లో...

పోలీసు శాఖలో బదిలీలు

- ఏఎస్సైలు 59, హెడ్ కానిస్టేబుళ్లు 71, కానిస్టేబుళ్లు 101 మంది



ఒంగోలు క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. మొత్తం 231 మంది సిబ్బందిని బదిలీ చేస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలో ఐదేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారి వద్ద మూడు ఆప్షన్స్ తీసుకొని వారికి అనుగుణంగా ఉన్న ప్రాంతాలకు బదిలీ చేశారు. అదే సమయంలో ఏడాదికి పైబడి వీఆర్‌లో ఉన్న సిబ్బందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆటాచ్‌మెంట్‌లు ఉన్న వారికి కూడా ఆనువైన పోస్టింగ్‌లు ఇచ్చారు. బదిలీ అయిన వారిలో ఏఎస్సైలు 59, హెడ్‌కానిస్టేబుళ్లు 71, కానిస్టేబుళ్లు 101 మంది ఉన్నారు.

యథేచ్ఛగా కేంద్రాల వెలుపల అక్రమ కొనుగోళ్లు

లోగ్రేడ్ కొనక కొనసాగుతున్న నోబిడ్లు


లీజు బ్యారన్ల రిజిస్ట్రేషన్లకు మూడేళ్ల నిబంధనపై రైతుల్లో విముఖత

తాజాగా మళ్లీ పెనాల్టీల విధింపుపై బోర్డు కసరత్తు

వ్యతిరేకిస్తున్న రైతు ప్రతినిధులు

పొగాకు రైతుల్లో అలజడి

వేలం ప్రారంభమై ఐదున్నర నెలలు దాటినా ఇంకా ఇళ్ల వద్దనే 45 శాతం పంట



మార్కెట్లో ఎదురవుతున్న ఇబ్బందులు, వ్యాపారుల తీరు, బోర్డు యంత్రాంగం వైఖరితో పొగాకు రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. అదీ చాలదన్నట్లు వేలం కేంద్రాల్లో వ్యాపారులు కూటమి కట్టి, గరిష్ఠ ధరలపై సీలింగ్ పెట్టి నియంత్రించడమే కాక లోగ్రేడ్ కొనకపోతుండటంతో నిత్యం భారీగా నోబిడ్లు అవుతున్నాయి. అదే సమయంలో కేంద్రాల వెలుపల కొందరు వ్యాపారులు రైతుల అవసరాలను ఆసరా చేసుకుని అక్రమంగా కొనుగోళ్లు చేస్తున్నా, బోర్డు యంత్రాంగం నియంత్రించలేకపోతోంది. ఇంకొకవైపు ఇక నుంచి బ్యారన్ లైసెన్సుల పునరుద్ధరణ, రిజిస్ట్రేషన్లు మూడేళ్లకు ఒకసారి అమలులోకి తెచ్చింది. లీజు బ్యారన్లకు కూడా మూడేళ్ల నిబంధన వర్తించేలా షరతు పెట్టడం, గత రెండేళ్లు ఆపేసిన అధిక పంట ఉత్పత్తిపై పెనాల్టీలను తిరిగి ఈ సీజన్ నుంచే అమలుకు బోర్డు పూనుకోవడంపై రైతుల్లో అలజడి రేగుతోంది. పలు వేలం కేంద్రాల్లో బోర్డు అధికారులు బుధవారం రైతు కమిటీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పెనాల్టీలపై అభిప్రాయాలు కోరగా ఈ ఏడాది కూడా వేయరాదని తేల్చిచెప్పారు.

ఒంగోలు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : దక్షిణాదిలో 2024-25 పంట కాలానికి పొగాకు బోర్డు 105 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా సుమారు 162 మిలియన్లు ఉత్పత్తి అయినట్లు అంచనా. ఉత్తరాదిలో కూడా అలాగే అధికంగానే ఉత్పత్తి జరిగింది. ఈ ఏడాది మార్చి 10 నుంచి వేలం ప్రక్రియ ప్రారంభం కాగా ఆరంభంలో కొంత బాగానే ఉన్నా అనంతరం మార్కెట్ పూర్తిగా తిరోగమనంలో నడుస్తోంది. వేలం ప్రక్రియ ప్రారంభమై ఇప్పటికి ఐదు మాసాలు దాటింది. వచ్చే సీజన్ పంట సాగుకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమై పలుచోట్ల నార్లు కూడా పోస్తున్నారు. అయినా ఇప్పటివరకు 90 మిలియన్లు మించి సరుకును కొన్న పరిస్థితి లేదు. పైగా సగటున కిలోకు రూ.240 మాత్రమే లభిస్తోంది. పండిన పంటలో ఇంకా 45శాతం వరకు రైతుల ఇళ్ల వద్దనే ఉంది. మేలురకం బేళ్ల కోసం వేలంకేంద్రాల్లో పోటీపడుతున్న వ్యాపారులు ధరలు మాత్రం పెంచడం లేదు. కూటమి కట్టి సీలింగ్ పెట్టి కిలో రూ.280 ధర దాటనీయడం లేదు. అదే సమయంలో లోగ్రేడ్ బేళ్లను అసలు కొనడం లేదు. దీంతో నిత్యం సగటున 25 నుంచి 30శాతం నోబిడ్ అవుతున్నాయి.

ఇష్టారాజ్యంగా బయట కొనుగోళ్లు



ఒంగోలు2 వేలం కేంద్రంలో రైతు ప్రతినిధులతో వేలం కేంద్ర అధికారి సమావేశం

మార్కెట్ పరిస్థితిని చక్కదిద్దడంలో బోర్డు యంత్రాంగం విఫలం కాగా ప్రస్తుతం వ్యాపారులు మరొక అడుగు ముందుకేసి భారీగా వేలం కేంద్రాల వెలుపల అక్రమ కొనుగోళ్లు యథేచ్ఛగా చేస్తున్నారు. కేంద్రాలలో పెద్ద కంపెనీలతో పోటీ పడలేని చిన్న కంపెనీలు, డీలర్లు రైతుల అవసరాలను, వారి బలహీనతలను ఆసరా చేసుకొని కిలో రూ.250 నుంచి రూ.265 వరకు ఇచ్చి మేలురకం బేళ్లను కొంటున్నారు. వారం పదిరోజులుగా పలు గ్రామాల్లో ఈ తరహా కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. ఇంకా భారీగా పంట ఇళ్ల వద్ద నిల్వలు ఉండటం, ఆర్థిక అవసరాలు, భవిష్యత్‌లోనైనా ధరలు

మిగతా 6లో...

అంతర్ జిల్లాల బదిలీలకు మార్గదర్శకాలు

- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

ఒంగోలు విద్య, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాఠశాల విద్యాడైరెక్టర్ విజయరామరాజు బదిలీలకు మార్గదర్శకాలు, షెడ్యూల్ విడుదల చేశారు. జీవిత భాగస్వామి (స్పౌజ్), పరస్పర బదిలీలను మాత్రమే ప్రభుత్వం అనుమతించింది. అంతర్ జిల్లా బదిలీలకు అర్హులైన టీచర్లు, హెచ్‌ఎంలు ఈనెల 21 నుంచి 24 వరకు లీప్‌యాప్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. దరఖాస్తు ప్రింట్‌కాపీని మండల విద్యాధికారులకు ఈనెల 22 నుంచి 25వతేదీలోపు సమర్పించాలి. ఈ దరఖాస్తులను ఈనెల 23 నుంచి 26 వరకు డీఈవోలు పరిశీలించాలి. అంతర్ జిల్లా బదిలీ దరఖాస్తులను ఈనెల 27న పాఠశాల విద్యా డైరెక్టర్‌కు సమర్పించాలి. 28, 29 తేదీల్లో పాఠశాల విద్యాడైరెక్టర్ కార్యాలయం పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుంది. 30న దరఖాస్తులను ప్రభుత్వానికి సమర్పిస్తారు. టీచర్లు, హెచ్‌ఎంల అంతర్‌జిల్లా బదిలీలకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న వారే అర్హులు. ఈ ఏడాది జూలై 3న ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా కేటగిరీ, కనీసం రెండు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసి ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, యూనివర్శిటీలు, హెచ్‌వోడీలు, సచివాలయ, స్థానిక సంస్థల ఉద్యోగుల జీవితభాగస్వాములు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. బదిలీ కోరుకునే జిల్లాలో ఖాళీ ఉంటేనే దరకాస్తు చేయాలి. ఒకే యాజమాన్యం, ఒకే కేటగిరీలో పనిచేస్తున్న వారే పరస్పర బదిలీకి దరఖాస్తు చేసుకునేవారు. ఇద్దరు టీచర్లు బదిలీ సమ్మతి తెలుపుతూ దానికి సంబంధిత మండల విద్యాధికారి, ఉపవిద్యాధికారి ఆమోదం తీసుకోవాలి. పరస్పర బదిలీకి ఒక టీచర్ ఇతర జిల్లాలోని మరో టీచర్ ఒకరికి మాత్రమే సమ్మతి తెలిపారు. అభియోగాలు ఎదుర్కొంటున్నవారు, శాఖపరమైన చర్యలు సస్పెన్షన్ ఉన్నవారు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు.



పుస్తక ప్రియుల పాదయాత్రలో ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్‌కుమార్

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

- విద్యార్థులు విజ్ఞానవంతమైన పుస్తకాలూ చదవాలి
- ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ పిలుపు
- ఘనంగా పుస్తక ప్రియుల పాదయాత్ర

7

నల్లమలలో గుప్త నిధుల కోసం తవ్వకాలు | ఎక్స్‌కవేటర్, జీపు స్వాధీనం | అదుపులో ఇద్దరు నిందితులు 6

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

పోలీసుల అదుపులో ముగ్గురు

26 దుంగలు స్వాధీనం

ఒక మోటార్‌బైక్ సీజ్

మెయిన్‌లో

గణేష్ ఉత్సవాల్లో తస్మాత్ జాగ్రత్త..!

- ఆన్‌లైన్‌లో అనుమతులు తప్పనిసరి : ఎస్పీ దామోదర్

7

టీచర్ మందలించిందని...

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కంభం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కంభం బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సృజన అనే విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటన గురువారం జరిగింది. గురువారం ఉదయం స్టడీ అవర్స్‌లో ప్రాజెక్టు వర్క్ విషయంలో విద్యార్థిని సక్రమంగా చేయడం లేదని టీచర్ మందలించారు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని సృజన స్టడీ అవర్స్ అయిపోయిన వెంటనే పాఠశాల బాత్‌రూమ్‌కు వెళ్లి లైజాల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న సిబ్బంది బాలికను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

బాలికను పరామర్శించిన డీసీవో

బాలిక ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు సమాచారం తెలుసుకున్న గురుకుల పాఠశాలల అధికారిణి (డీసీవో) జయ కంభం గురుకుల పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థిని సృజనను కూడా పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటామని, అవసరమైన చర్యలు వెంటనే తీసుకుంటామని డీసీవో తెలిపారు.



పీడీసీసీబీలో విజిలెన్స్ తనిఖీలు

- అనేక అవకతవకలపై ఆరా

ఒంగోలు క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ) కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు ఒకపక్క, శాఖా పరమైన తనిఖీలు మరోపక్క గురువారం జరిగాయి. గత ప్రభుత్వ హయంలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. శాఖా పరమైన తనిఖీలు చేస్తూనే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి ప్రసాద్ విచారణాధికారిగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఫిష్ ఆంధ్రా, ఉద్యోగ నియామకాలు, ఉద్యోగోన్నతులు, నగరంలో ఉన్న పీడీసీసీ బ్యాంకు శాఖల్లో నవీకరణ అంశాల్లో అనేక అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. ఉద్యోగుల నియామకాల్లో జరిగిన అవకతవకలపై గురువారం విజిలెన్స్ విచారణ జరిగినట్లు తెలిసింది. అక్కడ పనిచేస్తున్న కొంతమంది వద్ద విజిలెన్స్ అధికారులు స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. ఉద్యోగోన్నతుల్లో జరిగిన అక్రమాలపై కూడా ఆరా తీశారు. గత ఐదేళ్లలో జరిగిన భారీ అవినీతిని బట్టబయలు చేసేందుకు తనిఖీలు ప్రారంభించినట్లు తెలిసింది. సుదీర్ఘ కాలంగా చేస్తున్న విచారణలో అక్రమాలు నిగ్గుతేల్చి అధికారులకు నివేదికలు అందజేయనున్నారు.



మార్కాపురం జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డులో జ్వరపీడితులు

సీజనల్ దడ!

మార్కాపురం డివిజన్‌లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్నిచోట్లా జ్వరపీడితులు ఎక్కువ సంఖ్యలో వైద్యశాలల బాటపడుతున్నారు. మరీ ముఖ్యంగా మార్కాపురం పట్టణంలో వైరల్ జ్వరాలతోపాటు డెంగ్యూ కేసులు కూడా పదుల సంఖ్యలో నమోదవుతున్నట్లు తెలుస్తోంది. వర్షాకాలంలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన వైద్యారోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడినట్లు స్పష్టమవుతోంది. పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల పరిధిలో జ్వరపీడితుల సంఖ్య కూడా తెలియని అయోమయస్థితిలో వైద్య ఆరోగ్య శాఖ ఉంది.

- మార్కాపురంలో పెరుగుతున్న డెంగ్యూ కేసులు
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు
- తూతూమంత్రంగా పారిశుధ్య పనులు

మార్కాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఈ నెల 10వ తేదీ నుంచి రోజుకు 50 నుంచి 80 వరకు వివిధ రకాల జ్వరాల కేసులు వస్తున్నట్లు వైద్యులు చెప్తున్నారు. వారిలో సుమారు 30 మందికిపైగా ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. మిగిలిన వారిలో కూడా అసాధారణ లక్షణాలున్నా మందు బిల్లులు తీసుకుని వెళ్లిపోతున్నారు. కొందరిలో సాధారణ లక్షణాలు ఉండడంతో వైద్యులే ఇంట్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ పంపిస్తున్నారు. వైరల్ జ్వరాల కేసులు ఎక్కువగా నమోదవుతుండడంతో వారి కోసం ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేస్తున్నారు. జ్వర పీడితుల్లో రెండు రోజుల నుంచి ఐదు రోజుల వరకు ట్రీట్‌మెంటు పొందుతున్న వాళ్లు కూడా ఉంటున్నారు. పేరుకు జీజీహెచ్ హోదా కల్పించినా రక్త పరీక్షలు, ఇతర అనారోగ్యాలను గుర్తించే పరీక్షలను రోగులు చేయించుకోవాలంటే ప్రైవేటు కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉంది. ప్రభుత్వ వైద్యశాలల్లో తగిన వసతులు లేవని భావించే వాళ్లు వందల సంఖ్యలో ప్రైవేటు వైద్యశాలల్లో చేరి వైద్యం తీసుకుంటున్నారు. స్థానిక ఎన్ఎస్ నగర్ ప్రాంతంలోని నాలుగు వైద్యశాలలు గత వారం రోజుల నుంచి జ్వరపీడితుల కేసులతో కిటకిటలాడుతున్నాయి. డెంగ్యూ కేసుల్లో ఎక్కువగా చిన్నపిల్లలు ఉంటున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వైద్యశాలల్లో ఒక్కో డెంగ్యూ కేసుకు సుమారు రూ.30 వేల నుంచి రూ.50 వేల



మార్కాపురంలో నెహ్రూబజార్‌లో జనావాసాల మధ్య ఇదీ పారిశుధ్యం పరిస్థితి

మిగతా 6లో...

ప్రజారోగ్యం పట్టని పీహెచ్‌సీలు

మార్కాపురం డివిజన్ వ్యాప్తంగా మొత్తం 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో సాధారణ వైద్యం మినహా సీరియస్ కేసులు చూసే పరిస్థితి లేదు. వైద్యశాలకు రోగులు వస్తే ప్రాథమిక పరీక్షలు చేసి పరిస్థితి తీవ్రతను బట్టి మెరుగైన వైద్యశాలకు రిఫర్ చేయాలి. జ్వరపీడితులు ఇబ్బడిముబ్బడిగా పీహెచ్‌సీల బాటపడుతున్నా అక్కడ సరైన వైద్యం లభించక ప్రైవేటు బాట పడుతున్నట్లు సమాచారం. చివరికి డివిజన్ పరిధిలో జ్వరపీడితులు ఎంతమంది ఉన్నారో కూడా వైద్యాధికారులకు తెలియని దుస్థితి నెలకొంది. డిప్యూటీ డీఎంహెచ్‌వో పీహెచ్‌సీలను నిరంతరం పర్యవేక్షించాల్సివుంది. ఆ కార్యాలయ అధికారులు గానీ, కిందిస్థాయి సిబ్బంది గానీ ఆ దిశగా దృష్టిపెట్టిన దాఖలాలు లేకపోవడం దైన్య స్థితికి అద్దంపడుతోంది.

అన్న క్యాంటిన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మార్టూరు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): మార్టూరులో నాగరాజుపల్లి కూడలి వద్ద నిర్మించనున్న అన్నా క్యాంటీన్ భవనం ఏర్పాటుకు స్థలాన్ని గురువారం పబ్లిక్ హెల్త్ సర్వీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, స్థానిక కూటమి ప్రభుత్వం నాయకులతో కలిసి పరిశీలించారు. మార్టూరులో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు, రూ. 61 లక్షల మంజూరుచేయించారు. నాల్గవ గ్రామ సచివాలయం నిర్వహిస్తున్న భవనానికి, పంచాయతీ రాజ్ భవనానికి మధ్య ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ ను ఏర్పాటుచేయడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ సర్వీస్ నెల్లూరు సర్కిల్ ఎస్ఈ టీ.మోహన్, పబ్లిక్ హెల్త్ సర్వీస్ డివిజనల్ అధికారి టీఎస్ సంజయ్, జడ్పీ సీఈవో చిరంజీవిలతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. భవిష్యత్తులో జాతీయరహదారి విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న అన్న క్యాంటిన్ భవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థలం కొలతలను స్థానిక సర్వేయర్లు, అధికారులతో ఎస్ఈ మోహన్ చర్చించారు. అయితే అక్కడ పంచాయతీరాజ్‌కు చెందిన శిథిలమైన గది అన్నక్యాంటీన్ భవన నిర్మాణానికి అడ్డంకిగా ఉండటంతో, దానిని తొలగించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, మిన్నెకంటి రవికుమార్, తొండెపు ఆదినారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై మంత్రికి వినతి

అద్దంకిటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ గురువారం తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో వెలగపూడిలోని సచివాలయంలో మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి, ఆ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంత లక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీలకు వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు, పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచాలని, హెల్త్ కార్డులు, పెండింగ్‌బిల్లులు చెల్లింపు వంటి పలు సమస్యలను పరిష్కారించాలని వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లో వంటకోసం కరెంటు పోయ్యిలు, కరెంటు బిల్లు రూ.200 నుండి రూ.500 ఇస్తామని మంత్రి తెలియజేశారన్నారు. కేంద్రాలలో రిజిస్టర్‌లు రావాల్సిన అవసరం లేదని యాప్‌లలో అన్ని నమోదు చేయాలన్నారు. ఈ నెల చివరి నాటికి 5జీ పోన్లు ఇస్తామని, ప్రభుత్వం ప్రకటించిన గ్రాట్యూటీ మార్పులు చేసి రెండు, మూడు రోజులలో జీవో రిలిజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మినరసమ్మ, ట్రెజరర్ కోడాలి హేమలత తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి స్థానికులు సహకరించాలి

వేటపాలెం(చీరాల), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఆయా ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చొరవ చూపినట్లయితే చిన్నా రుల భవితవ్యం బంగారు మార్గంలో సాగుతుందని పలువురు వక్తలు అన్నా రు. గురువారం వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బట్టా రాంబాబు రూ. 40 వేలు విలువగల కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌లను బహూకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలోని అవకాశాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత శిఖరా లు అందుకోవచ్చని సూచించారు. ప్రధానోపాధ్యాయులు శేఖరరావు దాతను అభినందించారు. కార్యక్రమంలో శంకర బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్షౌరశాలలకు ఉచిత విద్యుత్

200 యూనిట్లు ఫ్రీ
ఉత్తర్వులు విడుదల
నాయీబ్రాహ్మణులు అందరికీ వర్తింపజేయాలని డిమాండ్

ఒంగోలు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : క్షౌరశాలలు నిర్వహించే నాయీబ్రాహ్మణులకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 150 యూనిట్లు ఉచితంగా ఇచ్చింది. ప్రస్తుతం తిరిగి 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా సరఫరా చేసేందుకు తిరిగి ప్రజాప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్తు పథకాన్ని సరిగా అమలుచేయకపోవడంతో లబ్ధిదారులు ఎక్కువగా వినియోగించుకోలేకపోయారు.

విధివిధానాలు

- క్షౌరశాల నిర్వాహకుడు నాయీబ్రాహ్మణుడు అయిఉండాలి
- నెలకు 200 యూనిట్లకు పైగా విద్యుత్తు వినియోగించకూడదు
- అర్బన్ ప్రాంతాలలో నెలకు రూ.70 వేలు, రూరల్ ప్రాంతంలో రూ.60 వేలు ఆదాయం పొందే వారు అర్హులు
- రెవెన్యూ అధికారి ద్వారా పొందిన కులధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుకు జతపరచాలి.

బడ్జెట్ కేటాయింపు

నాయీబ్రాహ్మణులు నిర్వహించే క్షౌరశాలలకు 200 యూనిట్లు ఉచితం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.450 ప్రకటించి ఈ నెల నుంచి అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో లబ్ధిదారులు ఒంగోలు డివిజన్‌లో 124, కందుకూరు డివిజన్‌లో 93, కనిగిరి డివిజన్‌లో 15, దర్శి డివిజన్‌లో 28, మార్కాపురం డివిజన్‌లో 122 మంది ఉన్నారు. ఉచిత విద్యుత్తు పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారుల ముంగిటకు చేర్చాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు రెండువేల రూపాయలు ఉచితంగా లబ్ధిచేకూరుతుంది. ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం.. 382 మందికి ఏడాదికి కోటి రూపాయల లబ్ధి చేకూరుతోంది. లబ్ధిదారులు ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



అర్హులైన ప్రతిఒక్కరికి అందే విధంగా చర్యలు

కట్టా వెంకటేశ్వర్లు, ఎస్ఈ



నాయీబ్రహణులకు ప్రతి ఒక్కరికీ అందేవిధంగా చర్యలు చేపట్టాం. దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న వారి జీవితాలలో వెలుగుల నింపేందుకు 200 యూనిట్లు ఉచిత పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకంపై అవగాహన పెంచేందుకు విద్యుత్తు శాఖ తరపున చర్యలు తీసుకుంటున్నాం. క్షౌరశాలలు నడిపే నాయీబ్రాహణులు ధ్రువీకరణ పత్రాలు తీసుకొని మండల విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికార్లను సంప్రదించాలి.

ప్రతి ఒక్కరికీ 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి

కొణిజేటి రామకృష్ణ, అధ్యక్షుడు, ఒంగోలు నగర క్షౌరశాలల సంఘం



క్షౌరశాలలు నిర్వహిచుకునే నాయీబ్రాహణులు అందరికీ 200 యూనిట్లు ఉచితం పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలి. కాల్చిన యూనిట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవడం వల్ల కొందరే అర్హులుగా మిగులుతారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతి పత్రం అందజేశాం. క్షౌరశాలలో వచ్చిన బిల్లులో 200 యూనిట్లు మినహాయించి మిగిలిన విద్యుత్తుకు బిల్లు వేయాలని కోరాం.

ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో ఉన్న వారికి చేర్చాలి

పెళ్లూరు చినవెంకటేశ్వర్లు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్



గతంలో తెలుగుదేశం నాయీబ్రాహ్మణుల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం వైసీపీ హయాంలో లబ్ధిదారులకు సక్రమంగా చేరలేదు. తిరిగి ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత 200 యూనిట్లు ఉచితం ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సంతోషం. అధికారులు ఈ పథకంపై గ్రామాల్లో ఉన్న నాయీబ్రాహ్మణులకు అవగాహన కల్పించాలి.

ప్రజలను చైతన్యపరిచే శక్తి పాటకు ఉంది

ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అన్న నల్లూరి

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను చైతన్యపరిచి, ఉద్యమ మార్గంలో నడిపే శక్తి పాటకు ఉందని ఏపీ ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నల్లూరి వెంటటేశ్వర్లు(అన్న) చెప్పారు. సీపీఐ రాష్ట్ర 18వ మహాసభలను పురస్కరించుకుని ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజా నాట్యమండలి కళా ఉత్సావాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన అన్న నల్లూరి మాట్లాడుతూ పేదలకు భూములు పంచింది, కూలి రేట్లు పెంచింది, కార్మికుల హక్కుల కోసం పోరాడిన ఆయుధం పాట అని చెప్పారు. ప్రజా నాట్యమండలి పాటను తన ఆయుధంగా మలుచుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజాచైతన్యం కోసం, సమాజంలో నెలకొన్న రుగ్మతలను రూపుమాటం కోసం కళా ఉద్యమం కొనసాగిందన్నారు. సినీ గేయ రచయిత ఎస్‌కే మీరావలి మాట్లాడుతూ పామరులకు సైతం వేదిక ఇచ్చిన గొప్ప చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అన్నారు. తాను చదివింది మూడో తరగతి అయినా ఎర్రజెండా నీడలో ఎన్నో పాటలు, ప్రజా ఉద్యమాలలో పాల్గొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించానని తెలిపారు. అన్న నల్లూరి సారథ్యంలో ఎందరో కళాకారులు సినీ రంగానికి పరిచయం అయ్యారని చెప్పారు. సభలో దూళిపాళ్ల సీతారామయ్య, ప్రజా నాట్య మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చంద్ర నాయక్, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. రామకృష్ణ, కోశాధికారి ఆర్.పిచ్చయ్య పాల్గొన్నారు. కళాకారులు కళా రూపాలు అలరించాయి.



ప్రజానాట్య మండలి కళారూపాలను ప్రదర్శిస్తున్న కళాకారులు

ఎక్సైజ్ అధికారులకు కలసి వచ్చిన డ్రైడే

- మూడు బెల్ట్ షాపుల వద్ద మద్యం స్వాధీనం
- ఒక్క కేసు కూడా నమోదు కాని వైనం

అద్దంకి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): డ్రైడే రోజు అద్దంకి ఎక్సైజ్ అధికారులకు కలసి వచ్చింది. బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం అమ్మకాలు చేస్తూ పట్టు బడడంతో కాసులు పిండుకొనేందుకు అవకాశం వచ్చింది.

స్వాతంత్ర్య దినోత్సవం రోజు పట్టణంలో మాత్రం లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాలు మూసివేశారు. కాని బెల్ట్ షాపుల నిర్వాహకులు ముందుగానే కొనుగోలు చేసి మద్యం నిల్వ చేసుకొని, జోరుగా అమ్మకాలు చేశారు. అయితే 'కంచె చేను మేసిన' చందంగా మద్యం అమ్మకాలను నియంత్రించాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అందివచ్చిన అవకాశాన్ని సొమ్ము చేసుకున్నారు. అద్దంకి పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజు మూడు చోట్ల బెల్ట్ షాపులపై దాడు లు చేశారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, పలువురిని పట్టుకొన్నారు. బెల్ట్‌షాపులలో పట్టుబడ్డ మద్యం సీసాలను, అమ్మకాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఎలాంటి కేసు నమోదు చేయకుండానే వదిలేశారు. పట్టుబడ్డ మద్యంతో పాటు వీరు లక్ష రూపాయల వరకు ముట్ట జెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారే యథేచ్ఛగా బెల్ట్‌షాపులు నిర్వహించడం గమనార్హం. మూడు నెలల క్రితం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అద్దంకి సర్కిల్ ఎస్‌హెచ్‌వో దీర్ఘకాలిక సెలవు లో వెళ్లడంతో మిగిలిన అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు న్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతా గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం నడుపుతున్నట్లు తెలు స్తోంది. అంతా తానై నడిపించే ఓ అధికారి తనకు నమ్మిన బంటుగా ఉండే ఓ కానిస్టేబుల్ ను వసూలుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజు పట్టుబడ్డ ముగ్గురు బెల్ట్ షాపుల నిర్వాహకుల వద్ద 2 లక్షల రూపాయలు డిమాండ్ చేసిన సదరు కాని స్టేబుల్ చివరకు లక్ష రూపాయలకు బేరం సెటిల్ చేసి నట్లు తెలుస్తోంది. ఇదే పంథా కొనసాగితే బెల్ట్ షాపు లు మరింత విచ్చలవిడిగా పెరిగే అవకాశం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధి కారులు స్పందించి అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంకు ఎస్‌హెచ్‌వోగా ఓ సీఐను నియమిం చాల్సి ఉంది. దీంతో పాటు సిబ్బంది, అధికారుల ఆగడాలకు కూడా చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.



స్వాతంత్ర్యదినోత్సవం రోజు అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో మద్యం అమ్మకాలు జరుగుతున్న బెల్ట్ షాపు(ఫైల్)



అద్దంకిలోని ఎక్సైజ్ కార్యాలయం

అట్టహాసంగా లక్ష్మయ్య బాధ్యతల స్వీకరణ

- పలు గ్రామాలలో ర్యాలీ నిర్వహణ

బల్లికురవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ గ్రామ సహకార సంఘ అద్యక్షునిగా గొట్టిపాటి లక్ష్మయ్య గురువారం అట్టహాసంగా బాధ్యతలు చేపట్టారు. ముందుగా తన ఇంటి నుండి పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు, మరియు తన శ్రేయేబిలాషుల మధ్య బారీ ర్యాలీ చేపట్టి సొసైటీ కార్యాలయానికి చేరుకొని ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈసందర్బంగా బ్యాంకు మేనేజర్ ఉమాదేవి అయన చేత సంతకం చేయించి బాధ్యతలను అప్పగించారు. అనంతరం సభ్యులుగా అడవి అంజయ్య, చంటి వెంకటరెడ్డిలచే సంతకాలు చేయించారు. ఈసందర్బంగా జరిగిన సభలో సంతమాగులూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తేలప్రోలు రమేష్ మాట్లాడుతు రైతులకు సకాలంలో పంట రుణాలను అందించి వారి సమస్యలపై బాధ్యతగా పనిచేసే సత్తా లక్ష్మయ్యకు ఉందని తెలిపారు. ఈసందర్బంగా నూతన చైర్మన్ లక్ష్మయ్యను పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా పీడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ మస్తానయ్య, ఎఎంసీ వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర, ఎఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కొండేటి ఇజ్రాయల్, టీడీపీ నేతలు గొట్టిపాటి చౌదరి, చింతల శ్రీనివాసరావు, దూళిపాళ్ల రామగోవిందు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల్లో అయోమయం

- అనర్హత పింఛన్లపై వేటుకు ప్రభుత్వం చర్యలు
- వెయ్యి మందికి నోటీసులు, అప్పీలుకు మరో అవకాశం

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అనర్హత ఉన్న పింఛన్ల వేటుకు కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్ చేపట్టింది. ఈక్రమంలో సచివాలయ సిబ్బంది నియోజకవర్గంలో సుమారు 1000 మందికి ఇప్పటికే నోటీసులు అందించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బడి ముబ్బడిగా అనర్హులకు సదరం సర్టిఫికెట్లు అందించి, వివిధ రకాల పింఛన్లను అందజేసింది. ఈ నేపథ్యంలో రూ.కోట్లల్లో ప్రభుత్వ ఖజానాకు గండి పడింది. అయితే కూటమి ప్రభుత్వం అందుకు స్పష్టమైన ప్రణాళికతో అర్హులే ప్రామాణికంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యం లోనే ఈ ఏడాది జనవరి నుంచి విభిన్న ప్రతిభావంతుల రీవెరిఫికేషన్ ప్రారంభించింది. ఈక్రమంలో అన్ని కేటగిరీల్లో ఇప్పటి వరకు వైద్యుల ఆమోదం పొందిన విభిన్న ప్రతిభావంతుల వైకల్యానికి సంబంధించి ఎంత శాతం ఉందనేది పింఛన్ వెబ్‌సైట్‌ను అనుసంధానం చేసింది.

గణనీయంగా పింఛన్ల అర్హుల ప్రక్రియ

ఇప్పటి వరకు వివిధ రకాల పింఛన్లు అందుకుంటున్న పింఛన్‌దారులకు వారి ధ్రువపత్రాల ఆధారంగా గణనీయంగా పింఛన్లకు అధికారులు వెసలుబాటు కల్పిస్తూ, జాబితాలు సిద్ధం చేసి ఆయా ప్రాంతాల సచివాలయాలకు పంపించారు. వీరిలో ఇప్పటి వరకు మంచానికే పరిమితమై వెరిఫికేషన్‌లో 85 శాతం పైబడి ఉంటే వారికి రూ.15 వేలు యథావిధిగా సెప్టెంబరు నుంచి అందించనున్నారు. అలాగే వెరిఫికేషన్‌లో 85 శాతం కంటే తక్కువగా ఉండి, 40 శాతంకంటే ఎక్కువగా ఉండిన వారిని హెల్త్ పెన్షన్ నుంచి విభిన్న ప్రతిభావంతుల పెన్షన్‌గా మార్చి రూ.6 వేల అందించనున్నారు. అలాగే వైకల్య శాతం 40కు తక్కువగా ఉండి 60ఏళ్ల లేనివారివితొలగిస్తారు.

అనర్హులకు ఇప్పటికే నోటీసులు

నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 1000 మందికి అనర్హుల పింఛన్లను గుర్తించిన అధికారులు నోటీసులు అందించారు. అయితే అవగాహన లేమితో చాలా వరకు ఏమి చేయాలో తోచక అయోమయంలో ఉన్నారు, కానీ నోటీసులు అందుకున్న వారిలో ఎవ్వరైనా అర్హులైన పింఛన్‌దారులు ఉన్నట్లయితే వారికి తిరిగి పింఛన్ పొందె వెసులుబాటు కల్పిస్తూ మరో అవకాశం ఇచ్చారు. వీరు నోటీసు అందుకున్న 30 రోజుల్లో పట్టణాలలో అయితే కమిషనర్, గ్రామీణ ప్రాంతాలలో అయితే ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందించాల్సి ఉంటుంది. తద్వారా మళ్లీ అధికారులు కల్పించిన తేదీల్లో హాజరై వారి ద్వారా పొందిన వాస్తవమైన సదరం ధ్రువపత్రంతో పింఛన్ పొందాల్సి ఉంటుంది. తద్వారా అర్హులు పింఛన్లకు దూరం కాకుండా ప్రభుత్వం చూస్తోంది.



నోటీసు అందుకున్న విభిన్న ప్రతిభావంతులు

నల్లమల అటవీ ప్రాంతంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు

అవీఇవీ

ఎక్స్‌కవేటర్, జీపు స్వాధీనం.. అదుపులో ఇద్దరు నిందితులు



ఫారెస్టు కార్యాలయంలో ఉన్న ఎక్స్‌కవేటర్, జీపు

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తుండగా అటవీ అధికారులు దాడులు చేశారు. రెండు వాహనాలతోపాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం గంజివారిపల్లి ఎఫ్ఎస్‌వో కరిముల్లా కథనం ప్రకారం.. వైపాలెం మండలంలోని చెన్నుపల్లి గ్రామ సమీపంలోని విరుడుగుంట ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీస్తున్న సమాచారాన్ని స్థానికులు అధికారులకు అందించారు. ఈ మేరకు అటవీ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఎక్స్‌కవేటర్, జీపును సీజ్ చేసి ఎర్రగొండపాలెం ఫారెస్టు కార్యాలయానికి తరలించారు. వాటితోపాటు ఇద్దరిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పద్ధతి మార్చుకోకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తా

(5వపేజీ తరువాయి)

తెచ్చారు. ప్రత్యేకంగా ప్రభుత్వం రూపొందించిన మొబైల్ యాప్‌లలో వీటిని పొందుపర్చాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పిల్లల ఎత్తు, బరువుకు సంబంధించిన వాస్తవ వివరాలు కాకుండా ఊహానిజత వివరాలను కొందరు నమోదు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. శాఖ ద్వారా చేయాల్సిన కనీస విధుల్లోనూ నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సూపర్‌వైజర్లు, సీడీపీవోలు ఈ విషయాలను సమగ్రంగా పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని పీడీని ఆదేశించారు. అప్పటికీ అంగన్‌వాడీ కేంద్రాల్లోని సిబ్బంది పనితీరులో మార్పురాకపోతే నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి విధుల నుంచి తొలగిస్తామన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పనిచేసే వివిధ విభాగాలను సమన్వయం చేస్తూ పరిస్థితిని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకొని రావాలని పీడీని కలెక్టర్ ఆదేశించారు.

పొగాకు రైతుల్లో అలజడి

(5వపేజీ తరువాయి)

పెరుగుతాయన్న నమ్మకం లేకపోగా పెనాల్టీలు వేస్తారన్న భయంతో రైతులు అక్రమ వ్యాపారులకు సహకరిస్తున్నారు. అయితే దానిని అరికట్టాల్సిన బోర్డు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు సజావుగా సాగడం లేదు.

మూడేళ్ల రిజిస్ట్రేషన్‌పై వ్యతిరేకత

తాజాగా భవిష్యత్‌లో సాగు నియంత్రణ పేరుతో పొగాకు బోర్డు యంత్రాంగం చేస్తున్న కసరత్తు, తీసుకుంటున్న చర్యలపై రైతులలో మరింత అలజడి రేగుతోంది. అందులో మూడేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్ విధానాన్ని వచ్చే సీజన్ నుంచి అమలుకు నిర్ణయించిన పొగాకు బోర్డు ఈనెల 18 నుంచి ప్రక్రియ ప్రారంభమైంది. అందులో లీజు బ్యారన్లు కూడా మూడేళ్ల నిబంధన పెట్టారు. అయితే సాధారణంగా ఏయేటికాయేడు బ్యారన్ లీజులు మారుతుంటాయి. అధికశాతం కౌలు రైతులు ఉంటున్న ప్రస్తుత వ్యవసాయ విధానంలో మూడేళ్లకు ఒకసారి లీజు అన్నది సాధ్యమయ్యే వ్యవహారం కాదన్నది రైతుల వాదన.

అపరాధ రుసుంపై ఆందోళన

గత రెండేళ్ల అధిక పంట ఉత్పత్తిపై అపరాధ రుసుం తొలగించగా ఈ సీజన్‌లో తిరిగి అమలుకు బోర్డు ద్వారా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టింది. ఒకప్పుడు పంట ఉత్పత్తి నియంత్రణకు 15శాతం వరకు అధిక ఉత్పత్తి పెనాల్టీలు వేసేవారు. దానిని క్రమంగా 5శాతం వరకు తగ్గిస్తూ రాగా గత రెండేళ్ల పూర్తిగా రద్దుచేశారు. ఈ సీజన్‌లో కూడా కర్ణాటకలో రద్దుచేయగా ఇక్కడ కూడా అలాగేనన్న భావనలో రైతులు ఉన్నారు. అయితే మార్కెట్ ధరలు సరిలేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతుండటం, ప్రభుత్వంపై వివిధ రూపాల్లో ఒత్తిడి పెరుగుతుండటంతో పంట సాగు నియంత్రణ పేరుతో ఈ సీజన్‌లో పెనాల్టీలు విధించేందుకు బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు. నెలక్రితం ఒకసారి దీనిపై రైతుల అభిప్రాయాల కోసం బోర్డు అధికారులు సమావేశాలను నిర్వహించగా ఎప్పటిలాగా అనుమతించిన ఉత్పత్తి కన్నా అధికంగా పండిన పంటలో తొలి పదిశాతం పంటకు ఎలాంటి పెనాల్టీ వేయకుండా చూడాలన్నారు. అంతకన్నా అదనంగా ఉన్న పంటపై 2 శాతం వరకు రైతు నాయకులు కూడా సుముఖత వ్యక్తం చేశారు. ఆమేరకు బోర్డు అధికారులు కేంద్రానికి నివేదించి అధిక పంట కొనుగోలుకు అనుమతి కోరగా అనుమతి ఇవ్వకుండా 5 శాతం పెనాల్టీపై కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ నుంచి బోర్డు అధికారులపై ఒత్తిడి వస్తున్నట్లు సమాచారం.

పెనాల్టీలను అంగీకరించం..

అధిక ఉత్పత్తి కొనుగోళ్లకు కేంద్రం నుంచి అనుమతి రాకపోవడంతో అధికారిక పంట పూర్తయిన కేంద్రాల్లో వేలం ఆగిపోగా ఈ నెలఖరు లోపు మరికొన్నింటిలో కూడా ఆ పరిస్థితి ఏర్పడనుంది. దీంతో పెనాల్టీలపై మరోసారి రైతు ప్రతినిధులతో బుధవారం వివిధ వేలం కేంద్రాలలో బోర్డు అధికారులు సమావేశాలు నిర్వహించారు. అయితే గతంలో 2 శాతం వరకు పెనాల్టీలను అంగీకరించేందుకు సిద్ధమైన రైతులు ప్రస్తుత మార్కెట్ తీరు, అక్రమ కొనుగోళ్లు, పట్టించుకోని బోర్డు వైఖరితో మరింత నష్టపోతామన్న భావనతో పెనాల్టీను ఈ సమావేశాలలో వ్యతిరేకించినట్లు సమాచారం. కర్ణాటకలో ఈ సీజన్‌కు మినహాయింపు ఇచ్చినట్లుగా ఇక్కడ కూడా ఇవ్వాలని లీజు బ్యారన్లకు మూడేళ్లకు కాకుండా ప్రతి ఏటా రిజిస్ట్రేషన్లు చేసేలా నిబంధనలు మార్పు చేయాలని ఆయా వేలం కేంద్రాల్లో జరిగిన సమావేశాల్లో రైతు ప్రతినిధులు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై బోర్డు అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న విషయం అలా ఉంచితే ప్రస్తుత పరిణామాలతో పొగాకు రైతులలో తీవ్ర అలజడి, ఆవేదన కనిపిస్తోంది.

'సీజనల్' దడ!

(5వపేజీ తరువాయి)

వరకు తీవ్రతను బట్టి ఖర్చవుతున్నట్లు తెలుస్తోంది.

పారిశుధ్యం గాలికి

గతంలో వర్షాకాలానికి ముందే పల్లెలు, పట్టణాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతుంటారు. మురుగు కాలువలను శుభ్రం చేస్తారు. దోమలు వృద్ధి చెందకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటారు. ప్రజల్ని వైరల్ జ్వరాలపై అప్రమత్తం చేస్తారు. వైద్యారోగ్యశాఖ అయితే ఫీవర్ సర్వే కూడా చేపట్టి ఎప్పటికప్పుడు పరిస్థితిని జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు తెలియజేసేవారు. కానీ ప్రస్తుతం స్థానిక సంస్థలు, వైద్యారోగ్య శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. చాలా పల్లెల్లో కనీస పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్న దాఖలాలు ఉండడంలేదు. పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య విభాగాలు ఉంటున్నా తూతూమంత్రంగా పనులు చేస్తుండం ప్రజారోగ్యానికి చేటుగా మారుతోంది.

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

(5వపేజీ తరువాయి)

బీటు పరిధిలోకి చేరుకోగా అక్కడ ఒక మోటార్‌బైక్ వద్ద కొంత మంది వ్యక్తులు గుమిగూడి కనిపించారు. సమీపించగా పోలీసులను చూసి పరారయ్యారు. వెంబడించి వారిని పట్టుకోని విచారించారు. వారిచ్చిన సమాచారం మేరకు అక్కడే కల్వర్టు కింద దాచి ఉంచిన 26 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు జిల్లా వాసులుగా గుర్తించారు. వారితోపాటు 26 ఎర్రచందనం దుంగలు, ఒక బైక్‌ను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏసీఎఫ్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ సుబ్రమాణ్యంరాజు పాల్గొన్నారు.


గణేష్ ఉత్సవాలలో తస్మాత్ జాగ్రత్త..!



వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలు.. ప్రతి మదిలో భక్తిభావాన్ని పెంపొందిస్తాయి. మనుషుల మధ్య సంఘటిత శక్తిని ప్రేరేపిస్తాయి. మనస్సుల మధ్య ఐక్యతారాగాన్ని పలికిస్తాయి. వాడవాడలా ఏర్పాటు చేసే మండపాల వద్ద ప్రదర్శించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కళలను ప్రతిబింబిస్తాయి. మన సంస్కృతిని జ్ఞప్తికి తెస్తాయి. అయితే మండపాల ఏర్పాటులో ప్రభుత్వం సూచించే నిబంధనలను అందరూ పాటించాలి. ప్రశాంత నిమజ్జనానికి సహకరించాలని అధికార యంత్రాంగం కోరుతోంది.

ఆన్‌లైన్‌లో అనుమతులు తప్పనిసరి : ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. అదే విధంగా అన్ని శాఖల నుంచి అనుమతులు పొందాలన్నారు. అందుకు సంబంధించి గణేష్ ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి లేదా సంబంధిత పోలీసు స్టేషన్‌లో స్వయంగా దరఖాస్తు అందజేయాలని చెప్పారు. ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.



తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలు

- వినాయక విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేసుకోవాలి. ఆ విగ్రహానికి ఆ కమిటీదే బాధ్యత.
- విగ్రహాల ఏర్పాటుకు సంబంధిత స్థల యజమాని, మునిసిపాలిటీ, పంచాయతీ అధికారుల అనుమతులు తప్పనిసరి.
- అగ్నిమాపక శాఖ, విద్యుత్తు శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి. వారి విధించే నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు ఉండాలి.
- పందిళ్ల వద్ద అధిక శబ్దం వినిపించే సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయకూడదు.
- విద్యాసంస్థలు, ఆసుపత్రులు, దేవాలయాలు, మసీదులు, చర్చీలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద మైక్ ప్రచారం చేయకూడదు.
- రాత్రి వేళల్లో మండపాల వద్ద కాపాల ఉండాలి. సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలి.
- పందిళ్ల వద్ద అసభ్య ప్రదర్శనలు నిషేధం.
- నిమజ్జనం పోలీసులు కేటాయించిన సమయంలో, మార్గంలోనే చేయాలి.
- ఊరేగింపులు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి.
- వేడుకలు ప్రశాతంగా ముగిసేలా ఏర్పాట్లు చేసుకోవాలి



మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి, పక్కన ఎస్ఈ వెంకటేశ్వర్లు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

గ్రామీణ ప్రాంతాలలో నిరంతరం త్రీఫేజ్ కరెంట్

అధికారులతో సమీక్షించిన సీఎండీ పుల్లారెడ్డి

ఒంగోలు క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తును నిరంతరం సరఫరా చేయాలని ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి చెప్పారు. గురువారం స్థానిక విద్యుత్తు భవన్‌లో ఆ శాఖపై సీఎండీ సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కనెక్షన్లకు ఇస్తున్న ఫీడర్లను వేరు చేసి 24 గంటలు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్ పనులు పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు పనితీరు గురించి ఆరాతీశారు. విద్యుత్తు శాఖ మీద ప్రజల అభిప్రాయాలు కూడా అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ విద్యుత్త కనెక్షన్ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు. ప్రజలలో స్మార్టు మీటర్లపై ఉన్న అపోహలను తొలిగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్, ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలి



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ సంస్థలపై తనిఖీలు నిర్వహించి నివేదికలను అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం జిల్లా లీగల్ మెట్రాలాజీ కార్యాచరణ ప్రణాళికపై ఆ శాఖ అధికారులతో ప్రాథమిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎల్‌పీజీ డీలర్లపై తనిఖీలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, డీలర్ల షాపులు, పెట్రోలు బంకులు, సిమెంట్, స్టీల్ దుకాణాలు, హాస్పటల్స్, రైల్వే, ఆర్టీసీ బస్టాండ్లు, బంగారం దుకాణాలను విస్తృతంగా తనిఖీ చేయాలని చెప్పారు. ఆయా సంస్థలపై తనిఖీలు నిర్వహించిన అనంతరం నివేదికను అందజేయాలని ఆదేశించారు. అనంతరం తనిఖీల నిర్వహణలో తీసుకోవాల్సిన పలు అంశాలపై ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో లీగల్‌మెట్రాలజీ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎన్ మాధురి, డిప్యూటీ కంట్రోలర్ ఐజక్, అసిస్టెంట్ కంట్రోలర్ పి. స్వర్ణ, ఒంగోలు ఇన్‌స్పెక్టర్ డి.అనిల్, కరీముల్లా, ఎస్కే మొహిసిన్ పాల్గొన్నారు.

24న ప్రధానోపాధ్యాయుల సంఘం సమావేశం

ఒంగోలు విద్య, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లాకౌన్సిల్ సమావేశం ఈనెల 24న ఒంగోలులోని సంఘ కార్యాలయంలో జరుగుతుందని సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వై.వెంకట్రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. సమావేశానికి సంఘకౌన్సిలర్లందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర స్థాయిక్రీడా పోటీలకు ఎంపికైన అభిలాష

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయిపోటీలకు(ఆర్చరీ విభాగం)లో స్థానిక కృష్ణ మెమోరియల్ స్కూలు విద్యార్థిని కొప్పోలు అభిలాష ఎంపికయ్యారు. స్థానిక మినీ స్టేడియంలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభిలాష ఏడో తరగతి చదువుతూ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 23న నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ పోటీలకు ఎంపికైన అభిలాషను పాఠశాల కరస్పాండెంట్ వసుంధరాదేవి, ప్రిన్సిపాల్ లక్ష్మీ జాహ్నవిలు అభినందించారు.

28కి ఎఫ్ఏ1 మూల్యాంకనం పూర్తికి ఆదేశం

క్లస్టర్ సమావేశం 30కి వాయిదా

ఒంగోలు విద్య, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకుచదువుతున్న విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1(ఎఫ్ఏ1) పరీక్షలమూల్యాంకనాన్ని ఈనెల 28లోపు పూర్తి చేసి మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. దీనికోసం టీచర్లకు వెసులుబాటు కల్పించేందుకు ఈనెల 23న జరగాల్సిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఈనెల 30కి వాయిదా వేశారు. ఒక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ అదే పాఠశాలలో ఉండాలి. ఎవ్వరు డ్రాప్‌బాక్సుల్లో ఉండరాదు. అలా ఉన్న 15 ఏళ్ల దాటిన విద్యార్థులను ఓపెన్ స్కూలులో చేర్పించాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలలు అనధికారికంగా ఏ విద్యార్థిని తమ వద్ద ఉంచుకోకూడదు. ఎంఈవోలు పాఠశాలలను తనిఖీ చేసి వారి రోల్ పరిశీలించి పాఠశాల యాజమాన్యం వద్ద సర్టిఫికెట్లు తీసుకోవాలి. పాఠ్య పుస్తకాలు అందరికి అందాయని ధ్రువీకరిస్తూ పీఆర్ఎంటీ ద్వారా అన్ని పాఠశాలల నుంచి సర్టిఫికెట్లు తెప్పించాలి. మిగిలిన పాఠ్యపుస్తకాల గోడౌన్‌లకు చేర్చాలని ఆ ఉత్తర్వులో ఆదేశించారు.

పులి సంచరిస్తోంది.. అప్రమత్తంగా ఉండండి



రాచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల ఫారం గ్రామ సమీపంలోని కంచెనగుట్ట తిప్ప ప్రాంతంలో పులి సంచరించినట్లు పాదముద్రలు కనిపించాయని, ఫారం గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మీ నాయక్ తెలిపారు. గురువారం ఆయన ఫారం సమీప అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. వారం రోజుల ముందు వర్షాలు కురిసే సమయంలో పులి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పొలాల వద్ద పశువులను ఉంచవద్దని, ప్రజలు కూడా ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దన్నారు. అప్రమత్తంగా ఉంటూ ఏదైనా అనుమానాస్పద స్థితి తలెత్తితే వెంటనే తమకు సమాచారం అందించాలని ఆయన తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్య సమస్యలను తేలికగా తీసుకోవద్దు

సంక్షేమ హాస్టళ్లలో వసతులు, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

అధికారులతో సమీక్షించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాలయాలు, వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం, వసతితో పాటు ఆరోగ్యంపై మరింత దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం వివిధ సంక్షేమశాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రెసిడెన్షియల్ విద్యాలయాలతో పాటు వసతిగృహాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, ఖాళీలు, మౌలిక సదుపాయాలు, స్వంత, అద్దెభవనాలు, వాటిని ఉన్నతాధికారులు తనిఖీ చేస్తున్న తీరు తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి దిశా నిర్దేశం చేశారు. ఆయా వసతిగృహాలను నియోజకవర్గాల స్పెషలాఫీసర్లకు ట్యాగ్ చేస్తే వారు కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఆరోగ్య సమస్యలను విద్యార్థులు ప్రస్తావించినప్పుడు తేలికగా తీసుకోకుండా నిబంధనల ప్రకారం వారికి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసతి గృహాల స్థాయిలోనే పరిష్కారం అయ్యే సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోనేది లేదని హెచ్చరించారు. వసతిగృహాల్లో పారిశుధ్యం, ప్లాంటేషన్, వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసేలా నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. ఈ విషయంలో సంబంధిత ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్లు త్వరగా వచ్చేలా చూస్తానని చెప్పారు. లెక్కలు, సైన్స్ పాఠ్యాంశాలను బోధించేందుకు టూటర్లను కూడా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సంక్షేమశాఖల అధికారులు లక్ష్మానాయక్, నిర్మలజ్యోతి, వరలక్ష్మీ, సువార్త, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి జయ, కేజీబీవీ జీసీడీవో హేమలత పాల్గొన్నారు.

పృథులగిరి దేవాలయాల అభివృద్ధికి చొరవ తీసుకుంటాం

మంత్రి ఆనం ఆదేశాలతో మర్రిపూడికి వచ్చిన దేవదాయశాఖ స్థపతి, సహాయ కమిషనర్



ముత్యాలమ్మ దేవాలయాన్ని పరిశీలిస్తున్న ఏసీ పానకాలరావు, రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్పలు

మర్రిపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో గురువారం ఆ శాఖ రాష్ట్ర స్థపతి పరమేశ్వరప్ప, రీజనల్ స్థపతి సురేంద్ర, ఒంగోలు సహాయ కమిషనర్ పానకాలరావులు మర్రిపూడిలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ దేవాలయాన్ని, పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని సందర్శించారు. గ్రామదేవతగా కొలువు తీరిన ముత్యాలమ్మ ఆనం వారి ఇంటి ఆడపడుచుగా గ్రామస్థులు ఆమెను పూజిస్తారు. ఆనం రామనారాయణరెడ్డి పూర్వీకులు మర్రిపూడి గ్రామానికి చెందిన వారు. ఇటీవల శిథిలమైన ముత్యాలమ్మ దేవాలయాన్ని దాతల సహకారంతో నూతనంగా నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం పనులు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ముత్యాలమ్మ దేవాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడంతోపాటు కల్యాణ మండపం నిర్మాణాన్ని చేపట్టేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందచేయాలని మంత్రి రామానారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతోపాటు పృథులగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ పునర్నిర్మాణం కోసం మూడేళ్ల క్రితం రూ.3 కోట్ల 40లక్షల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ముందుకు కదల్లేదు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థానిక మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పృథులగిరి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనికితోడు దేవదాయశాఖా మంత్రి స్వగ్రామం మర్రిపూడి కావడంతో మరోమారు ఆ ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. దీంతో ఇంజనీరింగ్ అధికారులు, స్థపతి సంయుక్తంగా దేవాలయాన్ని సందర్శించారు. దేవాలయం ప్రాంగణం విస్తరణతోపాటు దేవాలయ పునర్నిర్మాణం కోసం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు అధికారులను కలిసి ముత్యాలమ్మ దేవాలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరివెంట డీఈ శ్రీనివాసరావు, ఏఈ యుగంధర్, కందుకూరు, ఒంగోలు ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, వేణు, ఈవోలు నారాయణ రెడ్డి, లీలా కృష్ణ, గ్రామ పెద్దలు ఆనం సత్యనారాయణరెడ్డి, బీవీ భాస్కర్ రెడ్డి, మాధిరెడ్డి, బసిరెడ్డి, వీరనారాయణ, నరసింహారావు, బీఎల్ఎన్ శాస్త్రీ, పుల్లారెడ్డి ఉన్నారు.

టీచర్ల బ్యాంకు ఖాతాలకు రూ.18.76 లక్షలు జమ

ఒంగోలు విద్య, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి రూ.18.76 లక్షలు ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతాలకు జమయ్యాయి. ఆ పరీక్షలకు సంబంధించిన రెమ్యూనరేషన్ రూ.8.57 లక్షలు, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన రెమ్యూనరేషన్ రూ.3.45లక్షలు, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన కన్వేయన్స్ అలవెన్స్ రూ.88,700, కంటిజెన్సీ నిధులు రూ.2.81 లక్షలు, టీఏ, డీఏలు రూ.3.55 లక్షలు టీచర్ల బ్యాంకు ఖాతాలకు జమయ్యాయి. ఖజానా కార్యాలయానికి సమర్పించిన 73 లక్షల పుల్లీ ఓచర్ల బిల్లుకు సంబంధించిన నిధులు జమ కావాల్సి ఉంది.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

విద్యార్థులు విజ్ఞానవంతమైన పుస్తకాలూ చదవాలి

ఏపీ ప్రెస్ అకాడమి ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ పిలుపు

ఘనంగా పుస్తక ప్రియుల ర్యాలీ

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విజ్ఞానం, సామాజిక స్పృహ కలిగించే ఇతర పుస్తకాలను కూడా చదవాలని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ కోరారు. ఒంగోలులోని వీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో ఏడు రోజులుగా జరుగుతున్న పుస్తక మహోత్సవానికి ఆయన గురువారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నిర్వాహకులు, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ మనోహర్ అధ్యక్షత వహించగా, ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు పుస్తకం మంచి నేస్తం అని చెప్పారు. అంతేకాకుండా చదువు అనేది మంచి ఆలోచనలకు చిరునామా అని పేర్కొన్నారు. తాను హైస్కూలు విద్యాభ్యాసం వీవీఆర్ పాఠశాలలోనే పూర్తిచేశానని గుర్తుచేశారు. పుస్తక పఠనం అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపిన ఆయన ఈఎస్ గార్డెన్ రచించిన పుస్తకాలంటే అమితమైన ఇష్టమన్నారు. తాను పుస్తకాలు ఇష్టంగా చదవడం వలన నేడు ఈ స్థాయికి ఎదిగానని వివరించారు. ప్రస్తుతం మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తూ, ఇంగ్లిష్ కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాలయాల్లో కేవలం పాఠ్యపుస్తకాలకే విద్యార్థులు పరిమితం కావాలని జీవో తీసుకురావడం దుర్మార్గమని చెప్పారు. పుస్తక పఠంపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ విజయవాడ బుక్ ఫెస్టివల్ మహోత్సవాన్ని ఒంగోలులో మూడోసారి నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పుస్తక పఠనం ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. తొలుత అద్దంకి బస్టాండ్ నుంచి పుస్తక ప్రదర్శన కేంద్రం వరకు నిర్వహించిన పుస్తక ప్రియుల ర్యాలీలో జాయింట్‌కలెక్టర్ గోపాలకృష్ణ, ఏపీ ప్రెస్ అకాడమి ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, బుక్ ఫెస్టివల్ అధ్యక్షులు, లక్ష్మయ్య, కార్యదర్శి మనోహర్ నాయుడు, జేవీవీ నాయకులు సీఏ ప్రసాద్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య, కవి పొన్నూరు వేంకట శ్రీనివాసులు, మంచికంటి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారుల డప్పు ప్రదర్శనలు అలరించాయి.



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ సురేష్



ప్లకార్డులతో విద్యార్థినులు

డిప్యూటీ సీఎంను కలిసిన రియాజ్


డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసిన ఒడా ఛైర్మన్ రియాజ్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్‌ను ఒంగోలు అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) ఛైర్మన్ షేక్ రియాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం రియాజ్ డిప్యూటీ సీఎంను కలిసి తనకు పదవి ఇచ్చినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛాంధ్రాను పటిష్టంగా నిర్వహించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ఈనెల 23వతేదీన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్వచ్ఛాంధ్రతో పాటు ఎంఐట్యాంకులు, గ్రౌండ్‌వాటర్, సానుకూల ప్రజాదృక్పథం, ఏజెంట్ స్పేస్ కోసం డాక్యుమెంట్ అప్‌లోడ్, స్వామిత్వ, స్వచ్ఛాంధ్ర అవార్డులు, దిగువ కోర్టులలో ఖాళీగా ఉన్న లా ఆఫీసర్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై కలెక్టర్లతో దిశా నిర్దేశం చేశారు. ఈనెల 23న జరిగే స్వచ్ఛాంధ్రలో డ్రైనుక్లీనింగ్, పారిశుధ్యం ప్రధానాంశంగా తీసుకుని కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం



కమిషనర్ వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వృద్ధుల దినోత్సవ వేడుకలను రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం స్థానిక డీఆర్‌ఆర్‌ఎం హైస్కూలులో సీనియర్ సిటిజన్‌లకు వాకింగ్ పోటీలు నిర్వహించారు. నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఈ పోటీలను ప్రారంభించగా, పలువురు వయోవృద్ధులు రెట్టించిన ఉత్సాహంతో పోటీలో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. నారపనేని సాంబయ్య ప్రథమ బహుమతి సాధించగా, యోగా హరిబాబు ద్వితీయ, మద్దులూరి పున్నారావు తృతీయ, గొర్రెముచ్చు దాసు నాల్గవ బహుమతి పొందారు. కమిషనర్ విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రావిపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లూరి శ్రీనివాస్, కోశాధికారి ఆర్ల శ్రీరామ్మూర్తి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ


నోటుపుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో వెంకారెడ్డి

సంతనూతలపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు పంచాయతీ బొమ్మినేనివారిపాలెం ఎంపీయూపీ స్కూల్లో గురువారం విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. బొమ్మినేని వెంకయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త, జిల్లా టీడీపీ నాయకుడు బొమ్మినేని రామాంజనేయులు అందించిన నోటుపుస్తకాలు, స్టేషనరీలను ఎంఈవో వెంకారెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో 'శ్రీసరస్వతి' విజయకేతనం


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న రమణారెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఒంగోలులో గత ఎనిమిది రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీసరస్వతి జూనియర్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. నగరంలోని క్రికెట్ స్టేడియంలో గురువారం జరిగిన ముగింపు సభలో పీడీసీసీ బ్యాంకుచైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, శ్రీసరస్వతి విద్యాసంస్థల అధినేత ఏవీ.రమణారెడ్డి, విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్‌లు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఫైనల్ మ్యాచ్‌లో శ్రీసరస్వతి జూనియర్ కళాశాల జట్టు, ఎస్‌ఎస్‌ఎన్ జూనియర్‌కళాశాల జట్టుపై 32 పరుగుల తేడాతో గెలిచింది. కార్యక్రమంలో నాటకం సురేష్, జేఏసీ నాయకులు ప్రేమ్‌కుమార్, నరేష్‌రాజు, సూర్యకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ పోటీల్లో మొదటి బహుమతి శ్రీసరస్వతి జూనియర్ కాలేజీ జట్టు, ద్వితీయ బహుమతి ఎస్‌ఎస్‌ఎన్ జూనియర్ కాలేజీ, తృతీయ బహుమతి శ్రీచైతన్య కళాశాల జట్లు కైవసం చేసుకున్నాయి.

రూ.4 లక్షల విలువైన క్రీడా దుస్తుల పంపిణీ


బింగినపల్లిలో దుస్తులు అందుకున్న విద్యార్థులతో దాత వెంకటేశ్వర్లు

సింగరాయకొండ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేశ్వర్లు, తన్నీరు రమణయ్య పలు పాఠశాలల విద్యార్థులకు సుమారు రూ.4 లక్షల విలువ గల 1000 జతల క్రీడా దుస్తువులను పంపిణీ చేశారు. వీటిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రధానోపాధ్యాయుడు అర్రిబోయిన రాంబాబు ఆధ్వర్యంలో గురువారం పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోరి గవదగట్లవారిపాలెం, మల్లికార్జున్‌నగర్, పెదగొల్లపాలెం, తాతయ్యకాలనీ, బాలిరెడ్డినగర్, పకీర్‌పాలెం, బింగినపల్లి, సోమరాజుపల్లి, అప్పాపురం, ఆర్‌ఎస్ బాలయోగి నగర్ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేశారు. ఒంగోలు డివిజన్ పరిధిలోని 15 సమరసత సేవా ఫౌండేషన్ బాలవికాస కేంద్రాల విద్యార్థులకు కూడా దుస్తులు అందజేశారు.

రేపు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

కొండపి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కొండపిలోని కామేపల్లి రోడ్డులోని కల్యాణ మండపంలో టీడీపీ కొండపి నియోజకవర్గస్థాయి విస్తృతస్థాయి సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సమావేశానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పార్టీ జోనల్ ఇన్‌చార్జి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరవుతారని తెలిపింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని సత్య కార్యాలయం ప్రకటనలో కోరింది.

పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనర్థం


బ్యాగులను అందజేస్తున్న ఎంఈవో, హెచ్‌ఎం

టంగుటూరు (కొండపి), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని ఎంఈవో మారుతీబాలాజీ అన్నారు. తూర్పు నాయుడుపాలెంలోని జడ్పీ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బ్యాగులు అందజేశారు.

● కె.ఉప్పలపాడులోని ప్రాథమిక పాఠశాలలో నేషనల్ టుబాకో కంట్రోలర్ ప్రోగ్రాం కార్యక్రమం నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే అనర్థాలను ఎంఈవో-2 పి.రామారావు వివరించారు.

ట్రంక్‌రోడ్ విస్తరణపై ఊగిసలాట..!

సమావేశాలతో వాయిదాలు వేస్తున్న వ్యాపారులు ● తుది నిర్ణయం చెప్పాలంటూ తేల్చిన ఎమ్మెల్యే దామచర్ల


వ్యాపారులతో సమావేశమైన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ (ఫైల్)

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధిలో భాగమైన ట్రంక్‌రోడ్ విస్తరణ పనులు ఒక కొలిక్కి రావడం లేదు. గత మూడు నెలలుగా చర్చలు జరిపిన వ్యాపారులు పలు కారణాలు చెబుతూ వాయిదా వేస్తున్నారు. మరోవైపు విస్తరణ పనులు వేగవంతం చేసేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు మొదలుపెట్టారు. తొలుత 100 అడుగులు విస్తరించాలని భావించగా, వ్యాపారుల నుంచి అభ్యంతరం ఎదురైంది. అధికారుల నిర్ణయం ప్రకారం వంద అడుగులు విస్తరిస్తే సుమారు 132 మంది వ్యాపారులు నష్టపోతామని వారు తేల్చి చెప్పారు. అయితే వ్యాపారులు నష్టపోకుండా పాతమార్కెట్ వద్ద షాపులు నిర్మించి ఇవ్వడంతోపాటు, నాలుగు రెట్లు అధిక ధరతో టీడీఆర్ బాండ్‌లు కూడా ఇవ్వడానికి అధికారులు సిద్ధం అయ్యారు. దీంతో మూడు నెలలుగా విస్తరణ పనులు ఒక పట్టాన తేలకపోవడంతో విస్తరణపై నగర ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. ఒకవైపు వ్యాపారులు 60అడుగులు అయితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని వెల్లడిస్తున్నారు. ఇప్పటికే రోడ్డు 40 అడుగులు ఉండగా, 60 అడుగుల చేస్తే షాపులు ముందు సైడు కాలువలు తొలగించడం తప్ప ఒరిగేదేమి లేదని అధికారులు చెబుతున్నారు. కనీసం 90 అడుగులు అయినా విస్తరించడం ద్వారా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను తొలగించవచ్చని అధికారులు పదేపదే వ్యాపారులకు సూచిస్తున్నారు. అయితే ట్రంక్‌రోడ్ విస్తరణపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మూడుసార్లు వ్యాపారులతో ప్రత్యేకంగా సమావేశాలు జరిపారు. అయినప్పటికీ వారి నుంచి భిన్నభిప్రాయబేధాలు రావడంతో ప్రతిసారీ సమావేశం వాయిదా పడటం, మరోసారి చర్చిద్దామంటూ కాలయాపన జరుగుతోంది. ఈక్రమంలో రెండు రోజుల క్రితం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల వ్యాపారులతో సమావేశం అయ్యారు. ఇకపై సమావేశాలు.. చర్చలు వద్దని, అందరు మాట్లాడుకుని ఒక నిర్ణయం తేల్చి చెప్పాలని వారికి స్పష్టం చేశారు. ఈక్రమంలో ట్రంక్‌రోడ్‌కు చెందిన కోట శ్రీమన్నారాయణ రోడ్డు విస్తరణ పనులపై అభ్యంతరం తెలియజేస్తూ హైకోర్టును ఆశ్రయించడంతో తీర్పు పదిరోజులకు వాయిదా వేశారు. దీంతో మరోసారి ట్రంక్‌రోడ్ పనుల్లో జాప్యం నెలకొంది. కోర్టు తీర్పు వెలువడిన అనంతరం న్యాయస్థానం ఆదేశాలను పరిశీలించి అందుకనుగుణంగా విస్తరణ పనులు వేగవంతం చేయడానికి అధికారులు సిద్ధం అయ్యారు. ఇప్పటికే వ్యాపారులకు 100 అడుగుల విస్తరణకు నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. గత మూడు నెలలుగా చోటు చేసుకున్న పరిణామాలు, అభ్యంతరాలు పరిశీలనలోకి తీసుకుంటూనే, నగర అభివృద్ధిలో భాగంగా కార్పొరేషన్ హోదాకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ ప్రకారం ట్రంక్‌రోడ్‌ను 80 అడుగుల మేరకు విస్తరించనున్నట్లు తెలుస్తోంది.

ప్రకాశంపంతులు జయంతికి విస్తృత ఏర్పాట్లు

● పరిశీలించిన అధికారులు


వినోదరాయునిపాలెంలో పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఒంగోలు(రూరల్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం దేవరంపాడు ఉప్పు సత్యాగ్రహ విజయస్థూపం వద్ద టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి కార్యక్రమాల ఏర్పాట్లను అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు మాట్లాడుతూ ఈనెల 23న స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలచెన్నయ్య, తహసీల్దార్ నాయబ్‌రసూల్, సర్పంచ్ ఎన్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వినోదరాయునిపాలెంలో..

నాగులుప్పలపాడు: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సీఎం టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి వేడుకలను ఈ నెల 23న ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆయన జన్మస్థలం వినోదరాయునిపాలెం గ్రామంలో నిర్వహించనున్నారు. ఈమేరకు గురువారం ఎంపీడీవో రవికుమార్ స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగే సభ నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సర్పంచ్ ఘట్టమనేని అశోక్, ఎంఈవోలు తిరుమలశెట్టి రవి, ఈవీ.రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో మురళీ, హెచ్‌ఎం రమేష్ ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.

సొసైటీ సేవలను రైతులకు చేరువ చేయాలి

పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య పిలుపు ● కేవీ.పాలెం సొసైటీ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ


సీతారామయ్య, లక్ష్మీనరసయ్యలను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

చీమకుర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : కూనంనేనివారిపాలెం సొసైటీ సేవలను రైతులకు చేరువయ్యేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య కోరారు. కేవీపాలెం సొసైటీ చైర్మన్‌గా ఎనికపాటి లక్ష్మీనరసయ్య, సభ్యులుగా కంకణాలపాటి కోటేశ్వరరావు, దర్శి సుబ్బారావు గురువారం స్థానిక సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన చైర్మన్ సీతారామయ్య నూతన పాలకవర్గాన్ని అభినందించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసిన సీనియర్ నేత లక్ష్మీనరసయ్యను చైర్మన్‌గా ఎంపికచేయటం సంతోషకరంగా ఉందన్నారు. ఎనభై ఏళ్లకు పైబడిన వయస్సులో కూడా ఉత్సాహంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, పుట్టా బ్రహ్మయ్య, గోగినేని రాజా, పాలడుగు నారాయణ, పూనాటి వెంకట్రావు, పారా చంద్రశేఖర్, కడియాల వెంకట్రావు, రావిపాటి రాంబాబు, గొల్లపూడి సుబ్బారావు, కూనంనేని లోకేష్, కందిమళ్ల గంగాధరరావు, దొడ్డా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి సొసైటీ చైర్మన్ బాధ్యతలు


చైర్మన్ వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న పూర్ణచంద్రరావు

జరుగుమల్లి (కొండపి), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జరుగుమల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా చింతలపాలెం గ్రామ టీడీపీ నాయకుడు నలమోతు వెంకటేశ్వర్లు గురువారం జరుగుమల్లిలోని సొసైటీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ తోపాటు మెంబర్లు కొండూరి బలరామిరెడ్డి, రావులపల్లి రామకోటయ్యలను టీడీపీ జిల్లా సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ సీతారామయ్య అభినందించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, రిటైర్డ్ పీఆర్‌ఏఈ కోట శ్రీహరి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు అభినందించారు.

ఆకట్టుకుంటున్న 'విజ్ఞాన ప్రపంచం'

● విజయవాడ బుక్ ఫెస్టివల్‌కు విశేష స్పందన

● పుస్తక ప్రియులతో పీవీఆర్‌లో సందడి




బుక్ ఫెస్టివల్‌లో సందడి చేస్తున్న విద్యార్థులు



విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో గత వారం రోజులుగా కొనసాగుతున్న ఫెస్టివల్‌ను వీక్షించేందుకు పుస్తకప్రియులు పోటెత్తుతున్నారు. కాగా ప్రదర్శనలో సుమారు 50వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉంచారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, రచయితలు, సాహితీ వేత్తలు వీక్షించడంతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఇప్పటి వరకు సుమారు 40 వేల మంది సందర్శకులు పుస్తక ప్రదర్శనను వీక్షించినట్లు నిర్వాహకులు మనోహర్‌రెడ్డి తెలిపారు. విలువైన విజ్ఞానంతో కూడిన పుస్తకాలు, అలాగే ప్రముఖల రచనలు, సైన్స్ పుస్తకాలు, మహిళల కోసం,. ఇలా ఒకటేమి వివిధ రకాల పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. కాగా ప్రతిరోజు నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించడంతోపాటు, సైన్సు గొప్పతనాన్ని వివరించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 25వ తేదీన ఆదివారంతో పుస్తక ప్రదర్శన ముగియనుంది. దేశంలో ప్రాముఖ్యత కలిగిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నగరంలో ఏర్పాటు చేయడంపై పుస్తకప్రియులు ఆనందరం వ్యక్తం చేస్తున్నారు.

- ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

మార్కెట్‌కు అనుకూలమైన బేళ్లు తెచ్చుకోవాలి


వేలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎం రామారావు

టంగుటూరు (కొండపి), ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు ఏ రకం పొగాకుకి డిమాండ్ ఉందో, రెండు రోజులు ముందు పరిశీలించుకుని తమ కోటా రోజున ఆయా రకం బేళ్లను వేలానికి తెచ్చుకోవాలని పొగాకు బోర్డు ఒంగోలు ఆర్‌ఎం శీలం రామారావు రైతులకు సూచించారు. టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో ఆయన వేలాన్ని గురువారం పరిశీలించారు. అనంతరం కమ్మవారిపాలెం, కట్టుబడివారిపాలెం గ్రామాల రైతులతో ఆయన మాట్లాడారు. వేలం కేంద్రానికి బేళ్లను తెచ్చేటపుడు తేమ, వేడి లేకుండా పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. 2025-26 పంట కాలానికి పొగాకు బోర్డు అనుమతించిన మేరకు పొగాకు సాగు చేయాలని సూచించారు. పొలాలు, బ్యారన్లు అధిక రేట్లకు కౌలుకు తీసుకోవద్దని ఆయన చెప్పారు. కమర్షియల్ నారుమడి సాగు చేసే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రైతులు కూడా రిజిస్టర్ అయిన నారుమడి నుంచి పొగాకు నారు తీసుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు(రూరల్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలు పరిష్కరించాలంటూ ఒంగోలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు వేతనాలను పెంచాలన్నారు. గత ప్రభుత్వంలో సమ్మెకాలం నాటి మినిట్స్ కాపీల జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.ఎమీమా, రాజేశ్వరి, అంజన, జయలక్ష్మి, విజయ, మంజు, పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి వారిని వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

చిత్తశుద్ధితో విధులను నిర్వహించాలి : కలెక్టర్


ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సర్వీసులో చేరిన వారు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. స్థానిక కలెక్టర్‌క్యాంపు కార్యాలయంలో గురువారం కారుణ్య, ప్రత్యేక నియామక కోటాలో ముగ్గురికి ఆమె ఉద్యోగ నియామకపత్రాలను అందజేశారు. అందులో ఇద్దరికి రెవెన్యూశాఖలో, ఒకరికి దివ్యాంగుల సంక్షేమశాఖలో ఉద్యోగ అవకాశాన్ని కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో నైపుణ్యం పెంచుకొని ఉన్నతస్థానానికి చేరుకునేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రవికుమార్, దివ్యాంగుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు సువార్త పాల్గొన్నారు.

పెరటి తోటలను పెంచుకోవాలి

ఒంగోలు(రూరల్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మహిళలు పెరటి తోటలు పెంచుకోవాలని ఎంపీడీవో శేషుబాబు కోరారు. గురువారం ఒంగోలు మండల వెలుగు కార్యాలయంలో మహిళలకు కూరగాయ విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూరగాయలను ఇళ్ల వద్దనే పండించుకోవడం వల్ల ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలిపారు. అలాగే నాణ్యమైన కూరగాయలు సేంద్రియ పద్ధతిలో ఉత్పత్తి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ప్రతి కుంటుంబం తమ గృహాల వద్ద తప్పక పెరటితోటలు పెంచుకుని లాభపడాలని సూచించారు. 11రకాల కూరగాయాల విత్తనాల పాకెట్‌ను రూ.65లకు కొనుగోలు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీఎం బి.శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఊరచెరువులో ఆక్రమణలపై రీసర్వే

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని ఊరచెరువులో ఆక్రమణలపై కార్పొరేషన్ అధికారులు రీ సర్వే ప్రారంభించారు. ఊరచెరువులో పలు అక్రమకట్టడాలు నిర్మించడంతో పాటు ఆక్రమణలు కూడా పెరిగాయి. దాంతో గతంలో పనిచేసిన అధికారులు, సిబ్బంది నేతృత్వంలో కొన్నింటికి ఇంటి పన్నులు విధించగా, మరికొన్నింటికి పన్ను విధించకుండానే ఆధునాతన భవనాలు నిర్మించారు. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్పొరేషన్‌కు చెందిన ఊరచెరువులో ఎలాంటి నిర్మాణాలు, ఆక్రమణలు, క్రయవిక్రయాలు జరపకూడదు. గతంలోని కొందరు అధికారులు నిర్వాకంతో జరిగిన అక్రమాలు, ఆక్రమణలపై కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాలతో కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది రీసర్వే నిర్వహించి పూర్తిస్థాయిలో లెక్కలు తేల్చనున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'శ్రీహర్షిణి' విద్యార్థిని ఎంపిక


అభిద్యను అభినందిస్తున్న చైర్మన్ రవికుమార్

ఒంగోలు విద్య, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో నిర్వహిస్తున్న చాంపియన్‌షిప్ కప్ పోటీలకు ఒంగోలులోని శ్రీహర్షిణి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని గేరా అభిద్య ఎంపికయ్యారు. జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించిన అభిద్య జోనల్ స్థాయికి ఎంపిక కాగా బుధ,గురువారాల్లో గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో కాంస్య పతకంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఒంగోలులోని కళాశాలలో అభిద్యను కాలేజీ చైర్మన్ గోరంట్ల రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గేరా అజయ్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డీన్ డి.ఆంజనేయులు, జీఎం శివరాం, ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని పాత రిమ్స్‌లోని డీపీహెచ్‌ల్యాబ్ ఆఫీస్ కార్యాలయంలో రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాండురంగారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, ఏసురత్నం, మహిళావిభాగం అధ్యక్షురాలు రజితమానస, ఆశాఖ ఉద్యోగులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరెడ్డి, గోవిందరావు, పవన్, మోహన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు శిక్షణ తరగతులు

సంతనూతలపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ పురోగతి సూచికపై ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీవో డి.సురేష్‌బాబు గురువారం తెలిపారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అనంతరం సంతనూతలపాడు-2 సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

24న డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భళా గణేష్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భళా గణేష్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఛైర్‌పర్సన్ దామచర్ల నాగసత్యలత తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఒంగోలులోని ఎమ్మెల్యే నివాసంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆయన సతీమణి నాగసత్యలత ఆవిష్కరించారు. ఈనెల 24వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు వినాయక స్వామి పర్యావరణ ప్రతిమల పోటీలు జరుగుతాయన్నారు. రెండు విభాగాలుగా ఈ పోటీలు ఉంటాయని, 10 నుంచి 15 సంవత్సరాల వయస్సు లోపు వారికి, 16 నుంచి 25 సంవత్సరాల వయస్సులోపు వారికి వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని, వివరాలకు 9177582347, 9059603597 సెల్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరిని ఏపీ కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ గురువారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం, 1కే డోనార్స్ క్లబ్ ద్వారా చేపడుతున్న సమాజసేవా కార్యక్రమాలను గురించి ఆయనకు వివరించారు. అలాగే ఈనెల 24వ తేదీన ఒంగోలు బృందావన్ ఫంక్షన్ హాలులో జరిగే 1కే డోనార్స్ క్లబ్ ఆత్మీయ సమావేశానికి రావాలని ఆహ్వానించారు.

ముప్పాళ్ల సొసైటీ అధ్యక్షుడు బాధ్యతల స్వీకరణ


చైర్మన్ రమణయ్యను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

పొన్నలూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ముప్పాళ్ల సొసైటీ చైర్మన్‌గా మంగపతివారిపాలెంకు చెందిన మన్నెం రమణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా పాతసింగరబొట్లపాలెంకు చెందిన చల్లా శ్రీనివాసరెడ్డి, ముప్పాళ్లకు చెందిన దేవరపల్లి వెంకటరామిరెడ్డి కూడా బాధ్యతలు చేపట్టారు. రమణయ్యను పలువురు నాయకులు అభినందించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

చీమకుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించటంలో ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరిని నిరసిస్తూ గురువారం చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పి.అంజనేయులు, విజయ, మాధవి, శారద, మస్తానమ్మ, నాగరత్నం, శారమ్మ, రేవతి పాల్గొన్నారు.

అవీ..ఇవీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం

నూతన బార్ల పాలసీని సద్వినియోగం చేసుకోవాలి

మార్కాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు నూతన బార్ అండ్ రెస్టారెంట్ల పాలసీని సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషా బేగం అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మార్కాపురంలోని మద్యం వ్యాపారులు, కల్లుగీత కార్మికులతో గురువారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎస్ మాట్లాడుతూ మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 7 బార్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వాటిల్లో జనరల్ కేటగిరిలో 5, కల్లుగీత కార్మికులకు రెండు బార్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. గతంతో పోల్చితే జనరల్ కేటగిరిలో వార్షిక ఫీజు రూ.55 లక్షలన్నారు. అదే విధంగా కల్లుగీత కార్మికులకు కేటాయించిన బార్లకు రూ.27.5 లక్షలు మాత్రమేనన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి పరిస్థితులు మేరకు మార్కాపురంలో ఒక్కో బార్‌కు రూ.కోటికిపైగా ఎక్సైజ్‌శాఖకు చెల్లించారన్నారు. కానీ ఆ పరిస్థితి లేదన్నారు. వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ బాలయ్య, సీఐ ఎం.వెంకటరెడ్డి, ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బంది, వ్యాపారులు, గీత కార్మికులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిబ్బంది సహకారంతోనే గుర్తింపు

కొమరోలు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) : కార్యాలయంలో పనిచేస్తున్న సహ సిబ్బంది కృషితోనే గుర్తింపు వచ్చిందని తహసీల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా ఉత్తమ తహసీల్దార్‌గా భాగ్యలక్ష్మి ఆగస్టు 15న కలెక్టర్ చేతుల మీదుగా ఆవార్డును తీసుకున్న సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారంఆమెను ఘనంగా రెవెన్యూ ఆధికారులు, సిబ్బంది సన్మానించారు. ఈసందర్భంగా తహసీల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు సత్వరమే వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. డీటీ వెంకటరెడ్డి, సిద్దయ్యలు మాట్లాడుతూ కార్యాలయంలోని అధికారులు, సిబ్బందితో నిరంతరం ప్రజలకు సాధ్యమైనంత మేరకు న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారని అన్నారు. తహసీల్దార్ భాగ్యలక్ష్మిని వీఆర్వోల సంఘం నాయకులు ఎల్ వీ రమణ, సర్వేయర్లు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యాక్రమంలో వీఆర్వోలు హనిషా, పాండు, సిద్దయ్య, రమణయ్య, నారాయణ, జమాల్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

కొనకనమిట్ల, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) : కొనకనమిట్ల పోలీస్‌స్టేషన్‌ను పొదిలి సీఐ వెంకటేశ్వర్లు గురువారం అకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి క్రైమ్‌రిపోర్టుపై ఆరాతీశారు. రాత్రివేళలో దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. అదేవిధంగా రోడ్డుప్రమాదాల నివారణ వంటి ఆంశాలపై సలహాలు, సూచనలు చేశారు. పోలీస్‌లు విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌ల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. త్వరలో ప్రజలు జరుపబోయో వినాయకచవితి మండలపాల పర్మిషన్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బందికి సూచించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈయన వెంట కొనకనమిట్ల ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి, పలువురు సిబ్బంది తదితరులు ఉన్నారు.


విత్తనశుద్ధిపై రైతులకు సూచనలిస్తున్న ఏవో జవహర్ లాల్ నాయక్

విత్తనశుద్ధితో ఎండు తెగులు నివారణ

పెద్ద దోర్నాల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):విత్తనశుద్ధి వల్ల కందిలో ఎండుతెగులు నివారించవచ్చని మండల వ్యయసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని నల్లగుంట్ల గూడెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్) పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా కంది సాగు పెంచడంతో పాటు సస్య రక్షణ చర్యలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాచ సహాయకులు మాధురి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్. సావిత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26విద్యాసంవత్సరానికి గానూ ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సుల కోసం అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం కళాశాలలో, లేదా 63037 94980, 9505723036 నెంబర్లను సంప్రదించాలన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వేపై శిక్షణ

జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు

గిద్దలూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల సిబ్బందికి డిజిటల్ క్రాప్ సర్వే (ఈపంట నమోదు), స్వర్ణాంధ్ర 2047, జీపీఏ, వ్యవసాయ యంత్ర పరికరాలు, పంటబీమా, ఎరువుల నిల్వ, అమ్మకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2025-26 సీజన్‌కు సంబంధించి ఈపంట నమోదు కార్యక్రమం జరుగుతున్నదని , రైతు సేవా కేంద్రాల సిబ్బంది ప్రతి గ్రామంలో ప్రతి రైతు పంట పేరు, సర్వే నెంబరు నమోదు చేయాలన్నారు. పంటల బీమాకు సంబంధించి ఎంపికైన పంటలకు ఈనెల 31వ తేదీలోగా బీమా కట్టుకునే విధంగా చూడాలన్నారు. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా వ్యవసాయ ఉత్పత్తి పెంచేందుకు చేపట్టవలసిన విషయాలను గ్రామస్థాయిలో రైతులకు తెలియచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతుల వద్ద వ్యవసాయ యంత్ర పరికరాలు ఎన్ని ఉన్నాయనేది సర్వే చేయాలన్నారు. అవసరమైన ఎరువులను ఇండెంట్ పెట్టి ఏపీ మార్క్‌ఫెడ్ నుంచి తెప్పించి రైతులకు ఇవ్వాలన్నారు. సమావేశం అనంతరం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని 4 మండలాల ప్రైవేటు డీలర్లతో జిల్లా వ్యవసాయాధికారి సమావేశమయ్యారు. ఎరువుల నిల్వలు, అమ్మకాలు, ఎంఆర్‌పీపై సమీక్ష నిర్వహించారు. ద్రవరూప ఎరువులైన నానో యూరియా, నానో డీఏపీ యొక్క ఉపయోగాల గురించి రైతులకు తెలియచేసి వాటిని వాడించే విధంగా చూడాలని వ్యాపారులను కోరారు. అనంతరం కేఎస్‌పల్లె గ్రామంలోని ఆముదం పంటను ఆయన పరిశీలించి చీడపీడలను గుర్తించి నివారణ చర్యలను రైతులకు స్వయంగా వివరించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశ్రీ, వ్యవసాయాధికారులు, సాంకేతిక వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

రైతులు ఈ క్రాప్ తప్పనిసరిగా చేసుకోవాలి

మార్కాపురం రూరల్: పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని డీఏవో శ్రీనివాసరావు కోరారు. మండలంలోని చింతగుంట్ల గ్రామం వద్ద రైతులు సాగు చేసిన పత్తి పంటను వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంట నమోదు చేస్తేనే ప్రభుత్వం నుంచి రైతులకు ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ఈ క్రాప్ చేయాలని సిబ్బందికి సూచించారు. మార్కాపురం వ్యవసాయశాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని మార్కాపురం, తర్లుపాడు, అర్ధవీడు, పెద్దారవీడు, కంభం, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. షాపులో కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తప్పనిసరిగా తగిన రసీదును ఇవ్వాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ బాలాజీనాయక్, ఏవో బుజ్జిబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని అంగన్వాడీ కార్యకర్తల నిరసన


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జీతాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని కోరుతూ గురువారం సాయంత్రం అంగన్వాడీ కార్యకర్తలు ఎర్రగొండపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. గత ప్రభుత్వంలో జీతాలు పెంచాలని 42 రోజులు ధర్నా చేసినా అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి టీడీపీ అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారని, అధికారం చేపట్టి 14 నెలలు గడిచినా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించలేదని యూనియన్ నాయకులు అన్నారు. నిరసన అనంతరం డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ నాయకురాలు జి. నాగమల్లేశ్వరి, షేక్ నసీమా, జి. పద్మావతి, జి. రామకుమారి,జి. రామలక్ష్మమ్మ, ఎం. మల్లేశ్వరి, ఎన్. రామసుబ్బమ్మ, ఎస్. త్రివేణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


గిద్దలూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వేతనాలు పెంచాలి

గిద్దలూరు : వివిధ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆంజనేయరెడ్డికి అందజేశారు. అంగన్‌వాడీ హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణ, మున్నాలు ఈసందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులతో పాటు సీఐటీయూ నాయకులు సాయిలక్ష్మి, రూతమ్మ, విశ్రాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రాచర్ల: అంగన్ వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్ వాడీ యూనియన్ సంఘ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాచర్ల మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హర్షకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు సీసీ కెమెరాలు తప్పనిసరి

పొదిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి పండుగ సందర్భంగా తప్పనిసరిగా మండపాల ఏర్పాటుకు అనుమతితో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. పొదిలి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో వినాయకచవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న మండపాల వద్ద కమిటీ సభ్యులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎటువంటి ఆవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని తెలిపారు. ఎన్నిరోజులు పండుగ చేస్తారు, ఎప్పుడు నిమజ్జనం చేస్తారు అనేవిషయాన్ని దరఖాస్తులో పొందుపరచాలని చెప్పారు. ముందుగా మండపాలు ఏర్పాటు చేసుకునేవారు విద్యుత్‌శాఖ, పంచాయతీ, నగర పంచాయతీ అధికారులకు తెలియపరచాలన్నారు. ప్రధాన రహదారుల వెంట మండపాలు ఏర్పాటు చేయకూడదని, తప్పనిసరి పరిస్థితి అయితే సమాచారం ఇస్తే పరిశీలించిన తరువాతనే అనుమతి ఇస్తామన్నారు. ఎ మైక్, డీజేకు మాత్రమే నామమాత్రపు ఫీజు ఉంటుందని, అనుమతికి ఎలాంటి ఫీజులేకుండా ఇస్తామని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

మట్టి విగ్రహాలు శ్రేయస్కరం

త్రిపురాంతకం : వినాయకచవితి పండుగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు మట్టి ప్రతిమలు ఏర్పాటు చేసుకుంటే శ్రేయస్కరం అని త్రిపురాంతకం సీఐ అస్సాన్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మట్టి విగ్రహాలు పర్యావరణానికి మేలన్నారు. ఏర్పాట్ల విషయంలో అన్నీ ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు సమావేశంలో ఎస్సై శివబసవరాజు ఉన్నారు.

పట్టు పురుగుల పెంపకంలో మెలకువలు పాటించండి


మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పట్టు పరిశ్రమ అధికారులు

రాచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టు పురుగుల పెంపకంలో రైతులు మెలకువలు పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానం అనుసరిస్తూ సాగు చేయాలని జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి డాక్టర్ పి. సుజయ్ కుమార్ అన్నారు. మండలంలోని ఎడవల్లి గ్రామంలో కేంద్రీయ పట్టు మండలి ఆధ్వర్యంలో నా పట్టు నా అభిమానం (మేరా రేషన్ మేరా అభిమాన్) కార్యక్రమంలో భాగంగా మల్బరీ పంట నాటే రైతులకు పట్టు పురుగుల పెంపకంలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పట్టు పరిశ్రమ ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మైసూర్ కేంద్రీయ పట్టు పరిశోధన, శిక్షణ సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ డి. జాయిసిరాణి, డాక్టర్ పురుషోత్తం కర్నూల్ పట్టు పరిశ్రమ డీడీకే నాగేష్, రిటైర్డ్ డీఎస్ సీవీ నారాయణ రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ ఐ. శ్రీధర్, టెక్నికల్ ఆఫీసర్ జీవీ సుబ్బారెడ్డి, టెక్నికల్ , ఫీల్డ్ అసిస్టెంట్లు, రామాపురం సొసైటీ బ్యాంక్ చైర్మన్ భవనం పుల్లారెడ్డి, గ్రామ పెద్దలు రాచర్ల, గిద్దలూరు మండలాల పట్టు పరిశ్రమ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- సంగమేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి, త్రిపురాంతకం



ప్ర: ఎరువులు సరిపడా ఉన్నాయా?

జ: మండలంలో ప్రస్తుతం యూరియా కొరత లేకుండా చేశాం. ఇప్పటికే 250టన్నుల యూరియా అందుబాటులో ఉంది. అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ, సహకార సంఘాల్లో, ప్రైవేటు దుకాణాల్లో కూడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

ప్ర: వ్యాపారులకు ప్రత్యేకంగా ఏమైనా ఆదేశాలు ఇచ్చారా?

జ: ఎరువులు ముఖ్యంగా యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించాం. అధిక ధరలకు అమ్మినట్లు ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూనే ఉన్నాం.

ప్ర: ప్రస్తుతం రైతుల అవసరాలు ఎలా ఉన్నాయి?

జ: ఎక్కువగా మండలంలో వరి సాగు చేస్తారు. ఇప్పటికి ఇంకా వరినాట్లు ముమ్మరం కాలేదు. ఇప్పుడిప్పుడే వరినాట్లు ప్రారంభమవుతున్నాయి. కాబట్టి ఇంకా ఎరువుల అవసరత కనిపించటం లేదు.

ప్ర: ఇప్పటివరకు సాగు వివరాలు ఎలా ఉన్నాయి?

జ: మండలంలో ఇప్పటివరకు 1,100 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అందులో ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, కందిపంటలు ఉన్నాయి. ఇప్పటినుంచి వరినాట్లు ప్రారంభమవుతున్నాయి.

కృష్ణాష్టమి వేడుకలు విజయవంతం చేయండి


ఆహ్వాన పత్రికలు అందిస్తున్న మహిళలు

రాచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జ్ఞాన వేదిక అనుములపల్లి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు గురువారం అనుములపల్లి గ్రామ పెద్దలకు ఆహ్వానం పలికారు. 22వ తేదీ ఊరేగింపు జరుగుతుందని ఈ కార్యక్రమానికి పెద్దలందరూ హాజరై ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమానికి సంబంధించి శిరిగిరి రమేష్, శిరిగిరి వెంకటపతి, యేలెం గోవిందయ్య, మూల నారాయణ రెడ్డి, మల్ల రామయ్య, శిరిగిరి రాధాకృష్ణ, కుప్పా రంగనాయకులు, మల్ల కాశయ్య, వెనుతర్ల రామకృష్ణారెడ్డి, కావేటి ఆవులయ్య, తదితరులను త్రైత సిద్ధాంతం ప్రతినిధులు కలిసి ఆహ్వానించినట్లు వారు తెలిపారు.


ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతున్న టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

రైతు సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం

- ముటుకుల పీఏసీఎస్ కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యం అని వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు.గురువారం పుల్లలచెరువు మండలంలోని ముటుకుల పీఏసీస్ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ముందుగా ఐటీవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఐటివరం నుంచి మానేపల్లికి ట్రాక్టరుపై ర్యాలీగా చేరుకొని ముటుకుల సొసైటీ చైర్‌పర్సన్‌గా పావులూరి యోగేశ్వరరావు ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైపాలెం నియోజకవర్గానికి టీడీపీ పాలనలో కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు మంజూరు అయ్యాయని, గ్రామాల్లో వాటిని సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ వెంకటయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్,కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, పోట్ల గోవిందు, సొసైటీ డైరెక్టరు కోటారి అచ్చయ్యగద్దె వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బారావు

బైక్‌ల చోరీ దొంగ అరెస్ట్

- రెండు వాహనాలు స్వాధీనం

మార్కాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మోటార్‌బైక్‌లు చోరీ చేస్తున్న ఓ దొంగను మార్కాపురం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఐ సుబ్బారావు వివరాలు వెల్లడించారు. పెద్దదోర్నాల మండలం వై.చెర్లోపల్లి గ్రామానికి చెందిన సంద్ర పోలయ్య చిన్న కుమారుడు అజయ్ పదవ తరగతి వరకు చదువుకున్నాడు. చదువు ఇష్టంలేక కూలీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. దీంతో ఎలాగైనా వక్రమార్గంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని మోటార్‌బైక్‌లు దొంగతనం చేయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో జూన్ 22వ తేదీన పెద్దదోర్నాలలోని పశువుల వైద్యశాల వద్ద పార్క్ చేసివున్న హోండా షైన్ వాహనాన్ని దొంగిలించాడు. ఇంట్లో వాళ్లకు ఆ వాహనం తన స్నేహితుడిది అని చెప్పి వాడుకుంటున్నాడు. సొంత ఊరి నుంచి వచ్చి మార్కాపురంలోని సహర పెట్రోల్ బంకు వద్ద ఘని ఫోమ్ వాష్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. మోటార్ బైక్‌లు దొంగతనం చేయడం హాబీగా పెట్టుకున్న అజయ్ స్థానిక ఎస్‌వీకేపీ కాలేజీ ఎదురుగా ఉన్న వక్కలగడ్డ అపార్ట్‌మెంట్ ముందు పార్క్ చేసివున్న హెచ్ఎఫ్ డీలక్స్ బైక్‌ను ఈ నెల 12వ తేదీన దొంగతనం చేసి తాను పనిచేసే వాటర్ సర్వీసింగ్ సెంటర్‌కు చేర్చాడు. ఈ విషయమై బైక్‌పోయిన నారాయణం శ్రీనివాసులు టౌన్ పోలీసు స్టేషన్‌లో అదే రోజు ఫిర్యాదు చేశాడు.ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారించగా బైక్‌లు ఘనీ వాటర్ సర్వీసింగ్ సెంటర్ వద్ద ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. గురువారం అక్కడకు వెళ్లి అజయ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తానే రెండు బైక్‌లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు ముద్దాయిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విలేకరుల సమావేశంలో టౌన్ ఎస్సైలు ఎం.సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావులు పాల్గొన్నారు.


సర్వేలపై సిబ్బందితో రివ్యూ నిర్వహిస్తున్న ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

సర్వేలను త్వరగా పూర్తి చేయాలి

- ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

రాచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సర్వేలన్నింటినీ సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని మండల ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన సచివాలయాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పీ ఫోర్, వర్క్‌ఫ్రమ్ హోం, సచివాలయ అటెండెన్స్, తదితర సర్వేలపై సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలని, నిర్ణీత సమయానికి సర్వేలను పూర్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు ఆదేశించిన సమయానికి సర్వేల రిపోర్టు అందజేయాల్సి ఉంటుందని,సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అప్పగించిన సర్వేలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంతవరకు జరిగిన సర్వేలపై ఆయన సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఉత్తమ అవార్డు అందుకున్న ఎంపీడీవోకు ఘన సన్మానం

ఉత్తమ ఎంపీడీవో అవార్డు అందుకున్న వెంకటరామిరెడ్డిని స్థానిక కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది గురువారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ప్రజలకు ఉత్తమ సేవలందించి ఇలాంటి మరెన్నో అవార్డులు అందుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, అన్ని సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు

పెద్ద దోర్నాల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ తరగతులు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతాయని, జడ్‌పీటీసీ, ఎంపీటీసీలు,సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

పంచాయతీల పురోగతిపై ప్రత్యేక శిక్షణ

రాచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) :పంచాయతీల పురోగతిపై మండల స్థాయి అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఎస్. వెంకటరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం (22వతేదీ) ఉదయం 10గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ, జడ్‌పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,అన్ని శాఖల అధికారులకు శిక్షణ జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సత్యం బాధ్యతల స్వీకరణ



తాళ్లూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా సానికొమ్ము సత్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. దారా హనుమంతరావు సెలవుపై వెళ్లటంతో కార్యాలయ పర్యవేక్షకులు సానికొమ్ము సత్యంకు పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమిస్తూ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో కూడా ఆయన ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. ఈసందర్భంగా సత్యం మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యాలయం సిబ్బంది ఆయనను సత్కరించారు.

తహసీల్దార్ లక్ష్మీనారాయణకు సన్మానం

ముండ్లమూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉత్తమ తహసీల్దార్‌గా ప్రశంసాపత్రం అందుకున్న లక్ష్మీనారాయణను గురువారం రేషన్ డీలర్లు సన్మానించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీటీ శ్రీకాంత్, డీలర్లు వీరపనేని నాగేశ్వరరావు, కాసా అంజిరెడ్డి, చుంచు వీర నారాయణ, శివ, బద్రి గోపాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

ముండ్లమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో ని పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ పరిశీలించారు. కేంద్రాల్లో ఉన్న వసతులు పరిశీలించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు నమోదు చేసుకొనే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు కావూరి దయానందం, పోగుల శేషగిరిరావు పాల్గొన్నారు.

తాగునీటి బావుల్లో క్లోరినేషన్

పీసీపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుదేవారిపాలెం పంచాయతీలోగల తాగునీటి బావుల్లో నీరు కలుషితం కాకుండా సర్పంచ్ కనపర్తి శాంసన్ గురువారం క్లోరినేషన్ చేయించారు. పంచాయతీ పరిధిలోని రామాపురం, గుదేవారిపాలెం, చింతలపాలెం, బండపాలెం గ్రామాల్లో ఉన్న తాగునీటి బావులకు ఇటీవల కురిసిన వర్షాలకు కొత్తనీరు చేరింది. ఈనీరు కలుషితం కాకుండా పంచాయతీ సిబ్బందితో కలిసి బావుల్లో బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో కార్యదర్శి సౌజన్య పాల్గొన్నారు.

పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కనిగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కనిగిరి మండలంలో దివ్యాంగ పింఛన్ పొందుతూ వైద్య పరీక్షల అనంతరం తాత్కాలికంగా తొలగింపు నోటీసు అందుకున్నవారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని గురువారం ఎంపీడీవో ప్రభాకర్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పెన్షన్ తీసుకుంటూ ఆగిపోయినవారు దరఖాస్తు ఫారంతో పాటు నోటీసు కాపీ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, ఇతరత్రా ఏవైనా ఉంటే ఒక సెట్ కాపీలతో ఈనెల 25లోగా స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

తాళ్లూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజానగరం పాఠశాలకు గ్రామవాసి మేడగం హనుమంతరెడ్డి గురువారం 40వేల విలువగల కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. ఈసందర్భంగా హనుమంతరెడ్డిని హెచ్‌ఎం బి.మోహన్‌గాంధి, ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు.

నిధుల అవకతవకలపై విచారించాలి

పామూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పొదుపు గ్రూపు సొమ్మును స్వాహా చేసి వీవోఏ పల్లాపు బేబి పరారయ్యారు. ఇది జరిగి నాలుగు నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు విచారించకుండా కాలయాపన చేస్తున్నారని గోపాలపురం గ్రామానికి చెందిన బాధిత పొదుపు గ్రూపు మహిళలు గురువారం సీఐ ఎం. భీమానాయక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సీఐ హామీ ఇచ్చారు. అనంతరం ఏపీవో విద్యాసాగర్‌ను సర్కిల్ కార్యాలయానికి పిలిపించుకొని వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ కె.కమలాకర్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని వేములబండ గ్రామంలో పల్లె నిద్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న విషయాలకు గొడవలకు దిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్నారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం తమ్మలూరు, ఉమా మహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, ఈదర గ్రామాల్లో రౌడీ షీటర్ల ఇళ్లకు వెళ్లి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, సర్పంచ్ చిమ్మిలి కోటేశ్వరమ్మ, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

- ప్రజావేదికలో నివేదించిన సామాజిక తనిఖీ బృందం



ప్రజావేదికలో వివరాలు తెలుసుకుంటున్న డ్వామా పీడీ జోసఫ్

దర్శి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగినట్టు సామాజిక తనిఖీ ప్రజావేదికలో స్పష్టమైంది. మండలంలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం పరిశీలనచేసి అక్రమాలను నిగ్గు తేల్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వామా పీడీ జోసఫ్ ఆధ్వర్యంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలో రూ.19 కోట్ల 21లక్షల 42వేల 670మేర పనులు చేశారు. కూలీలకు రూ.5 లక్షల 35వేల పని దినాలు కల్పించారు. ఈ పనుల నిర్వహణలో అనేక అక్రమాలు జరిగినట్టు సామాజిక తనిఖీ బృందం వెల్లడించింది. ఆరేటిపల్లి వెంకటాచలంపల్లి, పోతవరం, చందలూరు, తదితర గ్రామాల్లో పండ్ల మొక్కల పెంపకంలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించారు. కొన్నిచోట్ల మొక్కలు లేకుండానే బిల్లులు చేసుకున్నారు. రాజంపల్లి, తూర్పువెంకటాపురం, జముకులదిన్నె, సామంతపూడి, తదితర గ్రామాల్లో పంటల కాలువల నిర్మాణంలో అవినీతి జరిగిందని నిర్ధారించారు. కాలువలు తవ్విన కొలతలకు, రికార్డు చేసిన పనులకు వ్యత్యాసం గుర్తించారు. చేసిన పనుల కంటే ఎక్కువ మొత్తంలో బిల్లులు డ్రా చేసినట్టు సామాజిక తనిఖీ బృందం వివరించారు. అలాగే, పనుల వద్ద కొన్నిచోట్ల షామియానాలు, మంచినీటి వసతి ఏర్పాటుచేయలేదని స్పష్టం చేసింది. మరికొన్నిచోట్ల పనులు చేయకుండా కొంత మందికి మస్టర్లు వేశారని తెలిపారు. గ్రామావారీగా జరిగిన పనుల్లో అక్రమాలను నిగ్గుతేల్చి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పీడీ జోసఫ్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీవోలు కల్యాణి, మురళి, ఈసీ ప్రసాద్, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి సీఎం హామీ

- రూ.17 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



కళాశాలకు కేటాయించిన భూమిలో భవనాలు నిర్మించేందుకు పరిశీలన చేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ప్రిన్సిపాల్ కవిత, మున్సిపల్ చైర్మన్ పిచ్చయ్య తదితరులు

దర్శి,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని శివరాజ్ నగర్ వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో భవనాల నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. డిగ్రీ కళాశాలకు కేటాయించిన భూమిని గురువారం అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. అధికారులు అందించిన అంచనాలను పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.17 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి పంపుతున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారని తెలిపారు.

గత వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజ్, జాతీయ స్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధనా కేంద్రం పనులు పునర్నిర్మాణానికి త్వరలో నిధులు విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినట్టు డాక్టర్ లక్ష్మి చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభించేందుకు ఈనెల 2న దర్శి మండలం తూర్పువీరాయపాలెంకు సీఎం చంద్రబాబు వచ్చారన్నారు. ఆసందర్భంగా గ్రామంలోని సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం త్వరలో నిధులు విడుదలవుతాయన్నారు. 93 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధం చేశారన్నారు. తూర్పువీరాయపాలెం- ఉల్లగల్లు రోడ్డు అభివృద్ధికి నిధులు విడుదలవుతన్నాయన్నారు.

బాలికల హాస్టల్ పరిశీలన

దర్శి పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. హాస్టల్‌లో మ్యాట్రిన్, వాచ్‌మన్ అందుబాటులో లేకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ లక్ష్మి అక్కడకు చేరుకున్న కొద్దిసమయానికి వాచ్‌మన్ హడావిడగా వచ్చి వివరణ ఇచ్చే ప్రయత్నం చేయగా అసహనం వ్యక్తం చేశారు. బాలికల హాస్టల్‌లో ఎవరూలేకుండా గేట్లు తీసి బయటకు వెళితే వారికి రక్షణ ఎలా ఉంటుందన్నారు. మ్యాట్రిన్‌తో ఫోన్‌లో మాట్లాడి భవిష్యత్తులో ఇలా జరుగకుండా చూసుకోవాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థిని జ్యోతితో మాట్లాడి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స చేసి మందులు అందజేశారా లేదా అని అడుగగా ట్యాబెట్లు ఇచ్చారని బాలిక తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ కవిత, డీఈ రమణయ్య, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్‌పర్సన్ దారం నాగమణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పుల్లల చెరువు చిన్నా, యాదగిరి వాసు, బొట్ల కోటేశ్వరరావు, సానె సుబ్బయ్య, జూపల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి



ముండ్లమూరు: బాధ్యతలు స్వీకరిస్తున్న వీరనారాయణ

ముండ్లమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని ముండ్లమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు మేదరమెట్ల వీరనారాయణ అన్నారు. గురువారం ఆయనతోపాటు డైరెక్టర్లు బోడపాటి చినవెంకటరావు, ఆకుమళ్ళ కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వీరనారాయణ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో సొసైటీ ద్వారా కొనుగోలు చేయించి ఆదుకుంటామన్నారు. సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించి రైతుల సంక్షేమానికి పాటు పడతామన్నారు. అనంతరం టీడీపీ నాయకులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో మేదరమెట్ల వెంకటరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, ఒద్దిపోగు ఆదిలక్ష్మి గురవయ్య, గుంటుపల్లి రంగనాయకులు, గంగినేని శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సీతారామయ్య



కురిచేడు: సీతారామయ్యను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

కురిచేడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన కమిటీ సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా పిడికిటి సీతారామయ్య, డైరెక్టర్లుగా పసుపులేటి చిరంజీవి, చీమల శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు సహకారం అందిస్తామన్నారు. అనంతరం వారిని టీడీపీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, గడ్డం బాలయ్య, మేడం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నా నోటీసులు

- వైద్యాధికారుల నిర్లక్ష్యంతో అర్హులకు వికలత్వం తగ్గింపు
- ఎంపీడీవో కార్యాలయానికి పరుగులు తీస్తున్న దివ్యాంగులు



ఎంపీడీవో కార్యాలయంలో అర్హత వివరాలు అందజేస్తున్న దివ్యాంగులు

తాళ్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారుల నిర్లక్ష్యంతో అర్హత గలిగిన దివ్యాంగులకు వికలత్వం తగ్గిస్తూ రీవెరిఫికేషన్ నోటీసులు అందజేయడంతో ఆందోళన చెందుతున్నారు. నోటీస్‌లు అందుకున్నవారు తమ వికలత్వం సర్టిఫికెట్లు తీసుకుని ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. దీంతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులు వ్యయప్రయాసకోర్చి గురువారం ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. తమ బంధువుల సహాయంతో వచ్చినవారు తమ సర్టిఫికెట్లు అందజేశారు. మండలంలో 743 మంది దివ్యాంగ పెన్షన్లు పొందుతున్నారు. వీరిలో దాదాపు 150 మందికి రివెరిఫికేషన్ కోసం నోటీసులు అందాయి. అందులో 125 మంది పెన్షన్ పొందేందుకు అనర్హులుగా నోటీసులు అందజేశారు.

నోటీసులు అందుకున్న వారిలో 65 శాతం మందికి అర్హత ఉన్నప్పటికీ వైద్యులు నిర్లక్ష్యంగా సర్టిఫికెట్లు మంజూరుచేశారు. దీంతో వారు పెన్షన్‌కు అనర్హులని తేలడంతో అర్హతగల దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. ఏళ్ల తరపడి తీసుకుంటున్న పెన్షన్లను వైద్యులు పరీక్షలు నిర్వహించకుండా వికలత్వ అర్హత తగ్గించటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పునరుద్ధరించటం జరుగుతుందని సచివాలయాల సిబ్బంది నోటీసులు ఇచ్చారు.

నోటీసులు అందుకున్న దివ్యాంగులు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అర్హులైన దివ్యాంగులకు పెన్షన్లు రద్దు కాకుండా చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



ఇందిరాకాలనీలోని సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

కనిగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఇందిరా కాలనీ, శంఖవరం సచివాలయాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయానికి వచ్చే ప్రజలతో గౌరవంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందజేసే వివిధ ప్రభుత్వ పథకాల వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించారు.

స్పందన, సీఎంవో కాల్‌సెంటర్, ఏఎంఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలో మూమెంట్ రిజిస్టరులో నమోదు చేయాలని ఆదేశించారు. విధుల పట్ల అలక్ష్యంగా ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

వెలిగండ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. గురువారం వెలిగండ్ల పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్‌ఐ కృష్ణపావనిని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి ప్రారంభం మొదలుకొని ఉత్సవాలు ముగిసే వరకు ప్రజలు సంయమనంతో వ్యవహరించాలన్నారు. నిమజ్జన ఊరేగింపు ప్రాంతంలో సీసీ కెమారాలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఐ బీమా నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

అనుమతులు తప్పనిసరి

ముండ్లమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల ఏర్పాటులకు అనుమతులు తప్పనిసరి అని ఎస్‌ఐ కె.కమలాకర్ అన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా గ్రామాల్లో మండపాలు ఏర్పాటుచేసే నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ లైన్‌ల సమీపం, వివాద స్థలాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. కమిటీ నిర్వాహకులు ఏ ప్రాంతంలో వినాయక నిమజ్జనం చేస్తారో ముందుగా తెలియజేయాలన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ పీవీ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

దర్శి యువకుడికి నేషనల్ యూత్ ఎక్సలెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రవీణ్

దర్శి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నేషనల్ యూత్ ఎక్సలెన్సీ అవార్డును దర్శి పట్టణానికి చెందిన వి.సాయి శ్రీహరి ప్రవీణ్ గురువారం అందుకున్నారు. జమ్మూ కాశ్మీర్‌కు చెందిన లైవ్ ఫర్ ఆదర్స్‌బింగ్ హెల్ప్ ఫుల్ ఫౌండేషన్ సంస్థ దేశవ్యాప్తంగా సామాజిక సేవలందించిన వారిని గుర్తించి అవార్డులు అందజేస్తుంది. ఈ అవార్డును ప్రవీణ్‌కు జమ్మూకాశ్మీర్ యూనివర్శిటీలో మాజీ డీఐజీ ఎస్పీ వైద్ అందజేశారు. దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డును అందజేసినందుకు ఆసంస్థ ప్రతినిధులకు సాయి శ్రీహరి ప్రవీణ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. నెహ్రూ యువకేంద్రంలో జాతీయ వలంటీరు, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్, ఎన్ఎస్ఎస్, యూఎన్‌వీ వంటి పలు రాష్ట్ర, జాతీయ స్థాయి కార్యక్రమాలను నిర్వహించిన తనను గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. మరింత బాధ్యతాయుతంగా పనిచేస్తామన్నారు.

నీట్‌లో ప్రతిభచాటిన వంశీకృష్ణారెడ్డి



దర్శి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన ఇరుగుల వెంకట వంశీ కృష్ణారెడ్డి నీట్ పీజీలో జాతీయ స్థాయిలో 2363వ ర్యాంకు సాధించాడు. ఆయువకుడు చిన్నతనం నుంచి విద్యలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ వచ్చాడు. గతంలో నీట్ యూజీలో జాతీయ స్థాయిలో 1859వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 117వ ర్యాంకు సాధించాడు. హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ప్రస్తుతం జనరల్ మెడిసన్ కోర్సు లక్ష్యంతో నీట్ పీజీ రాయగా మంచి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

ముండ్లమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం దర్శి వెళుతూ మార్గమధ్యంలో పెదఉల్లగల్లు వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసినట్టు చెప్పారు. అనంతరం వేంపాడులో రోడ్డు పక్కన ఆగి సోడా బండి నిర్వాహకురాలు వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. బడుగు, బలహీన వర్గాలకు రుణాలు అందజేసి ఆదుకుంటామని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ముండ్లమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ అన్నారు. గురువారం పెద ఉల్లగల్లులో జరిగిన సమావేశానికి సర్పంచ్ జె.నాగేంద్రం అధ్యక్షత వహించారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేస్తున్న వరి, కంది పంటల్లో యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ గురించి వివరించారు. ఆత్మ బీటీఎం రామిరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సిన శిక్షణ కార్యక్రమాలు, ప్రదర్శన క్షేత్రాలు, వివిధ పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి కరపత్రాలను అందజేశారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు, కేవీకే శాస్త్రవేత్త మానస, వీఏఏలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

పామూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలు అందించాలన్నారు. పట్టణంలోని 3,4, గ్రామ సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం 1వ గ్రామ సచివాలయ కార్యాలయంలో ప్రస్తుతం జరుగుతున్న ఈకేవైసీ, వర్క్ ఫ్రం హోం, ఎన్‌పీసీఐ సర్వేలపై సమీక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి

వెలిగండ్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ సూచించారు. గురువారం వెలిగండ్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ కృష్ణపావణి సహకారంతో విలేకరులకు హెల్మెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీఐ బీమానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

కురిచేడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పొగాకు వ్యతిరేక ఉద్యమంలో విద్యార్థులను భాగస్వామ్యులను చేయడంలో ప్రభుత్వం ముందున్నది. నిత్యం ఒక యాప్‌ద్వారా వారిని చైతన్యవంతం చేస్తున్నది. యాప్‌లో పొగాకుతో వచ్చే అనర్థాలను వివరిస్తూ వాటిపై విద్యార్థుల స్పందనను గుర్తిస్తున్నారు. కురిచేడు మండలంలో ముగ్గురు విద్యార్థులు యాప్‌లో ఎక్కువగా స్పందించారు. వారికి ప్రభుత్వం స్కూల్ బ్యాగ్‌లను బహుమతులుగా జేసింది. గురువారం ఎమ్మార్సీలో మండల విద్యా శాఖాధికారులు వస్రాం నాయక్, సీహెచ్ సుబ్బారావులు విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. బ్యాగులు అందుకున్న వారిలో కురిచేడు వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సీహెచ్ వెంకట మణికంఠ, 8వ తరగతి చదువుతున్న ఎన్.సుకన్య, వై.జలరత్నం ఉన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, పొట్లపాడు ఉన్నత పాఠశాల పీడీ ఆసుల వెంకటస్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సుగుణావతమ్మ సెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం గాలికొదిలేసిందని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుజాత, రజని, సీత, సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని సీఐటీయూ నాయకుడు కొమ్మలపాటి మాల్యాద్రి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆర్.వాసుదేవరావుకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రాజ్యలక్ష్మి, పార్వతి, రమీజా, అమల, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాళ్లూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కార్మికుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బోడపాటి హనుమంతరావు డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం తాళ్లూరులో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కాగా, గురువారం సీఐటీయూ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూనూరి రామారావును ఎన్నుకున్నారు.

మోటారుసైకిల్ చోరీ

తాళ్లూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తాళ్లూరులో మోటారుసైకిల్ చోరీకి గురైంది. కొత్తపాలెం గ్రామానికి చెందిన అంబటి రమణారెడ్డి తాళ్లూరులోని బ్రహ్మంగారి గుడి వద్ద ఫర్నిచర్ షాపు నడుపుతున్నాడు. ఇటీవల కొనుగోలు చేసిన మోటారుసైకిల్‌ను బుధవారం మధ్యాహ్నం షాపు ముందుపెట్టి లోపలికి వెళ్లారు. ఆతర్వాత వచ్చి చూడగా మోటారుసైకిల్ కన్పించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీ

తాళ్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు హరణకు చేస్తున్న కుట్రలకు నిరసనగా జాతీయ కాంగ్రెస్‌పార్టీ ఆదేశాలతో గురువారం రాత్రి తాళ్లూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కూకట్ల వీరబ్రహ్మం మాట్లాడుతూ బీజేపీ చేస్తున్న కుయుక్తులపై ధ్వజమెత్తారు.

చెత్త శుద్ధి

పారిశుధ్యంపై 75 శాతం సంతృప్తి

రాష్ట్రంలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానం



గ్రామాల్లో చెత్తసేకరణను పర్యవేక్షిస్తున్న గుంటూరు జిల్లా జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతిబసు

▸ వెనుకబడిన పల్నాడు, బాపట్ల జిల్లాలు ▸ చెత్త సేకరణపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే

రేపల్లె, ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): చెత్త సేకరణ.. పారిశుధ్యంపై ప్రజ లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతానికి భి న్నంగా ఇంటింటా చెత్త సేకరణ జరుగుతోం దని హర్షం వ్యక్తం చేస్తున్నారు.. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపారు. పారిశుధ్యం, చెత్తసేకరణపై ప్రభుత్వం ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు 11 వరకు సర్వే చేసి ప్రజల నుంచి వచ్చిన సంతృప్తి స్థాయి ల ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు ప్రకటిం చింది. ఐవీఆర్ఎస్ సర్వే నివేదిక ఆధారం గానే రాష్ట్రస్థాయి అధికారులు సమీక్షలు ని ర్వహిస్తున్నారు. చెత్త సేకరణపై సర్వేలో గుం టూరు జిల్లాలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు 75 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో గుంటూరు జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథ మ స్థానంలో నిలిచింది. ఈ సర్వేలో పల్నా డు, బాపట్ల జిల్లాలు వెనుకబ డ్డాయి. ఈ రెండు జిల్లాలో చెత్త సేకరణపై 66 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు.

తెల్లవారక ముందే పల్లె బాట..

జిల్లా అధికారుల కృషితోనే చెత్త సేకర ణలో గుంటూరు జిల్లా (మిగతా 6లో)

సేకరణపై సంతృప్తి

1 గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు-2 లో ఉన్న 38 మందికి చెత్త సేకరణపై ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చాయి. చెత్తసేకరణపై వీరిలో 95 శాతం మంది సంతృప్తిగా ఉన్నట్లు సమాధానాలు ఇచ్చారు. వారానికి రెండు సార్లు చెత్త సేకరణ ప్రశ్నకు 89 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

1 కాకుమాను మండలం బోడెపాలెంలో 36 మందికి కాల్స్ రాగా అందరూ సానుకూలంగా స్పందించారు.

1 పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం గోపాలంవారిపాలెంలో 40 మందికి సర్వే కాల్స్ రాగా 95 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

1 యడ్లపాడు మండలం సొలసలో 36 మందికి కాల్స్ రాగా 85 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

1 బాపట్ల జిల్లాలో చీరాల మండలం సాల్మన్ సెంటర్ లోని 27 మందికి కాల్స్ రాగా 88 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు.

దోనేపూడి వద్ద వరద పరిశీలనలో రైతులతో కలెక్టర్

గ్రాయిన్స్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే ఆనందబాబు హామీ



అరవింద వారధి వద్ద వరద ప్రహహాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడుతున్నకలెక్టర్ వెంకటమురళి

వరద విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

కొల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద నేపథ్యంలో ఆందోళనలో ఉన్న రైతులకు, లంక గ్రామాల్లోని ప్రజలను గురువా రం కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఆనందబాబు వేర్వేరుగా పరామర్శించి వరద విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పెసర్లంక అరవింద వారధి వద్ద, దోనేపూడి కరకట్ట దిగువున చినరేవు వద్ద వరద ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించారు. తిప్ప లకట్ట వద్ద వరద ఉధృతికి పొలాలు కోత పడు తున్నాయని ఫొటోలతో కూడిన వినతిపత్రాన్ని టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ కలెక్టర్‌కు అం దించి గ్రాయిన్స్ ఏర్పాటుకు సహకరించాలని కో రారు. వరదల వల్ల పంటలు దెబ్బతిన్నాయని లంక గ్రామాల పర్యటనలో పలువురు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం చిలుమూరు లంక గ్రా మంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 5.13 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల అవుతుందని కొల్లూరు, భట్టి ప్రోలు, రేపల్లె మండలాల్లో 22 లంక గ్రామాలు వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వ రకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగ లేదన్నారు. రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయితే ఖాళీ చేసేందుకు లంక గ్రామాల ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, ఆర్డీవో రామలక్ష్మి, తహసీల్దార్ బి.వెంకటే శ్వర్లు, ఎంపీడీవో కె.నరసింహారావు పాల్గొన్నారు.



వరద ఉధృతికి కోత పడుతున్న పంట భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

రూ.కోట్లు నష్టం : ఎమ్మెల్యే ఆనందబాబు

వరదలు వచ్చిన ప్రతిసారి లంక గ్రామాల రైతులు వందల కోట్లు నష్టపోతున్నారని ఎమ్మె ల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. తిప్పలకట్ట గ్రామం వద్ద నది ఉధృతికి కోతకు గురవుతు న్న భూములను ఆయన పరిశీలించారు. గతంలో గ్రాయిన్స్ నిర్మాణానికి రూ.85 లక్షలతో అం చనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించామన్నారు. వచ్చే వేసవిలో గ్రాయిన్స్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృ ష్ణ, డీసీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షులు కోగంటి హరిప్రసాద్, మేకా దివాకర్, సుంకర రాంబాబు, సుంకర శ్రీను తదితరులు ఉన్నారు.

వారు దివ్యాంగులు కాదు

పింఛన్ లబ్ధిదారుల్లో అనర్హులపై వేటు

1 క్షేత్రస్థాయి సర్వేలో వైకల్యం లేదని గుర్తింపు

1 బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 10,275 మందికి రద్దు

1 గ్రామ, వార్డు సచివాలయాల్లో జాబితాలు.. సెప్టెంబరు నుంచి నిలుపుదల



బాపట్ల జిల్లాలో మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛను పొందేవారు 643 మంది ఉండగా, వారిలో 292 మంది మాత్రమే అర్హులని తేలింది. 24,660 మంది దివ్యాంగ పింఛను దారుల్లో 3,853 మంది అనర్హులుగా ఉన్నట్లు గుర్తించి వారికి పింఛన్లు తొలగించారు. మరో 630 మందిని వృద్ధాప్య పింఛన్ల జాబితాలోకి మార్చారు.

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వైకల్యం లేకపోయినా.. నకిలీ ధ్రువీకరణలతో.. ముడుపులు సమర్పించి.. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల సిఫార్సులతో అధికారులపై ఒత్తిడి చేయించి.. పలువురు దివ్యాంగ పింఛన్లు అందుకున్న వారిపై వేటు పడింది. క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలన చేసిన అధికారులు అనర్హులను గుర్తించారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 10,275 మంది అనర్హులు దివ్యాంగ పింఛన్లు అందుకున్నట్లు గుర్తించిన ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. అర్హులు దరఖాస్తులతో కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా అన ర్హులు ప్రభుత్వం అందజేసే పిం ఛన్‌తో లబ్ధి పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దివ్యాంగ పింఛన్లలో అనర్హులపై ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో ఫిర్యాదులు రాగా గత ప్రభుత్వంలో వాటిని బుట్టదాఖలు చేశా రు. కూటమి ప్రభుత్వం ఆయా ఫిర్యాదులపై ప్రత్యేకం గా దృష్టి సారించి (మిగతా 6లో)

ఎల్‌ఆర్‌ఎస్

నిబంధనలకు తిలోదకాలిచ్చి.. ముడుపులతో ఇబ్బడి ముబ్బడిగా వెలిసిన అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి అల్లాడుతున్న సామాన్యులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) ద్వారా ఆయా ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో ఇక తమ కష్టాలు తీరాయని కొనుగోలు దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆయా ప్లాట్లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు లేక అల్లాడుతూ ఉన్న వారు ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరించేందుకు సిద్ధమవుతున్నారు.



చీరాల మున్సిపాలిటీ పరిధిలో గుర్తించిన అక్రమ లే అవుట్

● అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ ● అక్టోబరు 24 వరకు గడువు పొడిగింపు

● 2025 జూన్ 30కు ముందు కొనుగోలు చేసిన ప్లాట్లకు వర్తింపు

● బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో 700 లేఅవుట్లకు అవకాశం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి తాము మోసపోయామని పలువురు ఫిర్యాదులు చేశారు. అయితే అప్పట్లో ఆ ఫిర్యాదులను అధికారులు బుట్టదాఖలు చేశా రు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్లను కొనుక్కొని లబోదిబోమంటున్న వారి సంఖ్య గుం టూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో వేల ల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అక్రమ లే అవుట్ల అంశంపై దృష్టి సారించింది. గతేడాది చివరిలోనే మున్సిపాలిటీలు, అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో నిబంధనలకు విరుద్ధం గా వేసిన లేఅవుట్ల జాబితాను సేకరించింది. అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించే విష యంలో తీసుకునే నిర్ణయంపై జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన మూడుదఫాలుగా సమావేశా లు జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్లలో అధికశాతం వ్యక్తిగత ప్లాట్లుగా మా రినందు వల్ల తీసుకునే నిర్ణయం వినియోగ దారులకు మేలు చేసేదిగా ఉండాలని నిర్ణయిం చింది. ఈ మేరకు విస్తీర్ణాన్ని బట్టి రాయితీ వర్తిం చేలా గత నెల 26న ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. తొలుత సెప్టెంబరు చివరి వరకే గడువు ఇవ్వగా (మిగతా 6లో)

వెబ్‌సైట్‌లో కేపీఐసీ వివరాలు పొందుపరిచాం

● చీఫ్ సెక్రటరీకి వివరించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై కేపీఐసీ 95 శాతం వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని కలెక్టర్ జె.వెంకట మురళి రాష్ట్ర చీఫ్ సెక్రటరి విజయానంద్ దృష్టి కి తీసుకెళ్లారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై రాజధాని అమరావతి నుంచి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో చీఫ్ సెక్రటరి వీక్షణ సమావే శం నిర్వహించారు. స్వర్ణాంధ్ర, జలశక్తిమిషన్, స్వామిత్వ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ప్రభుత్వసేవలు ప్రజాభిప్రాయంపై సీఎస్ సమీక్షించారు. స్వర్ణాం ధ్ర కార్యక్రమాలపై స్పష్టమైన నివేదికను పంపా మని కలెక్టర్ వివరించారు. క్షేత్ర స్థాయిలోని అం శాలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తు న్నామన్నారు. ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కా కుండా పర్యవేక్షిస్తున్నామన్నారు. స్వామిత్వ సర్వే గ్రామాలలో జరుగుతుందన్నారు. గ్రామకంఠం ఆ ధారంగా సర్వే పక్కాగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ జి. గంగాధర్‌గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భవిష్యనిధితో భద్రత

● గ్రానైట్ కార్మికులతో కమిషనర్



కార్మికులతో మాట్లాడుతున్న పీఎఫ్ కమిషనర్ వీరభద్రస్వామి

బల్లికురవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు భవిష్య నిధి(పీఎఫ్)లో సభ్యులుగా చేరి తే వారికి భద్రతో పాటు ఆర్థిక ప్రయోజనాలు అందుతాయని గుం టూరు పీఎఫ్ కార్యాలయ అదనపు కమిషనర్ వీరభద్ర స్వామి తెలిపారు. గురువారం బల్లికురవలో గ్రానైట్ క్వారీ యజ మానులు, కార్మికులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగిం చారు. కార్మికులు ప్రతీ నెల తమ జీతంలో కొంత మొ త్తాన్ని భవి ష్యనిధిలో జమ చేస్తే భవిష్యత్తులో వారికి ఉపయో గకరంగా మా రుతుందన్నారు. పీఎఫ్‌లో ఉన్న కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు ప్రమాద బీమా అందుబాటులో ఉంటుందన్నారు. అవగాహన లేక పీఎఫ్‌లో భాగస్వామ్యులు కావడం లేదని యజ మానులు పూర్తి బాధ్యత వహించి పీఎఫ్ ఉన్న కార్మికులను మాత్రమే పనుల్లోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో పీఎఫ్ అధి కారులు సెల్వక్తర్, గోపాల్‌సింగ్, పటాన్ ఇలియాస్, వెంకన్నబాబు, గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రత్తిపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న, శనగపై ఆసక్తి

● గణనీయంగా పెరగనున్న సాగు ● మిర్చి, పొగాకుకు ప్రత్యామ్నాయం

అద్దంకి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చి సాగుతో నష్టాలు.. బర్లీ పొగాకు సాగుతో కుదేలైన రైతులు మొక్కజొన్న, శనగ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న, శనగ సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది మిర్చి సాగు చేసిన రైతులకు నష్టాల ఘాటు తగిలింది. బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ సాగు వద్దని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో వీటికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, శనగ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. నీటి వసతి ఉన్న రైతులు ఇప్పటికే మొక్కజొన్న సాగు చేపట్టారు. సాగర్ ఆయకట్టులో నీటి తడులకు ఇబ్బంది ఉండదని మొక్కజొన్న సాగుకు రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గత ఏడాది జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో సాగు కాగా ఇందులో మార్టూరు, అద్దంకి, బల్లి కురవ మండలాల వాటా అధికంగా ఉం ది. ఈ ఏడాది ఇప్పటికే 10 వేల ఎకరా ల్లో మొక్కజొన్న సాగు చేయగా మరో 50 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని అంచనా. మార్టూరు, అద్దంకి, బ ల్లికురవ, పంగులూరు, ఇంకొల్లు మండ లాల్లో మొక్కజొన్న సాగు అధికంగా ఉం డే అవకాశం ఉంది. గత ఏడాది జిల్లాలో శనగ సాగు 10 వేల ఎకరాలకు మించలే దు. గత ఏడాది బర్లీ పొగాకు సాగు చేసిన అత్యధిక శాతం పొలాల్లో ఖరీఫ్‌లో శనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది మొక్కజొన్న ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు లాభపడ్డారు. దీంతో కౌలు రైతులు కూడా ఎక్కువ శాతం మొక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్నారు. బర్లీ పొగాకు ప్రత్యామ్నాయంగా శనగ, మొక్కజొన్నలనే వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. దీంతో వీటి సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.



కొమ్మినేనివారిపాలెంలో సాగు చేసిన మొక్కజొన్న



పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న కర్రోతు బంగారురాజు

పొగాకు రైతులను ఆదుకుంటున్నాం

ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు

పర్చూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వ్యాపారులు కొనుగోలు చేయక, గిట్టుబాటు ధరలేక ఇబ్బందుల్లో ఉన్న బర్లీ పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారురాజు తెలిపారు. పర్చూరులోని కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే బర్లీ పొగాకును కొనుగోలు చేయడం చారిత్రాత్మకమన్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నా డు జిల్లాల పరిధిలో 7754 మంది రైతుల వద్ద మార్క్‌ఫెడ్ రూ.100 కోట్లతో 13,100 మెట్రిక్ టన్నుల పొగాకును కొనుగోలు చేసిందన్నారు. ప్రతి రైతు నుంచి పొగాకును పూర్తిగా కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సిహెచ్.శ్రీనివాసరావు, డీఎం కరుణశ్రీ, జిల్లా మేనేజర్లు నరసింహం, రమేష్, ఏఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, టీడీపీ నాయకులు గ్యాస్ శ్రీను, విన్నకోట సతీష్, రంగయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ దోబూచులాట

● తగ్గినట్టే తగ్గి పెరిగిన వరద ఉధృతి ● అమావాస్య పోటుతో నదిలో పెరుగుతున్న నీటి మట్టం
● లోతట్టు ప్రాంతాల నుంచి మెరక భూముల్లోకి వరద ● ముంపు బారిన వాణిజ్య పంటలు

కొల్లూరు, భట్టిప్రోలు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : లంక గ్రామాల రైతులతో కృష్ణమ్మ దోబూచులాడు తోంది. బుధవారం తగ్గినట్టే తగ్గి మళ్లీ గురువారం ఉద యం కృష్ణా నదిలో వరద ఉధృతి మరింత పెరిగింది. దీనికి తోడు అమావాస్య పోటు కారణంగా సముద్రం లోకి వరద నీరు వెళ్లకపోవడంతో నదిలో నీటి మట్టం అంతకంతకు పెరుగుతోంది. దీంతో లోతట్టు ప్రాంతాల నుంచి మెరక భూముల్లోకి ప్రవహిస్తూ వాణిజ్య పంట లను ముంచెత్తుతోంది. కొల్లూరు, భట్టిప్రోలు మండలా ల్లోని లంక గ్రామాలు వరద భయంతో వణికిపోతు న్నాయి. అరవింద వారధి వద్ద కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అక్కడ ఉన్న గండి నుంచి వరద నీరు పెసర్లంక, ఆవులవారిపాలెం గ్రామాలను చుట్టు ముట్టింది. చింతల్లంక, గాజుల్లంక, పోతార్లంక గ్రామాల వద్ద నది అంచులకు ఏర్పడిన గండ్ల నుంచి వరద నీ రు పోటెత్తి అరటి, కంద, పసుపు, తదితర వాణిజ్య పంటలతో పాటు కూరగాయ పంటలను ముంచెత్తు తోంది. చింతల్లంక వద్ద వరద నీటిలోనే మహిళా రైతు లు పొలాల్లో ఉన్న పంట ఉత్పత్తులను సేకరించి ఇళ్ల కు తెచ్చుకుంటున్నారు. కొల్లూరు మండలంలోని పోతా ర్లంక చప్టా, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వద్ద చప్టాలపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది పహారా కాస్తున్నారు. చింతమోటు, పెసర్లంక, పెదలంక, గ్రామాల పరిధిలో ని లోతట్టు ప్రాంతాల్లోని వాణిజ్య పంటలను వరద నీ రు ముంచెత్తింది. 6 లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు వస్తేనే మెరక పొలాలు వరద ముంపునకు గుర వుతాయి. అమావాస్య పోటుతో సముద్రంలోకి పూర్తి స్థాయిలో వరద నీరు వెళ్లడం లేదు. నదిలో నీట్టి మ ట్టం పెరగడంతో మెరక ప్రాంతంలోని పంటలను వర ద నీరు ముంచెత్తుతోంది. ఎగువ నుంచి వరద నీరు కొంత మేరకు తగ్గడంతో రాత్రి 8 గంటలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 4,87,508 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



కొల్లూరు : చింతల్లంక వద్ద పొలాల్లో నుంచి వరద నీటిలో వస్తున్న మహిళా రైతులు

అవీ..ఇవీ..

మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో ప్రతినిధులు

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీను గురువారం ఎన్నుకున్నారు. గత రెండు రోజులుగా చీరాల్లో నిర్వహిస్తున్న ప్రథమ మహాసభలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫెడరేషన్ అభివృద్ధితో పాటు, కార్మికుల సమస్యల పరిష్కారంలో నూతన కమిటీ కృషి చేయాలని అన్నారు. వారిని ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దఎత్తున నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

లోపాలు లేకుండా పాసుపుస్తకాలు అందజేస్తాం



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులకు ఎటువంటి లోపాలు లేకుండా నూతన పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తామని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రీ సర్వే సమస్యలపై గురువారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రీసర్వేలో రైతులకు ఎమైనా సమస్యలు వస్తే తెలియ జేయాలని తహసీల్దార్ సూచించారు. గ్రామసభలో పట్టాదారు పాసు పుస్తకం కొరకు ఒకరు, భూమి విస్తర్ణలో సవరణ చేయాలని ఒకరు అర్జీలు అందజేసినట్లు తెలిపారు. గ్రామ సభకు వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుజాత, గ్రామ రెవెన్యూ అధికారి పి.నాగరాజురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేకశ్రద్ధతో విద్యాభ్యాసం చేయాలి

- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ తయారు చేసిన ఉపాధ్యాయులు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ప్రత్యేక శ్రద్ధతోనే విద్యాభ్యాసం సాగించాలని వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు ఉమ్మిటి వేణుగోపాలరావు అన్నారు. పాఠశాలలో 6 నుండి 9 తరగతికి చెందిన సుమారు 300 మంది విద్యార్థులకు స్వయంగా స్టడీ మెటీరియల్ తయారు చేసి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరోజని, జయంతి, సుబ్బారావు, నీలిమ, పోతురాజు, బ్రహ్మానందరెడ్డి, గురు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

బల్లికురవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో నాలుగు రోజుల నుంచి జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు గురువారం పల్లకి ఊరేగింపుతో ముగిశాయి. నర్సారావుపేటకు చెందిన ప్రభోదసేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ముక్తేశ్వరం గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి గ్రామంలో ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలో కృష్ణుని విగ్రహంతో పెద్దఎత్తున పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఊరేగింపు ముందు భాగంలో కోలాట ప్రదర్శన ఆకట్టుకొంది.

బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలి

- జిల్లా అధ్యక్షులు బంగారుబాబు .



కార్యకర్తలతో సమావేశమైన బంగారుబాబు

పర్చూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు బంగారుబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరికి చేర్చేవిధంగా పార్టీ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అనంతరం పలు కుటుంబాలు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాసరావు, బీజేపీ సీనియర్ నాయకులు అడపాల కృష్ణ, నటరాజ్ శ్రీను, లక్ష్మీరాజ్యం అడపాల, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో

సంతనూతలపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు పంచాయతీ బొమ్మినేనివారిపాలెం ఎం పీయూపీ స్కూల్లో గురువారం విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. బొమ్మినేని వెంకయ్య చారి టబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త, జిల్లా టీడీపీ నాయకుడు బొమ్మినేని రామాంజనేయులు అం దించిన నోటుపుస్తకాలు, స్టేషనరీలను ఎంఈవో వెంకారెడ్డి విద్యార్థులకు పంపి ణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శేషిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగర్ కాలువకు నీళ్లు వచ్చేశాయ్..


కొనంకి సబ్ డివిజన్ పరిధిలోనికి సాగర్ జలాలు

మార్టూరు, ఆగస్టు 21:(ఆంధ్రజ్యోతి) : కోనంకి సబ్ డివిజన్ పరిధిలో సాగర్ కాలువలో బుధవారం రాత్రి నుంచి సాగర్ జలాలు వస్తున్నాయి. ఈ సబ్‌డివిజన్ పరిధిలోని మార్టూరు మండల పరిధిలోని సాగర్ కాలువపై ఉన్న అన్ని మేజర్లుకు, మైనర్లుకు సాగర్ జలాలు ప్రవహిస్తున్నాయి. ఇటీవల కాలువల మరమ్మతుల నిమిత్తం కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో, కాలువ పక్కన, అంచున ఉన్న చిల్లచెట్లు తొలగించారు. అక్కడక్కడ కాలువలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో ఎగువ నుండి వస్తున్న జలాలు దిగువకు వేగంగా వెళతున్నాయి. అయితే తక్కువ పరిమాణంలో నీళ్లు వస్తున్నాయి. కానీ, ప్రస్తుతం సాగర్ కాలువ నీటిని రైతులు వినియోగించుకునే అవకాశం చాలా తక్కువగా ఉంది. సాగర్ కాలువ పక్కనే ఉన్న గ్రామాలు వలపర్ల, కోనంకి, బొల్లాపల్లి, చిమ్మిరిబండ, జొన్నతాళి తదితర గ్రామాలలో వరినారు, వరినాట్లు వేసుకోవడానికి వరి పంట సాగు చేసే రైతులకు ఈ సాగర్ జలాలు ఉపయోగపడతాయి. కాని నీటి సమస్య కారణంగా, గిట్టుబాటు కాకపోవడంతో గాని, కొన్నేళ్లుగా వరిపంట సాగు మండలంలో చాలా వరకు, దాదాపుగా 90 శాతం తగ్గిపోయింది. వలపర్ల రెవెన్యూ పరిధిలో గత రెండు రోజుల క్రితం,బోర్లు క్రింద సాగుచేస్తున్న పొలంలో 2 ఎకరాలలో వరినాట్లు వేశారు. గురువారం వ చ్చిన సాగర్ జలాలను పరిశీలిస్తే బొల్లాపల్లి జీఎస్టీ వద్ద 105 క్యూసెక్కులు, పమిడిపాడు మేజరుకు40, యద్దనపూడి బ్రాంచ్ కెనాల్‌కు 150, కోటపాడు మేజరుకు 25, యద్దనపూడి మేజరుకు 10, ద్రోణాదుల మేజరుకు 25, నూతలపాడు మైనరుకు 44, రాజుపాలెం మేజరుకు 20 క్యూసెక్కులు నీళ్లు వెళుతున్నాయి. ఈ జలాలు మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.





కోటపాడు మేజరు, యద్దనపూడి మేజరు వద్ద వస్తున్న సాగర్ జలాలు, వలపర్ల పొలాల్లో వేసిన వరినాట్లు



బొల్లాపల్లి జీఎస్టీ రోడ్డు వద్ద కాలువలో వస్తున్న సాగర్ జలాలు

వారు దివ్యాంగులు కాదు

(5వ పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించింది. ఒక ఆర్థోపెడిక్, ఒక జనరల్ ఫిజిషియన్, సంబంధిత ఏరియా వైద్య అధికారి సభ్యులుగా, వీరికి సహాయకుడిగా ఒక డిజిటల్ అసిస్టెంటుతో కూడిన ప్రత్యేక బృందాలు దివ్యాంగ పింఛన్ పొందుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అనర్హులను గుర్తించాయి. కిందటేడాది డిసెంబరులో మొదలైన పరిశీలన ప్రక్రియ ఎనిమిది నెలలపాటు కొనసాగి, ఎట్టకేలకు అనర్హుల జాబితాను ప్రకటించింది. ఆ జాబితాలో వేలమంది అనర్హులు ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 40 శాతం కంటే వైకల్యం తక్కువ ఉన్నవారికి దివ్యాంగుల పింఛన్‌కు అనర్హులుగా అధికారులు నిర్ధారించారు. తీవ్ర అనారోగ్యంపాలై మంచానికే పరిమితమైనవారికి ఇచ్చే రూ.15000 పింఛను పొందేవారిలో 75 శాతం మంది అనర్హులే ఉన్నట్లు తేలింది. రూ.6000 పింఛన్ అందుకుంటున్న వారిలో 30 శాతం అనర్హులను సర్వేలో అధికారులు గుర్తించారు. పల్నాడు జిల్లాలో 3,086 మంది, గుంటూరు జిల్లాలో 2,489 మంది, బాపట్ల జిల్లాలో 3,853 మంది అనర్హులుగా గుర్తించి వారికి సెప్టెంబరు నుంచి పింఛన్‌ను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఎలాంటి అర్హత లేనివారికి పింఛన్లు పూర్తిగా నిలిపివేయగా, సాధారణ వైకల్యం కింద దివ్యాంగులుగా ఉన్న వారికి సెప్టెంబరు నుంచి రూ.6 వేల పింఛను అందించనున్నారు. మరికొందర్ని వృద్ధాప్య పింఛన్ల జాబితాలో చేర్చి వారికి రూ.4 వేలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇక ఆయా జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాలకు అధికారులు పంపారు.

అరాచకాలు బయటపడిందిలా..

వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా పింఛన్ల మంజూరు చేశారు. అర్హులను తొలగించి, తమ అనుయాయులకు పింఛన్లు అందజేశారు. ప్రధానంగా దివ్యాంగ పింఛన్ల విషయంలో ఈ అక్రమాలు అంతులేకుండా జరిగాయి. అదే అంశాన్ని తాజా జాబితా స్పష్టం చేస్తోంది. ఇష్టమొచ్చినట్లుగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం, వైకల్య స్థాయిని పెంచి పింఛన్లు కాజేయడం వంటి విధానాలతో అర్హులకు అందాల్సిన పింఛన్లను వైసీపీ అనుయాయులు కొల్లగొట్టారు. పింఛన్లు పంపిణీ చేసే క్రమంలో కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులకు ఈ అనర్హులు ఎదురుపడడంతో వారు విస్తుపోయారు. దీనిపై విచారించాలని ప్రభుత్వాన్ని కోరారు. తొలి నెలలోనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా, ఇదిగో అదిగో అంటూ డిసెంబరులో పరిశీలన ప్రక్రియ ప్రారంభించారు. దీంతో పింఛన్లలోని అక్రమాలన్నీ క్షేత్రస్థాయిలో సర్వేతో వెలుగులోకి వచ్చాయి.

వినాయకుని మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

- డీఎస్పీ ఎండీ మొయిన్



విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ మొయిన్

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే మండపాల వద్ద జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ ఎండీ మొయిన్ పేర్కొన్నారు. గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల అనుమతులను సులభతరం చేసినట్లు వివరించారు. అనుమతులు లేకుండా పందిళ్ల నిర్వహణ చేయరాదన్నారు. డీజేలతో ఆయా ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నిబంధనలు అనుసరిస్తు, అపరిచితుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. డీఎస్పీ వెంట సీఐలు శేషగిరిరావు, సుబ్బారావు, నాగభూషణం, ఎస్సైలు రాజ్యలక్ష్మీ. వాణి, ట్రాఫిక్ ఎస్సై పవన్ ఉన్నారు.

మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఇంకొల్లు : ఇంకొల్లు సర్కిల్ కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండల పరిధిలోని గ్రామాలలో వినాయకచవితి సందర్భంగా గణపతి విగ్రహాల పందిళ్లు, మండపాల ఏర్పాటుకు పోలీసువారి అనుమతి తప్పనిసరిగా పొందాలని సీఐ వై.వీ.రమణయ్య తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విగ్రహాలు ఏర్పాటు చేయనున్న స్థలం వివరాలు, ఉత్సవం నిర్వహించే రోజులు, ఉత్సవ నిర్వాహకుల గుర్తింపుకార్డు నకలు స్టేషన్‌లో అందజేయాలన్నారు. విగ్రహాల ఏర్పాటు సందర్భంగా రెచ్చగొట్టే ఘటనలు తగవన్నారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని ఎస్సై సురేష్ సూచించారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు.

సింగిల్ విండో విధానంలో అనుమతులు

అద్దంకి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతులకు సింగిల్ విండో విధానం అమలు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. గణేష్ విగ్రహాలు ఏర్పాటు, నిమజ్జనం ఊరేగింపు తదితర అంశాలపై ఆయన స్టేషన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. గణేష్ వి గ్రహాలు ఏర్పాటు చేసే ప్రదేశం, వి గ్రహం ఎత్తు, నిమజ్జనం జరిగే తేది తదితర వివరాలతో రా ష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్‌సైట్ లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ లో అందిన దరఖాస్తు ను పరిశీలించి అనుమతులు మంజూరుచేస్తామన్నారు.

పంగులూరు :ఈనెల 27న వినాయకచవితి పర్వదినం సందర్భంగా గ్రామాలలో ప్రత్యేక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్.ఐ. వినోద్‌బాబు తెలిపారు.

ఆకట్టుకుంటున్న 'విజ్ఞాన ప్రపంచం'

- విజయవాడ బుక్ ఫెస్టివల్‌కు విశేష స్పందన
- పుస్తక ప్రియులతో పీవీఆర్‌లో సందడి





బుక్ ఫెస్టివల్‌లో సందడి చేస్తున్న విద్యార్థులు

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో గత వారం రోజులుగా కొనసాగుతున్న ఫెస్టివల్‌ను వీక్షించేందుకు పుస్తకప్రియులు పోటెత్తుతున్నారు. కాగా ప్రదర్శనలో సుమారు 50వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉంచారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు, రచయితలు, సాహితీ వేత్తలు వీక్షించడంతో ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఇప్పటి వరకు సుమారు 40 వేల మంది సందర్శకులు పుస్తక ప్రదర్శనను వీక్షించినట్లు నిర్వాహకులు మనోహర్‌రెడ్డి తెలిపారు. విలువైన విజ్ఞానంతో కూడిన పుస్తకాలు, అలాగే ప్రముఖుల ర చనలు, సైన్స్ పుస్తకాలు, మహిళల కోసం,. ఇలా ఒకటేమి వివిధ రకాల పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. కాగా ప్రతిరోజు నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వ హించడంతోపాటు, సైన్సు గొప్పతనాన్ని వివరించేలా ఏర్పాటు చేసి న ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 25వ తేదీన ఆదివారంతో పుస్తక ప్రదర్శన ముగియనుంది. దేశంలో ప్రాముఖ్యత కలిగిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నగరంలో ఏర్పాటు చేయ డంపై పుస్తకప్రియులు ఆనందరం వ్యక్తం చేస్తున్నారు. - ఒంగోలు కార్పొరేషన్(ఆంధ్రజ్యోతి)

చెత్తశుద్ధి

(5వ పేజీ తరువాయి)

ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పవచ్చు. పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలతో జడ్పీ సీఈఓ జ్యోతి బసు, డీపీవో నాగ సాయికుమార్ నిత్యం ఓ గ్రామానికి వెళ్లి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. కొద్ది నెలలుగా అధికారులు ఉదయమే పల్లె బాట పట్టారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులను కూడా ప్రతి రోజూ ఉదయం 7 గంటల కల్లా ఏదో ఒక గ్రామానికి పంపారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షణ పరిశీలనకు జిల్లా పరిషత్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల కార్యదర్శులు ఉదయమే విధుల్లో ఉండేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. ఈ చర్యలతో గ్రామాల్లో చెత్త తొలగింపు ప్రక్రియ చురుగ్గా సాగిందని అందువల్లే సర్వేలో ప్రజలు సంతృప్తి వ్యక్తమైంది.

సమష్టి కృషితోనే ప్రథమం

అందరి సమష్టి కృషితోనే చెత్త సేకరణలో రాష్ట్రంలోనే గుంటూరు ప్రథమ స్థానంలో నిలిచింది. సీఎం, డిప్యూటీ సీఎం ఆదేశాలకు అనుగుణంగా గ్రామాలను స్వచ్ఛ మార్గంలో నడిపేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేశారు. స్వచ్ఛ గ్రామం సాకారంతోనే ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుంది. 85 శాతం సంతృప్తి దిశగా జిల్లాను తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం.

-వీర్ల జ్యోతిబసు, సీఈఓ,
గుంటూరు జిల్లా పరిషత్

క్షౌరశాలలకు ఉచిత విద్యుత్

200 యూనిట్లు ఫ్రీ
ఉత్తర్వులు విడుదల
నాయీబ్రాహ్మణులు అందరికీ వర్తింపజేయాలని డిమాండ్

ఒంగోలు క్రైం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : క్షౌరశాలలు నిర్వహించే నాయీబ్రాహ్మణులకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 150 యూనిట్లు ఉచితంగా ఇచ్చింది. ప్రస్తుతం తిరిగి 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా సరఫరా చేసేందుకు తిరిగి ప్రజాప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వం నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్తు పథకాన్ని సరిగా అమలుచేయకపోవడంతో లబ్ధిదారులు ఎక్కువగా వినియోగించుకోలేకపోయారు.

విధివిధానాలు

- క్షౌరశాల నిర్వాహకుడు నాయీబ్రాహ్మణుడు అయిఉండాలి
- నెలకు 200 యూనిట్లకు పైగా విద్యుత్తు వినియోగించకూడదు
- అర్బన్ ప్రాంతాలలో నెలకు రూ.70 వేలు, రూరల్ ప్రాంతంలో రూ.60 వేలు ఆదాయం పొందే వారు అర్హులు
- రెవెన్యూ అధికారి ద్వారా పొందిన కులధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుకు జతపరచాలి.

బడ్జెట్ కేటాయింపు

నాయీబ్రాహ్మణులు నిర్వహించే క్షౌరశాలలకు 200 యూనిట్లు ఉచితం కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.450 ప్రకటించి ఈ నెల నుంచి అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో లబ్ధిదారులు ఒంగోలు డివిజన్‌లో 124, కందుకూరు డివిజన్‌లో 93, కనిగిరి డివిజన్‌లో 15, దర్శి డివిజన్‌లో 28, మార్కాపురం డివిజన్‌లో 122 మంది ఉన్నారు. ఉచిత విద్యుత్తు పథకాన్ని విస్తృతంగా ప్రచారం చేసి లబ్ధిదారుల ముంగిటకు చేర్చాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు రెండువేల రూపాయలు ఉచితంగా లబ్ధిచేకూరుతుంది. ప్రస్తుతం ఉన్న లెక్కల ప్రకారం.. 382 మందికి ఏడాదికి కోటి రూపాయల లబ్ధి చేకూరుతోంది. లబ్ధిదారులు ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



అర్హులైన ప్రతిఒక్కరికి అందే విధంగా చర్యలు

కట్టా వెంకటేశ్వర్లు, ఎస్ఈ



నాయీబ్రహాణులకు ప్రతి ఒక్కరికీ అందేవిధంగా చర్యలు చేపట్టాం. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి జీవితాలలో వెలుగుల నింపేందుకు 200 యూనిట్లు ఉచిత పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకంపై అవగాహన పెంచేందుకు విద్యుత్తు శాఖ తరపున చర్యలు తీసుకుంటున్నాం. క్షౌరశాలలు నడిపే నాయీబ్రాహణులు ధ్రువీకరణ పత్రాలు తీసుకొని మండల విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికార్లను సంప్రదించాలి.

ప్రతి ఒక్కరికీ 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి

కొణిజేటి రామకృష్ణ, అధ్యక్షుడు, ఒంగోలు నగర క్షౌరశాలల సంఘం



క్షౌరశాలలు నిర్వహించుకునే నాయీబ్రాహణలు అందరికీ 200 యూనిట్లు ఉచితం పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలి. కాల్చిన యూనిట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవడం వల్ల కొందరే అర్హులుగా మిగులుతారు. ఈ మేరకు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతి పత్రం అందజేశాం. క్షౌరశాలలో వచ్చిన బిల్లులో 200 యూనిట్లు మినహాయించి మిగిలిన విద్యుత్తుకు బిల్లు వేయాలని కోరాం.

ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో ఉన్న వారికి చేర్చాలి

పెళ్లూరు చినవెంకటేశ్వర్లు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్



గతంలో తెలుగుదేశం నాయీబ్రాహ్మణుల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం వైసీపీ హయాంలో లబ్ధిదారులకు సక్రమంగా చేరలేదు. తిరిగి ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత 200 యూనిట్లు ఉచితం ఇస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సంతోషం. అధికారులు ఈ పథకంపై గ్రామాల్లో ఉన్న నాయీబ్రాహ్మణులకు అవగాహన కల్పించాలి.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని పాత రిమ్స్‌లోని డీపీహెచ్‌ల్యా బ్ ఆఫీస్ కార్యాలయంలో రండీ టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలపై చర్చించుకు న్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాం దురంగారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, ఏసురత్నం, మహిళావిభా గం అధ్యక్షురాలు రజితమానస, ఆశాఖ ఉద్యోగులు వెంకటేశ్వరరావు, శ్రీనివాస రావు, వెంకటేశ్వరరెడ్డి, గోవిందరావు, పవన్, మోహన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్

(5వ పేజీ తరువాయి)

దానిని అక్టోబరు 24 వరకు పొడిగించింది. నిబంధనలకు విరుద్ధం గా వేసిన లే అవుట్‌లో ఇంటి నిర్మాణం చేపట్టా లంటే ప్లాన్ తీసుకునే సమయంలో అక్కడి విలువలో 14 శాతం ఫీజు అదనంగా చెల్లించాలి. అభివృద్ధి, ఇతరత్రా రుసుంలు అదనం. ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటుతో రూ.లక్ష ఖర్చు అయ్యే వినియోగదారుడికి ఇప్పుడు రూ.50,000లకే అనుమతి లభించనున్నది. మున్సిపాలిటీలతో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలోని లే అవుట్లన్నింటికి ఈ ఎల్ఆర్ఎస్ వర్తించేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. 2025 జూన్ 30కు ముందు కొనుగోలు చేసిన ప్లాట్లన్నింటికీ ఈ ఎల్ఆర్ఎస్ స్కీం వర్తించనుంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు 700 అనధికార లే అవుట్లకు ప్రభుత్వం క్రమబద్ధీకరణ వెసులుబాటు కల్పించింది. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(బావుడా) కింద 93 అనధికార లేఅవుట్లను గుర్తించిన యంత్రాంగం వాటికి వెసులుబాటు కల్పించింది. ఇదే సమయంలో భవిష్యత్తులో నిబంధనలకు విరుద్ధంగా ఏ ఒక్క లేఅవుట్ కూడా వేయకూడదని, అలా జరిగితే సంబంధిత విభాగాల అధికారులను బాధ్యులను చేసేందుకు వెనకాడబోమని ప్రభుత్వం హెచ్చరించింది.

అవీ..ఇవీ..

అన్న క్యాంటిన్ ఏర్పాటుకు స్థల పరిశీలన



అన్న క్యాంటిన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ మోహన్

మార్టూరు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి):మార్టూరులో నాగరాజుపల్లి కూడలి వద్ద నిర్మించనున్న అన్నా క్యాంటీన్ భవనం ఏర్పాటుకు స్థలాన్ని గురువారం పబ్లిక్ హెల్త్ సర్వీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, స్థానిక కూటమి ప్రభుత్వం నాయకులతో కలిసి పరిశీలించారు. మార్టూరులో అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రూ. 61 లక్షల మంజూరుచేయించారు. నాల్గవ గ్రామ సచివాలయం నిర్వహిస్తున్న భవనానికి, పంచాయతీ రాజ్ భవనానికి మధ్య ఖాళీ స్థలంలో అన్న క్యాంటీన్ ను ఏర్పాటుచేయడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ సర్వీస్ నెల్లూరు సర్కిల్ ఎస్ఈ టీ.మోహన్, పబ్లిక్ హెల్త్ సర్వీస్ డివిజనల్ అధికారి టీఎస్ సంజయ్, జడ్పీ సీఈవో చిరంజీవిలతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. భవిష్యత్తులో జాతీయరహదారి విస్తరణలో భాగంగా నిర్మిస్తున్న అన్న క్యాంటిన్ భవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థలం కొలతలను స్థానిక సర్వేయర్లు, అధికారులతో ఎస్ఈ మోహన్ చర్చించారు. అయితే అక్కడ పంచాయతీరాజ్‌కు చెందిన శిథిలమైన గది అన్నక్యాంటీన్ భవన నిర్మాణానికి అడ్డంకిగా ఉండటంతో, దానిని తొలగించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, మిన్నెకంటి రవికుమార్, తొండెపు ఆదినారాయణ, గొట్టిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ గురువారం తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో వెలగపూడిలోని సచివాలయంలో మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి, ఆ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీలకు వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు, పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు పెంచాలని, హెల్త్ కార్డులు, పెండింగ్‌బిల్లులు చెల్లింపు వంటి పలు సమస్యలను పరిష్కారించాలని వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లో వంటకోసం కరెంటు పొయ్యిలు, కరెంటు బిల్లు రూ.200 నుండి రూ.500 ఇస్తామని మంత్రి తెలియజేశారన్నారు. కేంద్రాలలో రిజిస్టర్‌లు రావాల్సిన అవసరం లేదని యాప్‌లలో అన్ని నమోదు చేయాలన్నారు. ఈ నెల చివరి నాటికి 5జీ ఫోన్లు ఇస్తామని, ప్రభుత్వం ప్రకటించిన గ్రాట్యూటీ మార్పులు చేసి రెండు, మూడు రోజులలో జీవో రిలీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మీనరసమ్మ, ట్రెజరర్ కోడాలి హేమలత తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి స్థానికులు సహకరించాలి



పాఠశాలకు కంప్యూటర్ బహూకరిస్తున్న దాతలు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు ఆయా ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చొరవ చూపినట్లయితే చిన్నారుల భవితవ్యం బంగారు మార్గంలో సాగుతుందని పలువురు వక్తలు అన్నారు. గురువారం వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బట్టా రాంబాబు రూ. 40 వేలు విలువగల కంప్యూటర్, ప్రింటర్, స్కానర్‌లను బహూకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలోని అవకాశాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని సూచించారు. ప్రధానోపాధ్యాయులు శేఖరరావు దాతను అభినందించారు. కార్యక్రమంలో శంకరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎంవీబీఆర్‌వై పథకంపై అవగాహన

మార్టూరు, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి):ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ వారు కొత్తగా ప్రారంభించిన ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనపై గురువారం మార్టూరు సమీపంలోని అమరావతి నూలుమిల్లులో ఉద్యోగులకు, యజమానులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ -2 తానయ్య సెల్వక్తర్, ఒంగోలు అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి గోపాల్‌సింగ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తానయ్య సెల్వక్తర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కొత్త ఉద్యోగులను నియమించుకోవడానికి ఆర్థిక ప్రయోజనాలను అందించడం ద్వారా కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడానికి యజమానులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కార్యక్రమంలో పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పఠాన్ ఇలాయాస్ పాల్గొన్నారు.

పింఛన్‌దారుల్లో అయోమయం

- అనర్హత పింఛన్లపై వేటుకు ప్రభుత్వం చర్యలు
- వెయ్యి మందికి నోటీసులు, అప్పీలుకు మరో అవకాశం



చీరాల వైద్యశాల వద్ద ఉన్న నోటీసు అందుకున్న విభిన్న ప్రతిభావంతులు

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అనర్హత ఉన్న పింఛన్ల వేటుకు కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్ చేపట్టింది. ఈక్రమంలో సచివాలయ సిబ్బంది నియోజకవర్గంలో సుమారు 1000 మందికి ఇప్పటికే నోటీసులు అందించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బడిముబ్బడిగా అనర్హులకు సదరం సర్టిఫికెట్లు అందించి, వివిధ రకాల పింఛన్లను అందజేసింది. ఈ నేపథ్యంలో రూ.కోట్లల్లో ప్రభుత్వ ఖజానాకు గండి పడింది. అయితే కూటమి ప్రభుత్వం అందుకు స్పష్టమైన ప్రణాళికతో అర్హులే ప్రామాణికంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది జనవరి నుంచి విభిన్న ప్రతిభావంతుల రీవెరిఫికేషన్ ప్రారంభించింది. ఈక్రమంలో అన్ని కేటగిరీల్లో ఇప్పటి వరకు వైద్యుల ఆమోదం పొందిన విభిన్న ప్రతిభావంతుల వైకల్యానికి సంబంధించి ఎంత శాతం ఉందనేది పింఛన్ వెబ్‌సైట్‌ను అనుసంధానం చేసింది.

గణనీయంగా పింఛన్ల అర్హుల ప్రక్రియ

ఇప్పటి వరకు వివిధ రకాల పింఛన్లు అందుకుంటున్న పింఛన్‌దారులకు వారి ధ్రువపత్రాల ఆధారంగా గణనీయంగా పింఛన్లకు అధికారులు వెసలుబాటు కల్పిస్తూ, జాబితాలు సిద్ధం చేసి ఆయా ప్రాంతాల సచివాలయాలకు పంపించారు. వీరిలో ఇప్పటి వరకు మంచానికే పరిమితమై వెరిఫికేషన్‌లో 85 శాతం పైబడి ఉంటే వారికి రూ.15 వేలు యథావిధిగా సెప్టెంబరు నుంచి అందించనున్నారు. అలాగే వెరిఫికేషన్‌లో 85 శాతం కంటే తక్కువగా ఉండి, 40 శాతంకంటే ఎక్కువగా ఉండిన వారిని హెల్త్ పెన్షన్ నుంచి విభిన్న ప్రతిభావంతుల పెన్షన్‌గా మార్చి రూ.6 వేల అందించనున్నారు. అలాగే వైకల్య శాతం 40కు తక్కువగా ఉండి 60 సంవత్సరాలు లేనివారి పింఛన్లు తొలగించేలా ప్రణాళిక చేశారు.

అనర్హులకు ఇప్పటికే నోటీసులు

నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 1000 మందికి అనర్హుల పింఛన్లను గుర్తించిన అధికారులు నోటీసులు అందించారు. అయితే అవగాహన లేమితో చాలా వరకు ఏమి చేయాలో తోచక అయోమయంలో ఉన్నారు, కానీ నోటీసులు అందుకున్న వారిలో ఎవరైనా అర్హులైన పింఛన్‌దారులు ఉన్నట్లయితే వారికి తిరిగి పింఛన్ పొందె వెసులుబాటు కల్పిస్తూ మరో అవకాశం ఇచ్చారు. వీరు నోటీసు అందుకున్న 30 రోజుల్లో పట్టణాలలో అయితే కమిషనర్, గ్రామీణ ప్రాంతాలలో అయితే ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందించాల్సి ఉంటుంది. తద్వారా మళ్లీ అధికారులు కల్పించిన తేదీల్లో హాజరై వారి ద్వారా పొందిన వాస్తవమైన సదరం ధ్రువపత్రంతో పింఛన్ పొందాల్సి ఉంటుంది. తద్వారా అర్హులు పింఛన్లకు దూరం కాకుండా ప్రభుత్వం చూస్తోంది.

పర్చూరు వాగుకు మోక్షం

శరవేగంగా కట్టలు బలోపేతం



వాగులోని ముళ్ల చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



కట్టలను పటిష్ఠం చేస్తున్న ఎక్స్‌కవేటర్

పర్చూరు, అగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు- కారంచేడు (ఉప్పుటూరు వరద) వాగు ఆధునికీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వర్షాకాలంలో వరదలకు పంటపొలాలు నీట మునిగిపోకుండా ఈ వాగు లక్షలాధి ఎకరాలకు అడ్డుకట్ట వేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వాగు అభివృద్ధికి నోచుకోక పోవడంతో చిల్లచెట్లు, ముళ్లపొదలతో నిండిపోయి, కరకట్టలు బలహీనంగా మారాయి. వాగు పరిస్థితిపె స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు యుద్ధ ప్రాతిపతికన వాగు అభివృద్ధిపై చర్యలకు స్వీకారం చుట్టారు. అందులో భాగంగా వాగులో పెరిగిపోయిన చిల్లచెట్లు, ముళ్లపొదలను తొలగించటంతో పాటు, వాగు ను త్వవ్వి కట్టలను బలోపేతం చేసేవిధంగా చర్యలు చేపడతున్నారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పర్చూరు - కారంచేడు మధ్య 4 కిలో మీటర్ల మేర లక్షల వ్యయంతో పూడికతీత పనులు జరుగుతున్నాయి. కట్టలను పటిష్ఠంచేసి అధునీకరించేలా ఎమ్మెల్యే ఏలూరి చూపుతున్న చొరవ పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అట్టహాసంగా లక్ష్మయ్య బాధ్యతల స్వీకరణ

- పలు గ్రామాల టీడీపీ నేతల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహణ



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మయ్యను ఆశీర్వదిస్తున్న టీడీపీ నేతలు

బల్లికురవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ గ్రామ సహకార సంఘ అధ్యక్షునిగా గొట్టిపాటి లక్ష్మయ్య గురువారం అట్టహాసంగా బాధ్యతలు చేపట్టారు. ముందుగా తన ఇంటి నుండి పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు, మరియు తన శ్రేయోబిలాషుల మధ్య బారీ ర్యాలీ చేపట్టి సొసైటీ కార్యాలయానికి చేరుకొని ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ ఉమాదేవి అయన చేత సంతకం చేయించి బాధ్యతలను అప్పగించారు. అనంతరం సభ్యులుగా అడవి అంజయ్య, చంటి వెంకటరెడ్డిలచే సంతకాలు చేయించారు. ఈసందర్భంగా జరిగిన సభలో సంతమాగులూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తేలప్రోలు రమేష్ మాట్లాడుతు రైతులకు సకాలంలో పంట రుణాలను అందించి వారి సమస్యలపై బాధ్యతగా పనిచేసే సత్తా లక్ష్మయ్యకు ఉందని తెలిపారు. ఈసందర్భంగా నూతన చైర్మన్ లక్ష్మయ్యను పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ చిట్టిపోతు మస్తానయ్య, ఎఎంసీ వైస్ చైర్మన్ దేవినేని నరేంద్ర, ఎఎంసీ మాజీ చైర్మన్ నాగినేని రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు కొండేటి ఇజ్రాయల్, టీడీపీ నేతలు గొట్టిపాటి చౌదరిబాబు, చింతల శ్రీనివాసరావు, దూళిపాళ్ల రామగోవిందు, పోగుల శేఖర్, దేవినేని శివయ్య, అమరనేని కాశీ విశ్వనాదం,గొట్టిపాటి శంకర్, కట్టా రామకృష్ణ, దద్దాల అంజయ్య, కత్తి అంజయ్య, గుంజి సుబ్బారావు,పోగుల శేఖర్, ముంద్రు దానయ్య సొసైటీ సూపర్ వైజర్ ఏడుకొండలు నాయక్, సీఈవో ఏలూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాలను సాగు చేయాలి

ఆత్మ డిప్యూటి ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల



మాట్లాడుతున్న ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల

అద్దంకిటౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా అపరాలను సాగు చేసుకోవాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల సూచించారు. గురువారం మండలంలోని కొంగపాడు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో వివిధ పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పొగాకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేసుకోవాలన్నారు. అద్దంకి ఏడీఏ బి.ఎ‌ప్రాయిమ్ మాట్లాడుతు కలెక్టర్ ఆదేశాల మేరకు బర్లీ పొగాకు సాగుచేయవద్దని సూచించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత డాక్టర్ మురళీధర్ నాయక్ మినుము, కంది, పెసర, శనగ పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేతలు ఎం. ఉషా అపరాల సాగులో విత్తనశుద్ధి గురించి, మరో శాస్త్రవేత కే.మృదుల అప రాలు, మొక్కజొన్నలో కలుపు నివారణ చర్యలు గురించి రైతుల కు వివరించారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, మణికేశ్వరం సొసైటీ అధ్యక్షుడు నర్రా బ్రహ్మానందం, గుడిపూడి బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శులు ప్రిస్కిల్లా , మస్తాన్‌వలి, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్ రామిరెడ్డి, ఏఈవో కోటేశ్వరరావు, వీపీఏ సాయిబాబు, రైతులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా హనుమంతరావు ప్రమాణస్వీకారం



హనుమంతరావును సన్మానిస్తున్న టీడీపీ నేతలు

మార్టూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల సొసైటీ చైర్మన్‌గా గురువారం సొసైటీ భవనంలో కంభంపాటి హనుమంత రావు బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా త్రిమెన్ కమిటీలో ఇద్దరు సభ్యులు నాతాని మునిబాబు, తన్నీరు అంకమ్మరావులు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమంతరావును టీడీపీ నాయకులు అర్వపల్లి శ్రీనివాసరావు, వంకాయల వెంకటసుబ్బారావు, కోనంకి మణి, గుద్దంటి శంకర్, మాలెంపాటి రాఘవయ్య,యర్రా రమేష్, తన్నీరు శ్రీనివాసరావులు అభినందించారు.

రైతులకు ఎరువులు పంపిణీ

మండలంలోని వలపర్ల సొసైటీలో గురువారం రైతులకు ఏవో లావణ్య, సొసైటీ సీఈవో ఈదర నాగేశ్వరరావులు రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఏవో మాట్లాడుతూ వేసిన పంటలకు అవసరమైన ఎరువులను మాత్రమే రైతులు తీసుకువెళ్లాలన్నారు. ముందస్తుగా నిల్వలను ఉంచుకోవద్దన్నారు. అదేవిధంగా బహిరంగ మార్కెట్లో ఎరువుల దుకాణాలలో ఎంఆర్‌పీ ధరలకు మించి అధిక ధరలకు ఎరువులను అమ్మిన షాపు యజమానులపై కఠిన చర్యలును తీసుకుంటామన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్ల ఔత్సాహికులకు ప్రోత్సాహం

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణ సాగించుకుని అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకం కల్పిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చీరాల ఎక్సైజ్ శాఖా కార్యాలయంలో సిఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రముఖులు, రిసార్ట్ నిర్వాహకులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఔత్సాహికులకు అవకాశాలు కల్పిస్తు విధివిధానాల్లో కొన్ని వెసులుబాటులు తెచ్చినట్లు వివరించారు. ఈనేపథ్యంలోనే ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆసక్తి కలిగిన వారు వివరాలు అందజేయాలని సూచించారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

- పలువురికి స్వల్ప గాయాలు
- చీరాల - వేటపాలెం రోడ్డులోని విశాల్ మార్ట్ వద్ద ఘటన

చీరాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును వెనుక వస్తున్న మరో బస్సు ఢీ కొనడంతో సుమారు 25 మంది ప్రయాణీకులు స్వల్పంగా గాయపడ్డారు. ఈఘటన గురువారం రాత్రి చీరాల - వేటపాలెం రోడ్డులోని విశాల్ మార్ట్ వద్ద జరిగింది. రెండు బస్సులు ఒంగోలు నుండి చీరాలకు ప్రయాణీకులతో వస్తున్నాయి. అయితే అకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో వెనుక బస్సు కండక్టర్ కూడా గాయపడ్డారు.

వాహనతనిఖీ రహదారి భద్రతపై అవగాహన

పంగులూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ వినోద్‌బాబు ద్విచక్ర వాహనచోదకులను హెచ్చరించారు. మండలంలోని అలవలపాడు అడ్డరోడ్డువద్ద 16వ నెంబరు జాతీయరహదారిపై గురువారం సాయంత్రం స్టేషన్ సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ నిర్వహించారు.

వైద్యశాల అభివృద్ధికి నిధులు



వైద్యాధికారికి చెక్కును అందజేస్తున్న రమేష్

సంతమాగులూరు ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు ప్రాథమిక వైద్యశాల అభివృద్ధికి ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్ ఆర్థిక సహకారం అందజేశారు. టీడీపీ నాయకులు చేవూరి వాసురెడ్డి మండలంలోని ప్రజా సమస్యల పరిష్కార సమీక్షలో సంతమాగులూరు ప్రాథమిక వైద్యశాలలో మౌలిక వసతుల కొరత వారిదృష్టికి వచ్చింది. తక్షణమే స్పందించిన ఏఎంసీ చైర్మన్ రమేష్ మౌలిక వసతుల్లా కల్పనకు తనవంతుగా రూ.1.5 లక్షలు సమకూర్చను ఉన్నట్లు ప్రకటించారు. ఏ మేరకు నగదు చెక్కును వైద్యాధికారి సాహిత్యకు అందజేశారు. కార్యక్రమంలో దాత తేలప్రోలు రమేష్‌తో పాటు టీడీపీ మండల నాయకులు చేవూరు వాసురెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రమేష్‌ను వైద్యాధికారులు నిర్మలకుమార్ వైద్యశాల సిబ్బంది, మండలంలోని కూటమి ప్రజా ప్రతినిధులు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- ఎంఈవో శివకోటేశ్వరరావు

పర్చూరు, అగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ప్రతి . ఒక్కరి బాధ్యతని మండల విద్యాశాఖాధికారి ఏ.శివకోటేశ్వరావు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆహ్లాద వాతావరణంతోపాటు, స్వచ్ఛమైన గాలి అందాలంటే మొక్కలే ప్రదానం అన్నారు.

సహకార సంఘాలు స్వయంసమృద్ధి సాధించాలి

పంగులూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సహకారం సంఘాలు స్వయం సమృద్ధి సాధించే దిశగా ఎదగాలని, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిన చెంచు ప్రసాద్, కేవీ.సుబ్బారావు అన్నారు. జనకవరం పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం గురువారం పంగులూరులోని కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్‌గా చిలుకూరి కోటేశ్వరరావు (కోటయ్య) సభ్యులుగా చిలుకూరి రామాంజనేయులు, తలపనేని సాంబ శివరావులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు డాక్టర్ బత్తులవీరనారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు ఏడుకొండలు, గుర్రం శేఖర్, చింతలసహదేవుడు, శింగర్, మేడసుబ్బారావు, డీసీ అధ్యక్షుడు కుక్కపల్లి ఆంజనేయులు, పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లంనేని స్వామి, బత్తుల వెంకటరావు, రావుల సింగరకొండ, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, సీఈవో నాగబోయిన లక్ష్మి జాగర్లమూడి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాలలో సొసైటీ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

బల్లికురవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కే.రాజుపాలెం సొసైటీ చైర్మన్‌గా గొట్టిపాటి మారుతి, కమిటీ సభ్యులుగా గోలి ఏడుకొండలు, బొల్లినేని కోటేశ్వరరావులు గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. అలానే కొమ్మినేని వారిపాలెం సొసైటీ చైర్మన్‌గా కొమ్మాలపాటి రామారావు. సభ్యులుగా దివ్వె రాదకృష్ణ, కీర్తిపాటి శ్రీనివాసరావులు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన టీడీపీ నేతలు, సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు పంచాయతీ అభివృద్ధి సూచకపై శిక్షణ

చినగంజాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంచాయతీ అభివృద్ధి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీహెచ్.పూర్ణచంద్రరావు తెలిపారు. ప్రిన్సిపాల్, డీపీఆర్‌సీ అండ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఒంగోలు జిల్లా పరిషత్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తహసీల్దార్, వ్యవసాయాధికారి, చినగంజాం, సంతరావూరు పశువైద్యాధికారులు, ఏఎస్‌వో, సివల్ సప్లయిస్ డీటీ విపత్తు నిర్వహణాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, గృహ నిర్మాణ శాఖ ఏఈ, సీడీపీవో, సూపర్‌వైజర్లు, ఏపీవో, ఏపీఎం, పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు పంచాయతీ అభివృద్ధి సూచిక(ప్రణాళికలు 1.0, 2.0)పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమునకు డిప్యూటీ ఎంపీడీవో కో కన్వీనర్ అయినందున పూర్తి బాధ్యత వహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో తెలిపారు.

ఎక్సైజ్ అధికారులకు కలసి వచ్చిన డ్రైడే

- మూడు బెల్ట్ షాపుల వద్ద మద్యం స్వాధీనం
- ఒక్క కేసు కూడా నమోదు కాని వైనం



స్వాతంత్ర్య దినోత్సవం రోజు కొనసాగుతున్న బెల్ట్‌షాప్ (ఫైల్)




అద్దంకిలోని ఎక్సైజ్ కార్యాలయం

అద్దంకి, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): డ్రైడే రోజు అద్దంకి ఎక్సైజ్ అధికారులకు కలసి వచ్చింది. బెల్ట్ షాపుల నిర్వహకులు మద్యం అమ్మకాలు చేస్తూ పట్టుబడడంతో కాసులు పిండుకొనేందుకు అవకాశం వచ్చింది.

స్వాతంత్ర్య దినోత్సవం రోజు పట్టణంలో మాత్రం లైసెన్స్ ఉన్న మద్యం దుకాణాలు మూసివేశారు. కాని బెల్ట్ షాపుల నిర్వహకులు ముందుగానే కొనుగోలు చేసి మద్యం నిల్వ చేసుకొని, జోరుగా అమ్మకాలు చేశారు. అయితే 'కంచె చేను మేసిన' చందంగా మద్యం అమ్మకాలను నియంత్రించాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అందివచ్చిన అవకాశాన్ని సొమ్ము చేసుకున్నారు. అద్దంకి పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజు మూడు చోట్ల బెల్ట్ షాపులపై దాడులు చేశారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, పలువురిని పట్టుకొన్నారు. బెల్ట్‌షాపులలో పట్టుబడ్డ మద్యం సీసాలను, అమ్మకాలు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఎలాంటి కేసు నమోదు చేయకుండానే వదిలేశారు. పట్టుబడ్డ మద్యంతో పాటు వీరు లక్ష రూపాయల వరకు ముట్టజెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారే యథేచ్ఛగా బెల్ట్‌షాపులు నిర్వహించడం గమనార్హం. మూడు నెలల క్రితం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అద్దంకి సర్కిల్ ఎస్‌హెచ్‌వో దీర్ఘకాలిక సెలవు లో వెళ్లడంతో మిగిలిన అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అంతా గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం నడుపుతున్నట్లు తెలుస్తోంది. అంతా తానై నడిపించే ఓ అధికారి తనకు నమ్మిన బంటుగా ఉండే ఓ కానిస్టేబుల్ ను వసూలుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం రోజు పట్టుబడ్డ ముగ్గురు బెల్ట్ షాపుల నిర్వహకుల వద్ద 2 లక్షల రూపాయలు డిమాండ్ చేసిన సదరు కానిస్టేబుల్ చివరకు లక్ష రూపాయలకు బేరం సెటిల్ చేసినట్లు తెలుస్తోంది. ఇదే పంథా కొనసాగితే బెల్ట్ షాపులు మరింత విచ్చలవిడిగా పెరిగే అవకాశం ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంకు ఎస్‌హెచ్‌వోగా ఓ సీఐను నియమించాల్సి ఉంది. దీంతో పాటు సిబ్బంది, అధికారుల ఆగడాలకు కూడా చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
శుక్రవారం 22 ఆగస్టు 2025

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 9, 10 తరగతులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందేందుకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మహ్మద్ ఆయూబ్ ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 31లోగా www. scholarship. gov.in దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నిర్వహించాలని అధికారులకు జడ్పీ సీఈవో మోహన్‌రావు ఓ ప్రకటనలో సూచించారు. గత శనివారం కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ఆ కార్యక్రమాన్ని ఈ వారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముంపు ఏర్పడకుండా కాలువల్లో పూడిక తీయడం, వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేయాలని, అధికారులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆదేశించారు.

'డీకేడబ్ల్యూ'లో డిగ్రీలో చేరండి

నెల్లూరు(విద్య), ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో మహిళల కోసమే ప్రత్యేకమైన డీకే కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ సైన్స్‌లో 12 కోర్సులు, బీఏలో ఐదు కోర్సులు, బీకామ్‌లో 4 కోర్సులు అందిస్తున్నామని తెలిపారు. ఇవికాక ఉపాధి ఆధారిత కోర్సులు, ఏడాది సమయం కలిగిన నానికేర్ కోర్సు కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. తొలివిడత ప్రవేశాలు ఈనెల 26వతేదీ వరకు జరుగుతాయని, కళాశాలలో హాస్టల్ వసతి కూడా ఉందని, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు రేపు సర్టిఫికెట్ల పరిశీలన

నెల్లూరు(క్రైం) ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన నెల్లూరు జిల్లా అభ్యర్థులకు శనివారం సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్, ఏపీ ఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు 23వ తేదీ నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరానికి ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. అన్నీ ఒరిజనల్ సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారులతో అటెస్టేషన్ చేయించి తీసుకురావాలని, ఇటీవల తీయించిన ఆరు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలు సమర్పించాలని సూచించారు. అభ్యర్థి పూర్తి వివరాలు నమోదు చేసిన పత్రంపై గెజిటెడ్ అధికారితో ధృవీకరించి అందజేయాలని తెలిపారు.

ప్రతి శాఖకు అభివృద్ధి లక్ష్యాలు

● జిల్లాలో సమృద్ధిగా ఇసుక : కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) : ప్రతి ప్రభుత్వ శాఖకు అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించినట్లు కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ శంకరన్ హాల్ నుంచి కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఇసుక నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రెండు డిసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుకను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుకను పారదర్శకంగా పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు.

రికార్డుల్లో ఏముంది...

ఎవరి పాత్ర ఎంత!?



'కి'లేడి' నిడిగుంట అరుణ వాడుతున్న సెల్‌ఫోన్‌లో రికార్డు అయిన వాయిస్ ఎవరిది? వీడియోలో ఎవరున్నారు? ఇంతకూ ఆమెకు సహకరించిన అధికారులు, ఉద్యోగులు ఎవరు? పోలీస్ శాఖలోనే ఎంత మంది ఉన్నారు? కోవూరు కేసుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇంకేమైనా ఫిర్యాదులు ఉన్నాయా!?." ఇలా అనేక అంశాలపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

● కి'లేడి' అరాచకాలపై పోలీసుల ఆరా ● రోజంతా విచారించిన ఏఎస్పీ సౌజన్య
● సహకరించిన వారి జాబితా సిద్ధం? ● రౌడీషీటర్ శ్రీకాంత్ ఆగడాలపైనా కూపీ లాగుతూ
● తమకు జరిగిన అన్యాయంపై బాధితుల గగ్గోలు ● నెల్లూరుకు వచ్చి ఫిర్యాదు చేయమంటున్న పోలీసులు

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన నిడిగుంట అరుణ, ఈమె ప్రియుడు, రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్ ఆగడాలపై పోలీసులు లోతైన విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. వీరిద్దరికి సహకరించింది ఎవరు? రాష్ట్రవ్యాప్తంగా వీరిఆగడాలు ఏంటి? బాధితులు ఎందరు? తదితర వాటిపై క్షుణ్ణంగా ఆరా తీస్తున్నారు. ఓ బిల్డర్ ఫిర్యాదు మేరకు కోవూరు పోలీసులు బుధవారం అరుణను అరెస్ట్ చేసి, ఒంగోలు జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కోవూరు స్టేషన్‌లో నమోదైన కేసుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అరుణ చేసిన అరాచకాలపై పోలీసులు గురువారం లోతుగా విచారిస్తున్నారు. నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో ఉన్న పోలీస్ అతిథిగృహంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య గురువారం అరుణకు సంబంధించిన పలు విషయాలపై పలువురిని విచారించినట్లు తెలిసింది. అరుణ వినియోగించిన ఫోన్‌లోని వాయిస్, వీడియో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇది బయటకు వస్తే సూత్ర, పాత్రధారులందరూ వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అలాగే, రౌడీషీటర్ శ్రీకాంత్, అరుణలకు గత ప్రభుత్వంలో సహకరించిన పోలీసు అధికారులు, ప్రస్తుత ప్రభుత్వంలో సహకరించిన ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, ఏఆర్ సిబ్బంది ఎవరన్న దానిపై జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది బయటకు పొక్కడంతో పోలీసు శాఖలోనే గుబులు మొదలైంది.

● మేడం నన్ను మోసం చేశారు!

ప్రేమికుల దందాలపై విచారిస్తున్న సమయంలోనే విజయవాడ నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి తన వద్ద అరుణ పెద్ద మొత్తంలో నగదు తీసుకొని మోసం చేసిందని, న్యాయం చేయాలని పోలీసు అధికారులతో చెప్పారు. అయితే, నెల్లూరుకు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు ఆ వ్యక్తికి సూచించారు. శుక్రవారం ఆ వ్యక్తి నెల్లూరుకు రానున్నట్లు సమాచారం. కి'లేడీ'పై ఫిర్యాదు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా బాధితులు నెల్లూరుకు తరలిరానున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు సైతం ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ ఆదేశించినట్లు సమాచారం.

పల్లెకు చేరని స్థిరాస్తి వాటా

రిజిస్ట్రేషన్ శాఖ స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన స్థిరాస్తి వాటా (ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) చెల్లింపులో జాప్యం నడుస్తోంది. సుమారు రూ.35 కోట్లకు పైగా బకాయిలు ఉండటంతో పల్లెల ప్రగతికి ఆటంకం ఏర్పడుతోంది. అధికారులు కూడా నగదు చెల్లింపు విషయంలో పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

● ట్రాన్స్‌ఫర్ డ్యూటీకి ఎగనామం
● రూ.35 కోట్లకుపైగా బకాయిలు
● పట్టించుకోని రిజిస్ట్రేషన్ శాఖ
● స్థానిక సంస్థల అభివృద్ధికి గండి

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఆస్తి కొనుగోలు, అమ్మకానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించాలి. ఈ సమయంలో ట్రాన్స్‌ఫర్ డ్యూటీని (టీడీ) వసూలు చేయటం వల్ల ఎటువంటి ఎగవేతకు అవకాశం ఉండదు. ఈ మొత్తాన్ని పారదర్శకంగా సేకరించి సంబంధిత స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. భూములు, స్థలాలు, ఇళ్లు, వాణిజ్య భవనాలు తదితర ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేస్తారు. ఆ ఫీజులోనే 1.5 శాతం మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. దస్తావేజుల రిజిస్ట్రేషన్ ఫీజులు 7.5 శాతం కట్టించుకుంటారు. ఇందులో డెఫిసిట్ ఫీజు 6.5 శాతం ఉంటుంది. ఈ ఫీజులో 1.5 శాతం స్థానిక సంస్థలకు బదలాయించడానికి టీడీ ఫీజుగా కట్టించుకుంటారు. 1 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు ఉంటుంది. పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఈ టీడీ ద్వారా ఆదాయ వనరుల సమకూర్చుకుంటాయి. అభివృద్ధి పనులకు కూడా ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. వివిధ రకాల పన్నులు, ఇతర ఫీజులు మీద మాత్రమే ఆధారపడితే ఆశించినంత స్థాయిలో స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరదు. ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ద్వారా వచ్చే ఆదాయం వాటికి ఊపిరి పోసినట్లవుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, వీధిదీపాలు, నీటి సైపులు, కాలువలు, పారిశుధ్య పనులు నిర్వహించే వీలు ఉంటుంది. అదనంగా పార్కులు, కమ్యూనిటీ హాళ్లు తదితర ప్రజా సౌకర్యాల కోసం కూడా ఆ మొత్తాన్ని ఖర్చు చేయవచ్చు.

సకాలంలో పంపుతాం

ట్రాన్స్‌ఫర్ డ్యూటీ మొత్తం వివరాలను పంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా సబ్ రిజిస్ట్రార్‌ల నుంచి సేకరించాం. ఇంకా పూర్తి వివరాలు సేకరించి సకాలంలో స్థానిక సంస్థలకు చెల్లింపులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

● రూ.కోట్లలోనే బకాయిలు

జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ స్థానిక సంస్థలకు రూ.35 కోట్లకుపైగానే బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తంలో పంచాయతీలకు రూ.11 కోట్లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌కు రూ.24 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తంలో ఒక్క నెల్లూరు నగర పాలక సంస్థకే రూ.12 కోట్లకు పైబడి ఉంది. ఈ డీటీకి సంబంధించి ఎంత మొత్తం చెల్లించాలనే వివరాలు జిల్లా రిజిస్ట్రార్లు పంచాయతీల వారీగా తెలియ చేయాలి. అప్పుడు జిల్లా రిజిస్ట్రార్ ఆ వివరాలు ట్రెజరీకి పంపుతారు. ట్రెజరీ ద్వారా స్థానిక సంస్థలకు నగదు విడుదలవు తుంది. కానీ సబ్ రిజిస్ట్రార్లు తమ పరిధిలోని పంచాయతీల వారీ గా టీడీ వివరాలు పంపడంలో తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

బార్లకు దరఖాస్తులు నిల్!

● ముందుకు రాని వ్యాపారులు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన బార్ పాలసీని బార్ల యజమానులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో 50 బార్లకు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా ఎక్సైజ్ అధికారులకు అందలేదు. ఈ నెల 18వ తేదీన కలెక్టర్ ఆనంద్ గజిట్‌ను విడుదల చేయగా, దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 26 వరకు గడువు ఉంది. అయితే, నాలుగు రోజులు గడిచినా ఒక దరఖాస్తు కూడా అందలేదు. కాగా, నూతన పాలసీపై బార్ల నిర్వాహకులు ఇటీవల సమావేశమై తమ నిర్ణయాలను ఎక్సైజ్ అధికారులను కలిసి విన్నవించారు. నూతన పాలసీపై యజమానుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, తమ ఆర్థిక భద్రతపై, వ్యాపార స్థిరత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతూందని వ్యాపారులు పేర్కొన్నారు. నెలకు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లుతుందని, జరగబోయే బార్ టెండర్లలో తాము పాల్గొనడం లేదని తేల్చి చెప్పారు. లాటరీ విధానం ప్రవేశపెట్టడం ద్వారా సుదీర్ఘకాలంగా ఉన్న బార్ యజమానులకు లైసెన్సులు పోగొట్టుకునే ప్రమాదం ఉందని తెలిపారు. తదితర అంశాలపై అధికారులకు విన్నవించుకోగా, పాలసీని మార్చే అధికారం తమ చేతుల్లో లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను మాత్రమే తాము అమలు చేస్తామని స్పష్టం చేశారు. బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఎన్ని దరఖాస్తులు అందుతాయో వేచి చూడాలి.

నెల్లూరు బీసీ ల్యాబ్‌కు జాతీయస్థాయి గుర్తింపు

నెల్లూరు (వ్యవసాయం): నెల్లూరులోని జీవన ఎరువులు, సేంద్రీయ ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాల (బీసీ ల్యాబ్)కు నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కొలాబ్రేషన్ లేబరేటరీస్ (ఎన్ఏబీఎల్) జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 2016లో రాష్ట్రంలోనే మొదటిదిగా ఈబీసీ ల్యాబ్ ప్రారంభమైంది. ఇందులో రైజోబియం, అజస్పిరిల్లం, అజుటోబాక్టర్ వంటి జీవన ఎరువులతోపాటు కంపోస్టు, వర్మికంపోస్టు, భాస్వరంతో కూడిన సేంద్రీయ ఎరువు, ద్రవ రూపంలోని ఫార్మటెడ్ సేంద్రీయ ఎరువులు, ఇంకా వేప, ఆముదం, కానుగ, జట్రోపా, మాహువాలను ఎఫ్‌సీఓ 1985 ప్రకారం నిర్ధారణ చేస్తారు. రైతులకు నాణ్యమైన జీవన, సేంద్రీయ ఎరువులను అందించి తద్వారా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశమని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీ ల్యాబ్‌లో పనిచేస్తున్న అధికారులను, సిబ్బందిని ఆమె అభినందించారు.



సిమెంట్ రోడ్డు మార్జిన్‌కు ట్రాక్టర్‌తో తోలిన తువ్వ ఇసుక

ఇది సురక్షితమేనా!?

సీసీ రోడ్ల మార్జిన్లకు తువ్వ ఇసుక

ప్రమాదమని తెలిసినా ఓ కాంట్రాక్టర్ కక్కుర్తి

ఇది ఓ కాంట్రాక్టర్ కక్కుర్తి. సిమెంటు రోడ్డుకు ఇరువైపులా మట్టి బదులు తువ్వ ఇసుకతో నింపుతున్నాడు. భవిష్యత్తులో అది నిలవదని తెలిసినా అధికారులు కూడా మిన్నకుండిపోతున్నారు. సంగం మండలం మక్తాపురంలో ఇటీవల సిమెంట్ రోడ్లకు రూ.45 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి రూ.10 లక్షల లోపు బిట్లుగా విభజించి నామినేషన్‌పై పనులు చేపట్టారు. గ్రామం నడిబొడ్డున ఈశ్వరమ్మ రాయి నుంచి ఎస్టీ కాలనీ వరకు, వాటర్ ప్లాంట్ నుంచి పోలేరమ్మ గుడి వరకు సుమారు 1350 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డు వేశారు. అయితే రోడ్డు మార్జిన్‌కు గ్రావెల్ తోలాల్సి ఉండగా సమీపంలోని పెన్నానది ఒడ్డున లభ్యమయ్యే తువ్వ ఇసుకతో నింపుతున్నారు. ఈ తువ్వ ఇసుక తోలితో ట్రాక్టర్ రూ.500లే ఖర్చు అవుతుంది. అదే ట్రాక్టర్ గ్రావెల్‌కు సుమారు రూ.3000 నుంచి 3500 వేలు ఖర్చవుతుంది. తవ్వ ఇసుక తోలడం వల్ల సదరు నాయకుడికి ఒక ట్రాక్టర్‌కు సుమారు రూ.2500 నుంచి 3000 ఆదా అవుతుంది. దీంతో ఆ నాయకుడు అర కిలోమీటరు దూరంలో పెన్నాలో నుంచి తువ్వ ఇసుక వేసి చేతులు దులుపుకుంటున్నాడు. ఇది వేయడం వల్ల ఇసుక కోతకు గురై యథావిధిగా మారుతుంది. అంతేగాక ఇసుక వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. మరోవైపు సీసీ రోడ్డు నిర్మాణంలోనూ నాణ్యత లోపించిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయాలని కోరుతున్నారు. ఈఆర్ ఏఈ రామయ్య మాట్లాడుతూ రోడ్డు మార్జిన్‌కు వేసిన తువ్వ ఇసుకను తొలగించి గ్రావెల్ తోలాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. రోడ్డు నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశాకే బిల్లులు అందజేస్తామని చెప్పారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

ఓరా.. సౌర!

● విస్తరిస్తున్న సోలార్ విద్యుత్ వినియోగం
● కార్యాలయాలు, ఇళ్లపై విస్తృతంగా పలకల ఏర్పాటు



నారాయణ మెడికల్ కాలేజీ భవనంపై..



జడ్పీ కార్యాలయంలోని పార్కింగ్‌లో..



కార్పొరేషన్ కార్యాలయంపై..

సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. మొన్నటిదాకా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలపైనే సోలార్ పలకలు ఏర్పాటు చేశారు. అయితే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విరివిగా సబ్సిడీలు ఇవ్వడంతో ప్రజలు కూడా సోలార్ ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. పలకల ఏర్పాటుతో మిద్దెలన్నీ అద్దంలా మెరిసిపోతున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)



ఓ వాణిజ్య సముదాయం ముందు..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	224
కోడిగుడ్ల ధర (100): 525	

డ్రైనేజీ కాలువల్లో పూడికతీత

కావలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటిపారుదలకు ఆటంకం లేకుండా పట్టణంలోని ప్రధాన డ్రైన్లలో గురువారం మున్సిపల్ కార్మికులు పూడికతీత చేపట్టారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులు కాలువల్లో పూడిక తొలగిస్తున్నారు. జనతాపేటలోని 29, 31 వార్డులకు సంబంధించి రైల్వేట్రాక్ వెంబడి ఉన్న ప్రధాన డ్రైన్‌లో పూడిక తీస్తున్నారు. ఈ పనులను స్థానిక టీడీపీ నాయకులు తలపనేని ప్రభాకర్, దశయ్య పర్యవేక్షించారు. అలాగే ట్రంకురోడ్డులో తూర్పు వైపున ఉన్న ప్రధాన డ్రైన్‌లో కూడా మూతబండలు తొలగించి పూడిక తీస్తున్నారు.



వచ్చే నెలాఖరుకు ఉత్తర కాలువ పనులు

● అక్టోబరు నుంచి రాళ్లపాడుకు నీరు ● నెరవేరనున్న రైతుల కల



రాళ్లపాడు ఉత్తర కాలువ వెడల్పు పనులు చేస్తున్న యంత్రాలు



ఉత్తర కాలువపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం

లింగసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు నీరందించే ఉత్తర కాలువ వెడల్పు పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలాఖరుకు ఈ పనులు పూర్తవుతాయని, అక్టోబరు మొదటివారం నుంచి రాళ్లపాడుకు నీరు వచ్చే అవకాశం ఉందని ప్రాజెక్టు ఈఈ మునిరత్నం, డీఈలు శేషయ్య, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర కాలువ వెడల్పు పనులు 89 కి.మీ నుంచి 95వ కి.మీ మధ్య జరుగుతున్నాయి. కాలువపై అక్కడక్కడా వంతెనల నిర్మాణం కూడా జరుగుతున్నది. గతంలో 150 క్యూసెక్కుల నీటిని మాత్రమే సరఫరా చేసేలా కాలువ వెడల్పు 3.7 మీటర్లు మాత్రమే ఉండేది. అయితే రాళ్లపాడుకు 600 క్యూసెక్కుల నీటిని అందించేలా కాలువను 10 మీటర్ల వెడల్పు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయ్యాక సోమశిల నుంచి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. ఎన్నో ఏళ్ల నుంచి సోమశిల జలాల కోసం ఎదురుచూస్తున్న రైతుల కల ఎట్టకేలకు అక్టోబరులో నెరవేరనున్నది.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెటర్నరీ ఏడీ చెన్నకేశవులు

వలేటివారిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ ఏడీ డాక్టర్ ఎంతోటి చెన్నకేశవులు తెలిపారు

? : ఈ సీజన్‌లో పశువులకు ఏయే వ్యాధులు వ్యాపిస్తాయి.

! : ఈ సీజన్‌లో గొంతువాపు, పొదుగువాపు, శ్వాసకోశ వ్యాధులు వ్యాపిస్తాయి.

? : పశుపోషకులకు ప్రభుత్వ సబ్సిడీ పథకాలు ఏమేమీ ఉన్నాయి ?

! : రైతులకు పశుకిసాన్ క్రెడిట్ పథకం, నేషనల్ లైవ్ స్టాక్ పథకం కింద సబ్సిడీ రుణాలు అందుబాటులో ఉన్నాయి.

? : వైద్యులు, సిబ్బంది కొరతతో సకాలంలో వైద్యం అందడంలేదని రైతులు అంటున్నారు.

! : పోకూరులో డాక్టర్ పోస్టు, పోలినేని చెరువు, కళవళ్ల సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

భూసార పరీక్షలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారిణి గీతాకుమారి

కొండాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలపై రైతులకు అవగాహన ఎంతో అవసరమని జిల్లా వనరుల కేంద్రం నెల్లూరు వ్యవసాయ అధికారిణి గీతాకుమారి అన్నారు. గురువారం మండలంలోని సాయిపేట రైతుసేవాకేంద్రంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు.ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకొని దానికి అనుగుణంగా భూమిలో పైర్లు సాగుచేసుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీహరినారాయణ, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కే. మోహనరావు, జిల్లా టెలికాం బోర్డు మెంబరు టీ. అనూష, సాగునీటి సంఘ అధ్యక్షుడు టీ. ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, వీఏఏ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ప్రతాప్ దిష్టిబొమ్మల దహనం



కావలి : మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నేతలు

కావలి,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిపై హత్యాయత్నాన్ని నిరసిస్తూ, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని టీడీపీ శ్రేణులు గురువారం వాడవా డలా ప్రతాప్ దిష్టిబొమ్మలను దహ నం చేశారు. కొన్ని ప్రాంతాల్లో ప్రతాప్ రెడ్డి బొమ్మలతో నిరసన తెలిపారు. పాతూరులోని క్రిష్ణుడి బొమ్మ సెంటర్, 31వ వార్డులో జనతాపేటలోని పెద్దపవని రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, ముసునూరు సెంటర్‌లోని ట్రంకు రోడ్డులో, 8వ వార్డులోని వివేకానంద పార్కు ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. 26, 29 వార్డులకు చెందిన టీడీపీ శ్రేణులు ఉదయగిరి రోడ్డులో ప్రతాప్‌రెడ్డి చిత్రపటంతో నిరసన తెలిపారు.

● హత్యారాజకీయాలు అలవాటే...

బిట్రగుంట : మాజీ ఎ మ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పదేళ్ల పదవీకా లంలో హత్యలు, అవినీతి రాజకీయాలు చేయ డం అలవాటేనని టీడీపీ మండల కన్వీనర్ నాగే శ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు దుయ్యబట్టారు. బోగోలు టీడీపీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దిష్టిబొమ్మను బోగోలు బజారు కూడల్లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుధీర్ బాబు, వెంకటేశ్వర్లు రెడ్డి, రఘురాం నాయుడు, ఆదిశేషయ్య, ప్రసన్న మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● హత్యాయత్నాన్ని ఖండిస్తున్నాం...

దగదర్తి (బిట్రగుంట) : ఎమ్మె ల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిపై హత్యాయ త్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి అన్నారు. గురువారం దగదర్తి కెనరా బ్యాంక్ వద్ద నుంచి ప్రతాప్ దిష్టిబొమ్మను పాడిపై పడుకో పెట్టి వినూత్నంగా శవయాత్ర చేశారు.ఈ కార్యక్ర మంలో టీడీపీ నేతలు హనుమంతరా వు,హ రిరెడ్డి, వీ. కొండపునాయుడు వీ. వినయ్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బోగోలు జజారు కూడలిలో ప్రతాప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

మురుగు కాలువల్లో పైరోసిన్ ఆయిల్ పిచికారీ

కందుకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దోమల నిర్మూలనలో భాగంగా పట్టణమంతా మురుగు కాలువల్లో పైరోసిన్ ఆయిల్ పిచికారీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కే. అనూష తెలిపారు. కొద్దిరోజులుగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఈ పని పూర్తిచేశామన్నారు. గురువారం నాంచారమ్మ కాలనీ, కృష్ణ బలిజసంఘం, కోటారెడ్డి నగర్‌లో పిచికారి చేయించామన్నారు. మురుగుకాలువల్లో దోమలు లార్వా వృద్ధి చెందకుండా నిర్మూలించటం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు.



మురుగు కాలువల్లో పైరోసిన్ ఆయిల్ పిచికారీ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

మేత పోరంబోకు భూముల్లోని ఇళ్ల పరిశీలన



యర్రారెడ్డిపాలెం పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ హిమవంశీ, తదితరులు

లింగసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రారెడ్డిపాలెంలోని పశువుల మేత పోరంబోకు భూముల్లో కట్టుకున్న ఇళ్లను, పొలాలను కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీ పరిశీలించారు.గురువారం మధ్యాహ్నం తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని సర్వే నంబరు 101/2లోని 711 ఎకరాల పోరంబోకు భూముల్లో సుమారు 120 ఎకరాల్లో గ్రామస్థులు కొందరు 350 ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారు.ఈ విషయమై గ్రామస్థులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం ఇచ్చారు.అలాగే గత మార్చి 3న పంచాయతీ వారు కూడా తీర్మానం చేశారు. దీంతో సబ్‌కలెక్టర్ గ్రామాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఆయన లింగసముద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి, అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శుల కొరత గురించి ఆరా తీశారు.వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కన్వర్షన్ భూములపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, వీఆర్వో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

● వైద్య సిబ్బందిపై డీసీహెచ్ఎస్‌ల ఆగ్రహం



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఒంగోలు, నెల్లూరు డీసీహెచ్ఎస్ అధికారులు శ్రీనివాస నాయక్, పరిమళ

ఉలవపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీ వైద్యుల పనితీరు అసంతృప్తిగా ఉందని, తీరు మార్చుకోకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ హాస్పిటల్స్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) ఒంగోలు, నెల్లూరుకు చెందిన అధికారులు శ్రీనివాస్ నాయక్, పరిమళ హెచ్చరించారు. గురువారం వారిద్దరూ ఉలవపాడు సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో 8 మంది వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉండగా, ముగ్గురు మాత్రమే ఉన్నారు. అదే సమయంలో స్థానికులు సీహెచ్‌సీ వైద్య సేవలపై ఫిర్యాదులు చేశారు. పేరుకే 30 పడకల ఆసుపత్రి అయినా ఏరోజు కూడా పూర్తిస్థాయిలో వైద్యులు విధుల్లో ఉండరని, ఒకరో ఇద్దరో డ్యూటీలో వచ్చిన రోగులకు నామమాత్రంగా సేవలు అందిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్ వైద్యులు, జనరల్ సర్జన్, టీబీ, షుగర్ వైద్యులు సెలవుల్లో ఉన్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. చిన్నపిల్లల వైద్యులు, డెంటల్, మత్తుడాక్టర్ మాత్రమే గురువారం విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. అంతేకాక మధ్యాహ్నం, రాత్రులు డ్యూటీ డాక్టర్లు ఉండటం లేదన్నారు. వైద్య సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్న పాత ఆసుపత్రి భవనం తొలగించే ఏర్పాట్లు చేస్తామని వారు స్థానికులకు హామీ ఇచ్చారు.

న్యూస్ బాక్స్

విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో-1 రవికుమార్

కొండాపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ఎంఈవో-1 కే రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని సాయిపేట ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో జరిగే ప్రార్ధనకు ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు, విద్యార్థి కచ్చితంగా హాజరకావాలన్నారు. అనంతరం కొత్తపాలెం ప్రాథమిక ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. శాంప్-1 మార్కుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో హెచ్ఎం రమణ, దాత, ఉపాధ్యాయుడు వెంకటరావు

కొండాపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ (దిక్సూచి)ను భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.వెంకటరావు తన సొంత నిధులతో గురువారం అందచేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వీవీ.రమణ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ భౌతికశాస్త్ర నిపుణులతో బ్లూప్రింట్ ఆధారంగా రూపొందించామన్నారు. మెటీరియల్ అభ్యాసంతో పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు వీలుంటుందన్నారు. మెటీరియల్ అందచేసిన ఉపాధ్యాయుడు వెంకటరావుకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్థిక సాయం అందించడమే లక్ష్యం



సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న బీద గిరిధర్

అల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక సహకారం అందించడంలో అనేక మార్గాలను ఎన్నుకుంటోందని, ఇందులో భాగమే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు.మండలంలోని ఇస్కపల్లిలో ఆయన కార్యాలయంలో ముగ్గురు లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీహరి, బుచ్చింగారి బాబు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలతో అర్జీ సమర్పించాలి

కందుకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రద్దయిన పింఛన్లలో కొందరు అర్హులకు కూడా అన్యాయం జరిగినట్లు ఫిర్యాదులు రావటంతో ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. పింఛన్లు కోల్పోయిన వారు ముందుగా ఏరియా హాస్పటల్ మెడికల్ బోర్డుకు హాజరైతే వారు పరీక్షించి మాన్యువల్ సర్టిఫికెట్ అందజేస్తారని, ఆ సర్టిఫికెట్ తీసుకుని పెన్షన్ రద్దుచేసిన సర్టిఫికెట్, పాత పెన్షన్ సర్టిఫికెట్, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో జతచేసి మండలాల్లో ఎంపీడీవోలకు, పట్టణంలో మున్సిపల్ కమిషనర్‌కు అర్జీలు అందజేయాలని కోరారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

వాటర్ క్యాన్లు, నోటు పుస్తకాల పంపిణీ



కందుకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సింహాద్రినగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అలాగే రెండు కూలింగ్ వాటర్‌క్యాన్లు కూడా అందజేశారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, చక్కా కేశవ, గోనుగుంట వేణుగోపాలరావు, శివసూర్యాచారి, రతన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అందరిదీ



బాల్యవివాహ నిరోధక చట్టం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ తదితరులు

కావలి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు తీసుకోవాలని ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టే విషయంపై గురువారం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్‌స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ బాల్యవివాహాలు వలన అనేక దుష్ప్రభావాలు ఉన్నాయని, వాటిని తెలియచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీలు వారి ప్రాంతంలో టీనేజ్ వయసులో ఉన్న వారిని గుర్తించి వారి వివరాలు తెలుసుకుంటుండాలన్నారు. బాల్యవివాహాలు వల్లే జరిగే అనర్థాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం బాల్యవివాహనిరోధక చట్టంపై పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పీ.శ్రీధర్, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, చైల్డ్‌ప్రొటెక్షన్ జిల్లా అధికారి సురేష్, డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, ఎస్ఐలు, ఎంఈవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల నిరసన



కావలి : బ్రిడ్జి కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కావలి(టౌన్), ఆగస్టు21(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారంలో భాగంగా అంగన్‌వాడీలు గురువారం బ్రిడ్జి కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ అంగనావాడాలకు ఇప్పటివరకు ఉన్న యాప్‌లన్నీ రద్దు చేసి ఒకే యాప్ విధానం తీసుకురావలన్నారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, 5జీ ఫోన్ ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శి రుక్మిణి,కే. సుభాషిణి, నాయకులు విజయలత, రఘురావమ్మ, జయంతి, ప్రభావతి, కళావతి, జ్యోతి, బిందు తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు, ఆయాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం నేతలు టీ.మాల్యాద్రి, టీ.వెంకయ్య డిమాండ్ చేశారు. బోగోలు మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు, ఆయాలతో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ పథకాలను అందచేయాలని అన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● జలదంకి : గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన నెలజీతం రూ.26వేలు హామీ అమలు పరచాల ని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్క ర్స్, హెల్పర్స్ గురువారం సాయంత్రం జలదంకి బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ మానవహారంలో అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ నాయకురాళ్ళు సుకన్య, తిరుపతమ్మ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే మీ డిమాండ్లను అమలు చేస్తామని టీడీపీ నేతలు హామీ ఇచ్చారని, కానీ తమ హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. ఇప్పటికైనా తమ హామీలను అమలుపరిచి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను ఆదుకోవాలని వారు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సమీక్షలు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే అధికారులు, పాలకులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. పట్టణ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలను గ్రామ నాయకులు తమదృష్టికి తెచ్చారని, వాటిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికలోటులో ఉన్నందున గ్రామాల్లో మురుగునీటి కాలువల ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నది కావటంతో మురుగు నీటిని రోడ్లపై కి వదలకుండా చూడాలన్నారు. స్త్రీ శక్తి పథకం ప్రజల ఆదరణ పొందిందని, ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల వసతి మెరుగుపర్చటంతో పాటు మహిళల రక్షణకు రాత్రిళ్ల పోలీస్ బీట్ ఏర్పాటు చేయించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. మండలంలోని జువ్విగుంటపాలెం లో 4 నెలలుగా ఉపాధి పనులు పెట్టలేదని తాళ్లపాలెం సర్పంచి సురేష్ తెలపగా, సోమవారం నుంచి పనులు పెడతామని ఏపీవో చెంచయ్య తెలిపారు. అలాగే బట్లదిన్నె నుంచి తాళ్లపాలెం రోడ్డు మార్గంలో జెంగిల్ క్లియర్ చేయించాలన్నారు. చెన్నాయపాలెంకు బస్ వసతి కల్పించాలని ఎంపీటీసీ గంగన్నగారి యాదగిరి కోరారు. ఇలా అన్నీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజా సమస్యలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏ. కవిత, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పరాయి పంచన పఠనాలయం

● ఇన్‌చార్జి గ్రంథపాలకుడే దిక్కు ● పాఠకులు లేక వెలవెలబోతున్న లైబ్రరీ ● పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయం

వలేటివారిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో 39 ఏళ్లగా గ్రంథాలయం అద్దె భవనంలో నడుస్తోంది.ఇక్కడ దివంగత సీఎం ఎన్టీఆర్ హయాంలో 1986 ఆగస్టులో గ్రంథాలయాన్ని ఓ ప్రైవేట్ భవనంలో ప్రారంభించారు. అప్పటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతున్నది. ఇప్పటి వరకు రూ. 10 లక్షలకుపైగానే అద్దె చెల్లించి ఉంటారు. ప్రస్తుతం ఉన్న భవనానికి నెలకు అద్దె రూ.3 వేలనను ప్రభుత్వం చెల్లిస్తున్నది. అయితే ఈ భవనంలో వసతులు లేక పాఠకులు కూడ గ్రంథాలయానికి రావడం లేదు. బస్టాండు సెంటరులో గ్రంథాలయం ఉన్నప్పుడు పాఠకులతో కళకళలాడుతుండేది. ఇప్పుడు దాన్ని బీసీ కాలనీలోకి మార్చారు.అంతేకాక రెగ్యులర్ గ్రంథపాలకుడు లేడు. అద్దె భవనంలో పాఠకులు కూర్చోవడానికి కుర్చీలు, బల్లలు లేవు దినపత్రికలు కూడా రావడం లేదు. పిల్లలు చదువుకోవడానికి కథల పుస్తకాలు లేవు. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ లేదు. ప్రస్తుతం ఉలవపాడు గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణానికి స్థలం చూపిస్తే నిధులు మంజూరు చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నట్లు గ్రంథపాలకుడు చెబుతున్నారు. రెగ్యులర్ గ్రంథపాలకుడు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పోస్టు కూడా ఖాళీగానే ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలి.

రైతులకు శిక్షణ

జలదంకి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీకే అగ్రహారంతి గ్రామ ఆర్ఎస్‌కేలో గురువారం రైతులకు పచ్చిరొట్టపైరు, జీవన ఎరువులపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సాంకేతిక వ్యవసాయాధికారి రామ్మోహన్, మండల వ్యవసాయాధికారిణి శ్రీవాణి. ఏఈవో శిల్పకళ, వీఏఏ శ్రీహరి పాల్గొన్నారు.

ఇవి నీళ్ల ట్యాంకులేనండి!

జిహ్వాకో రుచి.. పుర్రెకో బుద్ధి.. నిజమేగా! చేతికి ఉండే ఐదు వేళ్లే సమానంగా ఉండవు. అలాంటిది.. సమాజంలో ఉన్న కోట్లాదిమంది మెదళ్లలో కోటి వెరైటీ ఐడియాలు ఉండడంలో పెద్దగా హా..శ్చర్యమేమీ లేదు కదా. డిఫరెంట్‌గా ఆలోచించే వ్యక్తులను చూస్తే ఎవరికైనా ముచ్చటేస్తుంది. ఎంతమందిలో ఉన్నా.. ఇలాంటివారి రూటే సపరేట్! ఎంతో అందంగా నిర్మించికున్న ఇంటిపై నీళ్ల ట్యాంకులను తమ అభిరుచులకు అనుగుణంగా నిర్మించుకున్నారు. చూపరులను ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

మేడ ఎక్కిన కారు!



పొదలకూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉంటున్న దుగ్గినేని వెంకటేశ్వర్లు తన ఇంటిపై కారు ఆకారంలో నీళ్ల ట్యాంకును నిర్మించుకున్నాడు. రాపూరు, గూడూరు మార్గంలో పొయ్యే వాళ్లందరూ.. 'కారెట్ల మేడె క్కిందబ్బా..' అని తలపైకెత్తి అదే పనిగా చూస్తాంటారు. కానీ.. అది వాటర్ ట్యాంక్.. అని తెలుసుకుని.. 'వార్నీ.. పాసుగులా.. ఎంకటేశన్నకు బొలే ఐడియా వచ్చినాదే' అని నవ్వుకుంటూ వెళుతున్నారు.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)

పూరిల్లు ఆకృతిలో..



ఇది పూరిల్లు ఆకారంలో నిర్మించిన భవనం అనుకుంటే తప్పులో కాలేసినట్లే. వాస్తవానికి సంగంలోని మెయిన్ బజార్‌లో ఉన్న రహీం తన మూడంతస్తుల మిద్దెపైన పూరిల్లు ఆకృతిలో వాటర్ ట్యాంకును నిర్మించారు. ఇది చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

ఫొటోగ్రఫీపై ప్రేమతో ఇలా...



ఫొటోగ్రఫీపై ఉన్న ప్రేమతో ఇంటిపై కెమెరా ఆకృతిలో వాటర్ ట్యాంక్ నిర్మించాడు రాపూరుకి చెందిన శేషు. గత ముప్పై ఏళ్లుగా పట్టణంలో శేషు స్టూడియో పేరుతో ఆయన ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 2010లో ఇంటి నిర్మాణం చేపట్టి మిద్దెపైన కెమెరా ఆకృతిలో వాటర్ ట్యాంక్ నిర్మించారు. చూపరులను ఇది ఎంతగానో ఆకట్టుకుంటున్నది. ఈ నిర్మాణం శేషు వృత్తి నిబద్ధతకు అద్దం పట్టేలా ఉంది.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

చిన శేషవాహనంపై చిద్విలాసుడు

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



గొలగమూడిలో వెలసిన అవధూత వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం వేకువజామున గోపూజ తో నిత్య పూజలు మొదలయ్యాయి. అనంతరం సుప్రభాత సేవ, అభిషేకం, హారతి, ప్రసాద వినియోగం, ఉత్సవ విగ్రహానికి అభిషేకం, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చినశేష వాహన సేవ నిర్వహించారు. రాత్రికి గజవాహన సేవ నేత్ర పర్వంగా జరిగింది. సేవలను తిలకించడానికి భక్తులు తండోపతండాలుగా వచ్చారు. దివిటీలు, విద్యుద్దీపాల కాంతులమధ్య వెంకయ్య స్వామి మరింత శోభాయమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపు సందర్భంగా వివిధ వాద్యాలు భక్తి పారవశ్యాన్ని పంచాయి. వెంకయ్య స్వామి వారికి గ్రామస్తులు కర్పూర నీరాజనాలు అందించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం వెంకయ్య స్వామికి అశ్వవాహన సేవ, రాత్రికి పెదశేషవాహన సేవ నిర్వహిస్తామని ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

- వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి)

చీకటి పడితే చేయి పట్టరా..!

- రాత్రుళ్లు పని చేయని పీహెచ్‌సీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆసుపత్రులు
- నైట్‌డ్యూటీ చేయని కొందరు స్టాఫ్‌నర్సులు
- అత్యవసర స్థితిలో రోగులకు అవస్థలు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ) చీకటి పడితే సేవలు అందించడం లేదు. పీహెచ్‌సీలు పగలే కాకుండా రాత్రుళ్లు కూడా తెరచి ఉంచాలని, అత్యవసర రోగులకు ప్రాథమిక వైద్య సేవలు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. ఇందుకోసం ఆరోగ్య కేంద్రాల్లో రాత్రుళ్ల విధులు నిర్వహించేందుకు స్టాఫ్ నర్సులను కూడా నియమించాయి. ప్రతి రోజూ మూడు షిఫ్టుల్లో స్టాఫ్‌నర్సులు అందుబాటులో ఉండాలి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు వారు సేవలు అందించాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముగ్గురు స్టాఫ్‌నర్సులను నియమించింది. అయితే జిల్లాలో కొన్ని పీహెచ్‌సీలను చీకటిపడగానే మూస్తేస్తున్నారు. దీనివల్ల రాత్రి పూట అనారోగ్యం, అత్యవసర వైద్యం కోసం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. విధిలేని పరిస్థితిలో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రికి వెళుతున్నారు.



రాత్రి 8గంటల ప్రాంతంలో మూసి ఉన్న అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



జగదేవిపేట పీహెచ్‌సీకి తాళం

పనిచేస్తేగా...!?

జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలున్నాయి. వాటిలో కొన్నింటిని సోమవారం ఆంధ్రజ్యోతి పరిశీలించింది. జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాత్రి 8.10 గంటలకు వెళ_గా ఆ ఆసుపత్రి బయట అన్ని లైట్లు వేసి ఆసుపత్రికి మాత్రం తాళాలు వేసుకుని వెళ్లారు. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండాలి. వారి పర్యవేక్షణ లేకపోవటంతో రాత్రి విధులు నిర్వహించాల్సిన స్టాఫ్‌నర్సు కూడా విధులకు డుమ్మా కొట్టారు. ఆ సమయంలో తీవ్ర గాయాలైన 30 ఏళ్ల వ్యక్తిని అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువచ్చారు. పీహెచ్‌సీ మూసివేసి ఉండటంతో అత్యవసరంగా ఆటోలో నెల్లూరులోని రామచంద్రారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సు విధుల్లో ఉండి ఉంటే కనీసం ప్రాథమిక వైద్యం అందించి ఉండేది. అల్లీ పురం పీహెచ్‌సీ సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాసానికి దగ్గరలోనే ఉంటుంది. ఆ వైద్యశాల కోసం సోమిరెడ్డి కోట్ల రూపాయల విలువైన స్థలం కేటాయించటమే కాకుండా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుంటారు కూడా. అలాంటి చోటే రోజంతా వైద్య సేవలు అందకపోవడం గమనార్హం.

● ఇందుకూరుపేట మండలం డేవిస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. రాత్రి 8.30 గంటలకు ఈ ఆసుపత్రిని పరిశీలించగా మూసి ఉంది. ఆసుపత్రిలో రాత్రుళ్ల నర్సులు సక్రమంగా అందుబాటులో ఉండరని, ఇలాంటి వారికి ప్రభుత్వం జీతాలు ఎందుకిస్తోందంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరానికి అతి దగ్గరగా ఉండే పీహెచ్‌సీల్లోనే సేవలు ఇలా ఉంటే ఇక మారుమూల పల్లెల్లో ఆరోగ్య కేంద్రాల పనితీరు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

చర్యలు తీసుకుంటాం



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తెల్లవార్లు తెరచి ఉండాలి. ప్రత్యేకించి రాత్రి పూట ఓ స్టాఫ్‌నర్సు ఉండాలి. ఇందుకోసం నియామకాలు చేప ట్టాము. అయితే కొన్ని పీహెచ్‌సీల్లో స్టాఫ్‌నర్సులు లేక మూసి వేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాంటి కేంద్రాల సిబ్బందిపై చర్యలు తీసుకుం టాం. ఆరోగ్య కేంద్రాలపై వైద్యుల పర్యవేక్షణ ఉండేలా చూస్తాం.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

అధికారుల పర్యవేక్షణ ఏది?

ఆరోగ్య కేంద్రాలు ప్రజలు సక్రమంగా సేవలు అందించేలా వైద్యాధికారులు తరచూ తనిఖీ చేయాలి. గ్రామీణులతో మాట్లాడి ఆసుపత్రి పనితీరును తెలుసుకోవాలి. ప్రత్యేకించి ఎస్టీ, ఎస్సీ, బీసీ కాలనీల్లో అధికారులు పర్యటించి ఆసుపత్రి అందిస్తున్న వైద్య చికిత్సలపై ఆరా తీయాలి. అయితే పలువురు అధికారులు పీహెచ్‌సీల పర్యవేక్షణను పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

జీఎస్టీ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్



జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించామని వాణిజ్యపన్నుల శాఖ నెల్లూరు డివిజన్ జాయింట్ కమిషనర్ వై కిరణ్ కుమార్ చెప్పారు. జాయింట్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నెల్లూరు డివిజన్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం జిల్లాలు ఉన్నాయని, వ్యాపారస్తులంతా వారి జీఎస్టీ రిటర్నులు సకాలంలో క్రమం తప్పకుండా దాఖలు చేసే విధంగా పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. డివిజన్ ఆదాయాన్ని పెంచేందుకు రిటర్నులు దాఖలు చేయని వారిని, టీడీఎస్ మినహాయించబడిన వర్క్స్ కాంట్రాక్టర్లతో జీఎస్టీ చెల్లించే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. వృత్తి పన్ను చెల్లింపుదారులు సకాలంలో ఆ పన్ను చెల్లించాలని కోరారు.



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించండి

● కలెక్టర్ ఆనంద్‌కు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జాతీయ రహదారి కోసం భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఆనంద్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా కార్యదర్శి మంగలం పుల్లయ్య మాట్లాడుతూ భారతమాల పేరుతో జిల్లాలో 108 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోందన్నారు. ఇందుకోసం ఆరు మండలాల్లోని 38 గ్రామాల్లో 980 ఎకరాల భూసేకరణ జరుగుతోందని తెలియచేశారు. ఈ క్రమంలో భూములు కోల్పోతున్న రైతులకు నామమాత్రంగా నష్టపరిహారం చెల్లిస్తున్నారని ఆరోపించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బహిరంగ మార్కెట్ విలువకు మూడింతలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు, ఆదిశేషయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రేడ్ అవార్డులకు గ్రామాలు పోటీపడాలి

- ప్రభుత్వం సూచించిన విధంగా మౌలిక సదుపాయాలు కల్పించండి
- జడ్పీ సీఈవో మోహన్‌రావు, డీపీవో శ్రీధర్‌రెడ్డి



అవార్డులు అందుకున్న జడ్పీ ఉద్యోగులతో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహన్‌రావు, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీలు ఏ గ్రేడ్, ఏ ప్లస్ గ్రేడ్ అవార్డులకు పోటీపడేలా పల్లెలను తీర్చిదిద్దాలని అధికారులను జిల్లాపరిషత్ సీఈవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. పంచాయతీల పురోగతిపై జిల్లా పరిషత్ కార్యాలయంలో గురు వారం ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఎంసీవోల కు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ హాజరై తరగతులను ప్రారంభించారు. సీఈవో, డీపీవో మాట్లాడుతూ 2022 నుంచి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. పంచాయతీలకు కేంద్రం అవార్డులు ప్రకటిస్తుందని తెలిపారు. 2022-23 సంవత్సరానికిగాను జిల్లా నుంచి ఎక్కువగా డీ గ్రేడ్‌కు పంచాయతీలు ఎన్నికయ్యాయని చెప్పారు. ఈ పరిస్థితిని అధిగమించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిందని తెలిపారు. 2023-24 కుగాను పంచాయతీలు ఏ గ్రేడ్, ఏ ప్లస్ గ్రేడ్‌లకు పోటీపడాలని ప్రభుత్వం ప్రత్యేక విధి, విధానాలను రూపొందించిందన్నారు. అందుకు అనుగుణంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పంచాయతీల పనితీరుకు సంబంధించిన అంశాలు ప్రత్యేక ఫోల్డర్‌లో పొందుపరిచి, దేశంలోనే అవార్డులు పొందడంలో ప్రథమంగా నిలిచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. దీనికోసం ఎంపీడీవోలంతా గ్రామ స్థాయి అధి కారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిం చాలని ఆదేశించారు.

అవార్డుల పంపిణీ

జడ్పీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రకటించారు. జిల్లా పరి షత్‌లో 31మందికి అవార్డులు ప్రకటించగా, సమయాభావం వల్ల ఆగస్టు 15న జరిగిన వేడుకలో ఐదుగురికే ప్రశంసాపత్రాలు అందజేశారు. మిగిలిన 26మందికి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహన్‌రావు గురువారం అవార్డులను అందజేశారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం అండర్-15 రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 300 జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. క్రీడాకారులకు ఎటువంటి అసౌర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర బ్యాట్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు.

వైభవంగా పోలేరమ్మ తిరుణాళ్ల

- భక్తిశ్రద్ధలతో పొంగళ్లు
- ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను తిలకిస్తున్న ప్రజలు



విశేష పుష్పాలంకరణలో పోలేరమ్మ

కలిగిరి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంపాడులో ఐదురోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తిరుణాళ్ల గురువారం వైభవంగా ముగిసింది. చివరిరోజు ఆలయం వద్ద కొండ తొమ్మిది గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. విశేష పుష్పాలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక అభిషేకాలు, పూజల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రైతులు తమ ఎడ్లబండ్లను, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకొని ఆలయం చుట్టూ కుటుంబసభ్యులతో ప్రదక్షిణలు చేశారు. ఆలయం వద్ద సాయంత్రం నిర్వహించిన ఎడ్లు బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో లెనిన్ ఎంటర్‌ప్రైజెస్, పొట్టేపాలెం-నెల్లూరు రూరల్ (ప్రథమ), పల్లెబోయిన కృష్ణ తేజరెడ్డి, గోగులపల్లి- అల్లూరుమండలం (ద్వితీయ), లెనిన్ ఎంటర్‌ప్రైజెస్, పొట్టేపాలెం-నెల్లూరు రూరల్(తృతీయ), మద్దిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గొల్లపల్లి- ఆత్మకూరు మండలం(నాల్గవ), తాళ్ళ నరసింహ నాయుడు,తిక్క వరం-మర్రిపాడు మండలం (ఐదవ),షేక్ సాజిద్, మునిముర్రై, నెల్లూరు రూరల్(ఆరవ), బాలంరెడ్డి గోవిందురెడ్డి, చౌదరిపాలెం, కావలి రూరల్(ఏడవ), ఏలూరి సుమంత్‌నాయుదు, గౌండ్లవేడు, ఆత్మకూరు మండలంఎనిమిదవ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా 28న నిరసన దీక్ష

● విద్యుత్ పోరాట ఐక్యవేదిక



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 28న నిరసన దీక్ష చేపడుతు న్నట్లు విద్యుత్ పోరాట ఐక్యవేదిక నాయకులు వెల్లడించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గురువా రం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడు తూ స్మార్ట్‌మీటర్ల వల్ల ప్రజలపై రూ.15,400 కోట్ల భారం పడుతుందన్నా రు. సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచం, స్మార్ట్‌మీటర్లు బిగించం అని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు సర్‌చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం వేసేందుకు, స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు సిద్ధపడటం దుర్మార్గమన్నారు. సీపీఐఎంఎల్ నాయకుడు రాంబాబు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే మరోసారి విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు నందిపోగు రమణయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు షానవాజ్, గంగపట్నం రమణయ్య, జిల్లా వ్యవసాయ సంఘం అధ్యక్షుడు లీలా మోహన్, సీపీఎం నాయకులు మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా తదితరులు పాల్గొన్నారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి

● రక్షించిన ఆర్టీసీ సిబ్బంది

ఉదయగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కోనకాలువ వద్ద దాహార్తి తీర్చుకుంటున్న చుక్కల దుప్పిని వీధి కుక్కలు వెంటాడడంతో ఆర్టీసీ సిబ్బంది రక్షించిన సంఘ టన గురువారం ఉదయగిరిలో చోటుచేసుకొంది. వివరాల మేరకు.. అటవీ ప్రాంతం నుంచి దాహం తీర్చుకునేందుకు వచ్చిన చుక్కల దుప్పిని వీధికుక్కలు వెంటాడడంతో అది ఆర్టీసీ డిపోలోకి పరుగులు తీసింది. అక్కడి సిబ్బంది దానిని రక్షించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఏబీవో వెంకటేశ్వర్లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని స్వాధీనం చేసుకుని దుర్గంపల్లి అటవీ ప్రాంతంలో వదిలారు.



దుప్పిని రక్షించిన ఆర్టీసీ సిబ్బంది